మార్చి 2016 మాఘము - ఫాల్గుణము | శాలివాహన శకం 1937 ₹ 5

ఆంధ్రప్రదేశ్

సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్ర ప్రగతి రథ చక్రాలు ఊపందుకుంటున్నాయి. ఈ ఏడాది మూడు త్రైమాసికాల్లో 10.5 శాతం అభివృద్ధి సాధించి, ఆంధ్రప్రదేశ్ దేశాభివృద్ధి రేటుని దాటింది. ఇక ఇప్పుడు సంక్షేమంతో కూడిన అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.



ప్రగతి – సంక్షేమం పడుగుపేకలు

సంక్షేమం – అభివృద్ధి పర్యాయ పదాలు కావని తెలిసిన అరుదైన నేతల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కరు. అయితే, ప్రగతి – సంక్షేమం పడుగుపేకలనీ, నాణేనికి బొమ్మాబొరుసులని భావించే నాయకుడు మాత్రం ఆయన ఒక్కరే. అందుకు, చంద్రబాబు నాయుడు ఇటీవల విజయవాడలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చేసిన ఉద్వేగ ప్రసంగం ఒక తాజా తార్కాణం. ప్రజాసంక్షేమాన్ని కాంక్షించకుండా జరిగేది అసలు అభివృద్ధే కాదని ఆయన నిశ్చితాభిప్రాయం. ప్రగతికి నిజమైన అర్థాన్నిచ్చేది జనక్షేమమేననీ ఆయన కలెక్టర్లకు నొక్కి చెప్పారు. సమీకృత అభివృద్ధి (ఇంక్లూజివ్ గ్రోత్) ఆదర్శాన్ని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. జాతీయ సగటు వృద్ధి రేటు 7.3 శాతం అయితే ఆంధ్రప్రదేశ్ 10.5 శాతం వృద్ధి రేటు సాధించడం వెనక కలెక్టర్లు సమష్టిగా అందించిన సహకారమే కారణమన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటును 15 శాతం సాధించేలా కృషి చేయాలని సిఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.



ఈ సంచికలో...

స్పందన (పాఠకుల లేఖలు) 5

6 జూన్ 15 నుంచి అమరావతి సచివాలయంలో పరిపాలన



నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణంలో తొలి అడుగు పడింది. వెలగపూడిలో సచివాలయ భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు.

6 బ్లాకుల పరిపాలన సముదాయం 9

కాపులకు రిజర్వేషన్లు – ఇవీ వాస్తవాలు 12

బడ్జెట్‌లో భారీ కేటాయింపులపైనే సిఎం గురి 14

ప్రతి జిల్లాలో ఒక మెగా ఫుడ్ పార్క్ 15

ఏపీకి ఆటోమోటివ్ టెస్టింగ్ సెంటర్ 16

అమరావతిలో వెయ్యి కోట్లతో 'హెల్త్ కేర్ సిటీ' 17

రాజమండ్రి సమీపంలో కోకో పార్క్ 18

10 కాపుల సంక్షేమానికి ప్రభుత్వ హామీ



మరింత ఔదార్యం చూపండి 20

'కార్పొరేట్'కు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలు 24

ప్రభుత్వ రాయితీలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ 26

రాష్ట్రంలో మోడల్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ 27

సంక్షేమాంధ్ర సాధనే మన లక్ష్యం 28

పంటసంజీవనితో హరిత విప్లవం 30

ముస్లిముల సంక్షేమానికి సకల చర్యలు 36

వచ్చే మార్చి నాటికి శతశాతం గృహ విద్యుద్దీకరణ 38

నవ్యాంధ్రలో రూ.18వేల కోట్లతో ఓడరేవుల అభివృద్ధి 40

రాష్ట్రంలో 10 కంపెనీలు.. లక్ష కోట్ల పెట్టుబడులు 41

'షి ఆటో'లతో వినూత్న ప్రయోగం 42

వర్తమానం... 44

స్థూలంగా: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక సామర్థ్యం 19

బుద్ధాస్ బౌల్! 47

కథ: కొయ్యగుర్రాలు 48

కిడ్స్ కార్నర్ 54

32 ఐఎఫ్ఆర్ 2016 విశాఖ నావికా తలంలో ఎగిరిన భారత బావుటా!



వ్యక్తిత్వం: మానసిక అవసరాలు ఏవేవి? 55

కవనవనం 56

జీవన మార్గం: మనసుని దైవంగా మార్చుకోవాలి 57

ఓషధీ ప్రస్థానం: ఆకులూ అలములూ – 2 58

దర్శకరత్నాలు: సరిలేరు నీకెవ్వరూ 59

మీరూ శాసనాలు చదవొచ్చు 60

వెండితెర వెనుక 61

తెలుగు లెస్స 62

కొత్తపుస్తకం 64

శ్రీరమణీయం: మౌనముద్రాలంకారుడు ముట్నూరి 66



52 ఏపి అందాలు: దిండి కోనసీమ సిగపువ్వు

ఆంధ్రప్రదేశ్

తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రచురితం

సంపుటి 59 సంచిక 9

శాలివాహన శకం 1937 మాఘము- ఫాల్గుణము

కమిషనర్
డా. పి కృష్ణమోహన్

సంపాదకుడు
కందుల రమేష్ బాబు

నిర్వాహక సంపాదకుడు
నున్నా నరేష్

సహ సంపాదకులు
నీరుకొండ ప్రసాద్
జాస్తి గోపాల ప్రసాద్
డబ్బీరు రామకృష్ణ పట్నాయక్

ముఖచిత్రం
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

రెండవ కవర్
విజయవాడలో జిల్లా కలెక్టర్ల సమావేశం

మూడవ కవర్
ముఖ్యమంత్రి కార్యక్రమాల చిత్రమాలిక

నాల్గవ కవర్
'చంద్రన్న విజయాలు' ప్రకటన

ప్రచురణ
సమాచార, పౌరసంబంధాల శాఖ
సమాచార భవన్, ఎ.సి.గార్డ్స్
హైదరాబాద్ - 500 028
ఫోన్: 040 - 23300258

రూపకల్పన
కార్తీక్ బీసు

ముద్రణ
కాక్స్టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

www.andhrapradeshmagazine.org
Email: apchiefeditor@gmail.com
www.ipr.ap.nic.in

ఇక సంక్షేమాంధ్ర...

అభివృద్ధి, సంక్షేమం నాణానికి బొమ్మా బొరుసూ లాంటివి. రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోవడం ఎంత ముఖ్యమో, ఈ ఫలాలు అందరికి దక్కడం కూడా అంతే ముఖ్యం. ఇవాళ ప్రభుత్వం ఈ రెండింటినీ సమపాళ్లలో ప్రజలకు అందించాలని చిత్తశుద్ధితో చేస్తున్న యత్నాలు భవిష్యత్తుకి శుభసంకేతాలు.

నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటులో రేకెత్తిన సమస్యల వల్ల, రాష్ట్రానికి ఏవిధమైన ఆర్థిక ఆలంబన లేకుండా పోయింది. చితికిన వ్యవస్థని గాడిలో పెట్టి, పరిశ్రమల స్థాపనకి అనుకూల వాతావరణాన్ని నెలకొలిపి, పెట్టుబడులని ఆహ్వానించి, ఉపాధి కల్పనకి పూనుకోవడం మొదటి ప్రాధాన్యంగా ఈ ప్రభుత్వం కృషిచేసింది.

ఇక ఇప్పుడు పాలనావ్యవస్థని పటిష్టం చేయడానికి, ప్రజలకి చేరువుగా పాలనాయత్రాంగాన్ని తీసుకువెళ్లడానికి రంగం సిద్ధం చేసింది. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను విస్తరించింది. రైతుల రుణవిముక్తి మొదలుకొని, పెన్షన్లు పంపిణీ చేయడం, మైనారిటీలకు సాయం, అన్ని వెనుకబడిన తరగతులకు అండగా ఫైనాన్స్ కార్పోరేషన్లు ఏర్పాటు చేయడం వరకూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ యజ్ఞం చేపట్టింది. అడిగిందే తడవుగా, కాపులకు, బ్రాహ్మణులకు రుణాలు అందజేసి, స్వయంఉపాధికి తోడ్పడేందుకు సంస్థలను ఏర్పాటుచేసింది.

నిజం చెప్పాలంటే, సంక్షేమ రంగం మీద ఇంతకుమునుపు ఏ ప్రభుత్వమూ చేయనంత ఖర్చుని చంద్రబాబునాయుడి ప్రభుత్వం చేస్తోంది. సంక్షేమంతో రాజీపడని బడ్జెట్‌ని ఈ ఏడాది ప్రవేశపెట్టాలని స్వయంగా ముఖ్యమంత్రే దిశానిర్దేశం చేశారు.


ఒకవైపు 15 శాతం వృద్ధి సాధించాలని ఆర్థిక లక్ష్యాన్ని నిర్దేశించుకుంటూనే, మరోవైపు ప్రతి కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండాలనే సామాజిక బాధ్యతను నెరవేర్చేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది.

తాజాగా కలెక్టర్ల సమావేశంలో దిశానిర్దేశం చేస్తూ కూడా, సంక్షేమం లేని అభివృద్ధిని ప్రజలు హర్షించరని ముఖ్యమంత్రి స్పష్టం చేయడం ఈ ప్రభుత్వ విధానాన్ని మరోసారి తేటతెల్లం చేసింది.

కందుల రమేష్

కందుల రమేష్ బాబు
ఎడిటర్

Printed and Published by **RAMESH BABU KANDULA** on behalf of Director/Commissioner, Information and Public Relations Dept.; Printed at **M/s Caxton Offset Pvt. Ltd.**, 11.5.416/3, Red Hills, Hyderabad - 500 004; Published at Office of Director/ Commissioner , I&PR Dept, Govt of Andhra Pradesh, Samachar Bhavan, AC Guards, Hyderabad - 500028.
Editor: Ramesh Babu Kandula, Ph: 040-23300258.



అకుంఠితదీక్ష చంద్రబాబుకే సాధ్యం

మొన్నటివరకు సన్‌సెట్‌లాగా మసకగా వున్న ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు 'సన్‌రైజ్ స్టేట్'గా అవతరించి ప్రపంచంలోని ఒక ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుంది. దీని వెనుక కృషి, పట్టుదల, ఓ అకుంఠిత దీక్ష ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిదే. ఫిబ్రవరి 2016 కవర్ పేజీ ముఖచిత్రం ప్రతి ఒక్కరికి గుండె ధైర్యాన్ని ఇచ్చింది. మేక్ ఆంధ్రప్రదేశ్ నినాదాలతో పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, నిరుద్యోగ యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ, మాకు పెద్దన్నగా భరోసా కల్పిస్తూ, అభివృద్ధిలో కాంతి వేగంతో దూసుకుపోతూ ఆంధ్రప్రదేశ్‌కు అభివృద్ధి కాంతులను అందజేస్తున్న మన చంద్రబాబు గారికి అభినందనలు.

– గుగ్గిలం శ్రీహరి, వేటపాలెం, ప్రకాశం జిల్లా.

పారిశ్రామికాంధ్ర అవతరణం

నవ్యాంధ్ర రాజధానికి భారీ స్థాయి పెట్టుబడులు ప్రగతి అంశాలతో మన అమరావతి అపురూప విశేషాలతో ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక నెలనెలా అందించే విశేషాలు అద్భుతం. ఈ పత్రికను చాలా చక్కగా తీర్చిదిద్దుతున్న సంపాదకవర్గం కృషికి జోహార్లు.

– షేక్ జిలానీ (ఈ– మెయిల్ ద్వారా)

కవికొండల గురించి మరికొంత

ఆంధ్రప్రదేశ్ జనవరి 2016 మాస పత్రికలో శ్రీరమణగారు రాసిన కవికొండల వెంకటరావు 'శివరాత్రి ప్రభల' కవిత ఉదహరించారు. కవికొండల వారిని స్వచ్ఛమైన ప్రకృతి కవిగా వారి గేయ కవితలు ఉదహరించిన తీరు చాలా బాగుంది. శ్రీరమణ గారికి నా అభినందనలు. 'కవికొండల' కృతులపై పరిశోధన చేసిన డా.జడప్రోలు విజయలక్ష్మి గారి సమీక్షలో కవిగారు 1892 లో జన్మించి 1969 లో స్వర్గస్తులైనారని పేర్కొన్నారు.

– కె.వి సూర్యనారాయణ, హైదరాబాద్.

చంద్రబాబు కార్యదీక్ష అందరికీ ఆదర్శం

ఫిబ్రవరి 2016 ఆంధ్రప్రదేశ్ సంచికలో 'బ్రాండ్ చంద్రబాబు నేతృత్వంలో భాగస్వామ్య సదస్సు బ్రహ్మాండం' అనే శీర్షికతో ఇచ్చిన విలువైన సమాచారం విలువకట్టలేనిది. నవ్యాంధ్ర ఏర్పడి కొద్దికాలమే అయినా ఎనలేని కృషి చేసి వివిధ రంగాలలో పారిశ్రామికాభివృద్ధికోసం ప్రధానమైన కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలు, వాటిని కార్యాచరణకి తీసుకు వచ్చే చర్యలు అద్భుతం. సమర్థనాయకత్వం ఉంటే...సాధించలేనిదంటూ ఏమీ వుండదనీ, కార్యసాధకుడు అన్ని వేళలా విజయాన్నే పొందుతాడని మరోసారి రుజువయ్యింది.

– ఆదూరి పద్మావతి. హైదరాబాద్

షడ్రుచుల విందు

అమరావతి అదృష్ట భాగ్యరాశిగా నవ్యాంధ్రకు బాసటగా నిలిచింది. తెలుగు లెస్స శీర్షిక ద్వారా తెలుగు వెలుగుబాటలో నడిపించింది. పుస్తక పరిచయాలు శీర్షిక విజ్ఞానదాయకంగా వుంది. వెరసి ఫిబ్రవరి 2016 ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక షడ్రుచుల విందులా ఉంది.

– శిడిగం దొరయ్య, ఏలేశ్వరం

'ఆంధ్రప్రదేశ్' ఏడాది చందా 50 రూపాయలే

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికకు చందాదారులుగా చేరాలనుకుంటున్న వారు వార్షిక చందా నిమిత్తం 50 రూపాయల మనియార్డరును 'అకౌంట్స్ ఆఫీసర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, హైదరాబాద్' పేరిట పంపాలి. (మీరు డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) తీసుకునేట్లయితే, బ్యాంకు నిబంధనల ప్రకారం రూ. 60 కి డిడి పంపాలి.) తమ పూర్తి చిరునామాను, తాము 'ఆంధ్రప్రదేశ్ ' పత్రికను ఏ భాషలో కోరుకుంటున్నారో కూడా ఆ మనియార్డరులో రాయాలి. ఆ మనియార్డర్‌ను ఈ క్రింది చిరునామాకు పంపాలి.

అకౌంట్స్ ఆఫీసర్, ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌర సంబంధాల శాఖ, సమాచార భవన్, ఏ.సి.గార్డ్స్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్ – 500 028.

చందాదారులు తమ చిరునామా మార్పు, కాపీలు అందకపోవడం గురించి ఈ ఫోన్ నెంబరుకు కాల్ చేసి వివరాలు కనుక్కోవచ్చు: 091-9989662462.

రచయితలకు గమనిక

'ఆంధ్రప్రదేశ్' పత్రికపై అభిమానంతో రచనలను పంపుతున్న రచయితలు రచనతోపాటు తమ బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ ఫోటో కాపీ గానీ, బ్లాంక్ చెక్కు కొట్టేసి పంపితేనే, ప్రచురితమైన రచనలు పారితోషికం ఆయా అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని అకౌంట్స్ అధికారి తెలియజేస్తున్నారు. రచయితలూ, రచయిత్రులు దీని ప్రాధాన్యత గ్రహించి, మాతో సహకరించవలసిందిగా కోరుకుంటున్నాం.

– సంపాదకులు

'గొర్రెపాటి' వ్యాసం చాలా బాగుంది

ఫిబ్రవరి సంచికలో జీవిత చరిత్రలు రాయడంలో జీనియస్ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య గారి గురించి జి.ఎ పూర్ణచంద్ గారి వ్యాసం కొండను అద్దంలో చూపినట్టు చక్కగా ఉంది. ఒకగొప్ప వ్యక్తి గురించి సమగ్రంగా రాయాలంటే ఎంత అధ్యయనం ఎంత అవగాహన, ఎంత విషయసేకరణ కావాలో! శరత్ బాబు జీవిత చరిత్రనూ, సుడిగాలి లాంటి సంచలన రచయిత గుడిపాటి వెంకటచలం గారి జీవిత చరిత్రను రాసి మెప్పించడం మాటలు కాదు.

– ఈదుపల్లి వెంకటేశ్వరరావు, ఏలూరు.

పెట్టుబడుల వరదకు మూలకారకుడు చంద్రబాబు

దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు కావడం పెట్టుబడి వరదలకు మూలకారకుడు ఆయనే కావడం మన అదృష్టం. చంద్రబాబు ఒక పెర్మార్మర్, ఒక రిఫార్మర్ అని కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు చేసిన వాఖ్య అక్షరాలా నిజం.

– వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు.

ఆంధ్రప్రదేశ్ (తెలుగు, ఇంగ్లిష్) పత్రికను పాఠకులు ఇంటర్నెట్‌లో www.andhrapradeshmagazine.org లో కూడా చదువుకోవచ్చు.



జూన్ 15 నుంచి
అమరావతి సచివాలయంలో పరిపాలన

నవ్యాంధ్ర సచివాలయ శంకుస్థాపన

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణంలో తొలి అడుగు పడింది. తుళ్లూరు మండలం వెలగపూడిలో సచివాలయ భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. భూమాతకు సాష్టాంగ నమస్కారం చేసి, తాపీ చేతబట్టి లాంఛనంగా నిర్మాణం ప్రారంభించారు. రాష్ట్ర వినాశనాన్ని కోరుకున్న వారే అసూయపడే విధంగా అమరావతిని నిర్మించితీరుతామన్నారు.

జూన్ 15 వ తేదీ నుంచి అమరావతి సచివాలయం నుంచి పరిపాలన సాగిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఫిబ్రవరి 17న గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడి సమీపాన రాష్ట్ర సచివాలయ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. జూన్ 15 వ తేదీనాటికి నూతన భవన నిర్మాణం పూర్తవుతుందని, తాను ఇక్కడ నుంచే కార్యక్రమాలు నిర్వహిస్తానని ముఖ్యమంత్రి వివరించారు. ఇది తాత్కాలిక భవనమని, డబ్బు వృథా చేస్తున్నారని కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది శాశ్వత కట్టడమని, రాజధాని నిర్మాణం పూర్తయిన తర్వాత వివిధ శాఖల కోసం ప్రభుత్వం వినియోగించుకుంటుందని సీఎం చెప్పారు.

కొన్ని బాధ్యతలు మనం కోరుకోకుండా భుజస్కంధాలపైకి వస్తాయని, నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం తనకు అలాంటిదేనన్నారు. నాడు పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని, 1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందన్నారు. విభజనను ఎవరూ కోరుకోలేదని, ఒక కుటుంబ రాజకీయ అవసరాలకోసం రాష్ట్రాన్ని విచక్షణారహితంగా విభజన చేశారని విమర్శించారు.అమరావతిలో తాము నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. విభజన వల్ల మీరెంత కుంగిపోయారో తనకు తెలుసని నిరాశా నిస్పృహల్లో బిడ్డల భవిష్యత్తు ఏమవుతుందో అన్న ఆందోళనలో ఉన్నప్పుడు తనను గెలిపించారన్నారు. మాస్టర్ ప్లాన్ గీసివ్వాలని కోరగానే సింగపూర్ ప్రభుత్వం శరవేగంగా స్పందించిందన్నారు. 'నా మీద విశ్వాసంతో రైతులు 33 వేల ఎకరాల పొలం సమీకరణకు ఇచ్చారు. రాజధాని నిర్మాణాన్ని అనివార్యంగా భుజస్కంధాలపై వేసుకున్నాను' అని చెప్పారు. విభజించిన వారు అసూయపడేలా అద్భుత రాజధాని నిర్మించాలన్నది తన సంకల్పమని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ భూమి నుంచి పరిపాలన సాగిస్తేనే అందరికీ అనువుగా వుంటుందని ఆలోచన చేసి సచివాలయ నిర్మాణానికి చర్యలు వేగవంతం చేశామన్నారు.

రాజధాని నిర్మాణంపై ఈ ప్రాంత వాసుల స్పందన చూసి కదలి పోయానని, నీరుకొండకు చెందిన స్వరాజ్యమ్మ అనే వయో వృద్ధురాలు ఆస్పత్రిలో వుండీ వీల్ చెయిర్ మీద తన కార్యాలయానికి వచ్చి కోటి రూపాయల విరాళం ఇవ్వటం తనకెంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. 'ఈ డబ్బులు నా దగ్గర వుంటే ఉపయోగపడవు. మీకిస్తే రాజధాని నిర్మాణానికి వెచ్చిస్తారు' అని ఆమె విరాళంగా ఇస్తూ అన్నమాటలు తన బాధ్యతను మరింతగా పెంచాయన్నారు.

'సచివాలయం మనందరి దేవాలయం. మన సమస్యలను పరిష్కరించే కేంద్రం. పవిత్రమైన పరిపాలనా భవనం ' అని ఆయన అన్నారు. నాలుగునెలల్లో పూర్తిచేస్తామని తెలిపారు. 'రాజధాని రైతులకు నాడొక్కటే చెప్పాను. నేడూ అదే చెబుతున్నాను. మాటకు కట్టుబడి ఉన్నాను. రైతాంగానికి ఎట్టిపరిస్థితుల్లో అన్యాయం జరగదు. నా మీద విశ్వాసం వుంచి 22,000 మంది రైతులు 33,000 ఎకరాలు భూ సమీకరణకు ఇచ్చారు. ఈ ప్రాంతం బిడ్డలు దేశ విదేశాలకు వెళ్లి చదువుకుని ప్రయోజకులయ్యారు. సమీప భవిష్యత్తులో ప్రపంచదేశాల వారే ఇక్కడికి వచ్చే విధంగా, ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మిస్తాను' అని చంద్రబాబు స్పష్టం చేశారు. 'రాష్ట్ర ప్రజలందరినీ అభ్యర్థిస్తున్నాను. నేను వచ్చి 20 నెలలు అవుతోంది. అన్ని ప్రాధాన్యతా క్రమంలో ఒక్కటొక్కటిగా సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకువెళుతున్నాను.

కొందరు కుల, ప్రాంతీయ వైషమ్యాలను పెంచిపోషిస్తూ, తనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఎక్కడిదో డబ్బుతెచ్చి ఇక్కడ పెడుతున్నానని వక్రీకరిస్తున్నారు. ఇది మా రాష్ట్రం. మా రాజధాని. మాకు సంబంధించింది అనే భావన ప్రతిఒక్కరిలో అంకురించాలి' అని ముఖ్యమంత్రి చెప్పారు.

సమాజంలో పేదలు, ధనికులు..అనే రెండే కులాలున్నాయని, ధనికుల కోసం తాను పనిచేయనక్కరలేదని, పేదలు ఎక్కడుంటే పేదరిక నిర్మూలన కోసం తానక్కడ ఉంటానని చంద్రబాబు తెలిపారు. అభివృద్ధికి కులమతాలే ఆటంకాలని, మత సామరస్యాన్ని కాపాడుకోవాలన్నారు. తన 35 ఏళ్ల రాజకీయ జీవితంలో అభివృద్ధిని అడ్డుకుంటున్న ఇటువంటి ప్రతిపక్షాన్ని చూడలేదని అన్నారు.

ఉద్యోగులను తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని, విభజన తర్వాత ముందుగా వీధుల్లోకి వచ్చి పోరాడింది వారేనని చంద్రబాబు తెలిపారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్జీఓనేతలతో మాట్లాడానని, ఇరుపక్షాల మీద బాధ్యత ఉందని చెప్పానని గుర్తు చేశారు.

ఈ ప్రాంత అభివృద్ధికి కోసం తాత్కాలిక ప్రయోజనాలపై ఆలోచించవద్దని, ఇక్కడికి వచ్చే ఉద్యోగులను ఆదరించాలని, ఆతిథ్యానికి మారుపేరైె వారిని మంచి మనసుతో స్వాగతించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

రాజధానికి కృష్ణమ్మతో పాటు, గోదారమ్మ ఆశీస్సులు ఉన్నాయని, నదుల అనుసంధానంతో గోదావరి నీరు కృష్ణానదికి తీసుకొచ్చామని చంద్రబాబు చెప్పారు.

పోలవరం వచ్చేలాగా పట్టిసీమతో పంటలు ఎండకుండా చూడాలని, కృష్ణానదితో అనుసంధానిస్తే కరవు నివారణ సాధ్యమన్నారు. రాయలసీమకు కృష్ణానది నీటిని ఆమేరకు ఇచ్చి కరవులేకుండా చేయాలన్నది తన ధ్యేయమన్నారు. నిద్రలేచింది మొదలు, నిద్రపోయేదాకా ప్రజల కోసమే కష్టపడుతున్నానని, నిన్న స్విస్ కో చైర్మన్ ను కలిశానని, తర్వాత ముంబై వెళ్లి మేకిన్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్నానని, ఏ పనిచేసినా రాష్ట్రానికి మంచిజరుగుతుందనే విశ్వాసంతోనే కష్టపడి పనిచేస్తున్నట్లు తెలిపారు.

హుద్ హుద్ తో దెబ్బతిన్న విశాఖ త్వరగా కోలుకుని సీఐఐ సదస్సుకు వేదికగా నిలిచిందని, నేవీఫ్లీట్ కార్యక్రమానికి ఆతథ్యమిచ్చిందని చెప్పారు. యాభై దేశాలు మన దేశాధినేతలకు గౌరవ వందనం చేశాయని చంద్రబాబు అన్నారు.

ఈ ఏడాది జూన్ 15వ తేదీ నుంచి ఈ సచివాలయమే పాలనాకేంద్రం. నేను ప్రతి రోజూ ఇక్కడికే వస్తా. నాలుగైదు గంటలు ఇక్కడే ఉంటా. ఈ నేలపై నుంచే పరిపాలన చేస్తా. సచివాలయం మనందరి దేవాలయం. ప్రజాసమస్యల పరిష్కారానికి వేదిక. ఈ ప్రాంతంలో జరిగే అభివృద్ధిలో తొలి లబ్ధిదారులు ఇక్కడి ప్రజలే.

– ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

రాజధాని నిర్మాణానికి 'పెద్ద'మనసు విరాళం కోటి

సీఎం కష్టాన్ని చూసి విరాళమిచ్చానన్న స్వరాజ్యమ్మ



ఆమె ఎనభై వసంతాలు నిండిన వయోవృద్ధురాలు. సాధారణంగా ఈ వయసులో ఎవరైనా తమ ఆస్తిని వారసులకు అప్పగిస్తారు. కానీ ఆమెకు ఈ రాష్ట్రమంటే మమకారం. ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే ఎంతో అభిమానం. అందుకే కష్టార్జితమైన కోటి రూపాయలను నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి విరాళంగా ప్రకటించారు. ఆ దాత పేరు ముప్పవరపు స్వరాజ్యమ్మ. ఊరు గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నీరుకొండ. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి నిర్మాణం కోసం, నవ్యాంధ్రప్రదేశ్‌ను పునాదుల నుంచి నిర్మించేందుకు పడుతున్న కష్టాన్ని చూసి ఈ విరాళం ఇస్తున్నానని ప్రకటించారు స్వరాజ్యమ్మ. విజయవాడలో సీఎంకు స్వరాజ్యమ్మ వీల్ చెయిర్‌పై బంధువులతో వచ్చి చంద్రబాబు నాయుడికి స్వయంగా రూ. కోటి చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి ఆమె పెద్దమనసుకు చలించిపోయారు. 'ప్రపంచం గర్వపడే స్థాయిలో రాజధానిని నిర్మిస్తాను' అని ఆయన స్వరాజ్యమ్మకు భరోసా ఇచ్చారు.

"మీరు ఈ రాష్ట్రం కోసం పడుతున్న ఇబ్బందులను రోజూ చూస్తున్నాను. అందుకే సహాయం చేయాలనిపించింది'అని స్వరాజ్యమ్మ చంద్రబాబుతో అన్నారు. భర్త ముప్పవరపు రామయ్య నాలుగున్నర దశాబ్దాల క్రితమే కాలం చేశారని, తనకు పదహారేళ్ల క్రితం గుండె ఆపరేషన్ అయ్యిందన్నారు. రాజధానికి విరాళంగా ఇచ్చిన కోటి రూపాయలు తన భర్త మరణానంతరం తాను స్వయంగా వ్యవసాయం చేసి సంపాదించిన సొమ్ము అని ఆమె వివరించారు. 'ఈ వయసులో మీరు ఇంత కష్టపడుతున్నారెందుకు బాబూ,' అని ఆమె ముఖ్యమంత్రిని ప్రశ్నించగా, 'మీరు రాజధాని నిర్మాణం కోసం ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా వచ్చారు. నాకు కూడా రాష్ట్రాభివృద్ధికి కృషి చేయటం ఇష్టం,' అని చంద్రబాబు జవాబిచ్చారు.

ప్రజోపయోగ కార్యక్రమాలకు విరాళాలు ఇవ్వటం ఎంతో సంతృప్తిగా ఉందంటున్న స్వరాజ్యమ్మ గతంలో కర్నూలు వరదల సందర్భంలో రూ.2 లక్షల రూపాయలను నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడికే అందజేయటం విశేషం.

విశాఖ సదస్సులో 4 లక్షల 70,000 కోట్ల పెట్టుబడులకు వివిధ దేశాలు ఎంఓయూలు కుదుర్చుకున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. సకారాత్మకంగా పనిచేయటంతో ఇవన్నీ సాధ్యమవుతున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసి విద్వేషాలు రెచ్చగొట్టే వారిపట్ల జాగ్రత్తగా వుండాలని సూచించారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకొని పయనిస్తున్నానని, ఈ నేలతల్లి నిండు మనసుతో ఆశీర్వదిస్తుందన్నారు.

మన దేశంలో 65% యువత 30 ఏళ్ల లోపు వయస్సులోపు వారని, ఇది మనకు సానుకూలాంశమని, చైనా, జపాన్ లలో వృద్ధుల సంఖ్య ఎక్కువగా వుందని వివరించారు. రాజధాని అమరావతి నిర్మాణ క్రమంలో తెలుగువారికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన దివంగత ఎన్టీరామారావును స్మరించుకోవటం సముచితమన్నారు.


పురపాలక శాఖ మంత్రి పి నారాయణ మాట్లాడుతూ 217 చ.కిమీ రాజధాని ప్రాంతంలో, కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, భవనాలు ఉండాలని, అవి ఏర్పడితేనే ఈ ప్రాంత అభివృద్ధి త్వరితగతిన సాధ్యమవుతుందన్నారు. ఇది బహుళ ప్రయోజక ప్రాజెక్టు అని చెబుతూ..కొందరు తాత్కాలిక భవనం అని, రూ.237 కోట్లు వృథా చేస్తున్నారని దుష్ప్రచారం ఆరంభించారని చెప్పారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న పార్టీల పన్నాగాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

సభలో స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, డిప్యూటి స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, శాసనమండలి చైర్మన్ చక్రపాణి, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, వ్యవసాయ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీమతి పరిటాల సునీత, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడారు.

ఇంకా తాటికొండ ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్, నందిగామ ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య, వెలగపూడి సర్పంచ్ శాంతకుమారి, మండలాధ్యక్షులు, జడ్పీటీసీలు వెలగపూడి గ్రామ పెద్దలు, సచివాలయ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ, ఏపీ ఎన్జీఓల నేత విద్యాసాగర్, రెవెన్యూ సర్వీసు ఉద్యోగుల సంఘం తరపున బొప్పరాజు వెంకటేశ్వరరావు మాట్లాడారు.

కలెక్టర్ కాంతిలాల్ దండే సభను నిర్వహించారు. తాటికొండ ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్ భూములిచ్చిన రైతులను నేతలను పరిచయం చేశారు. అమరావతి నిర్మాణానికి దివ్య క్షేత్రాల నుంచి తెచ్చిన పుట్టమట్టిని వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ముఖ్యమంత్రి శంకుస్థాపన ప్రదేశానికి సమర్పించారు. తర్వాత భూమాతకు మోకరిల్లి సాష్టాంగ ప్రణామం చేశారు. ప్రణమిల్లారు. వేదపండితులు శ్రీ నల్లూరు విఖనస భట్టాచార్య, నల్లూరు దాశరథీ శ్రీనివాస దీక్షితులు, రొంపిచర్ల జనార్ధన భట్టాచార్యులు, అగ్నిహోత్రం శ్రీనివాస చక్రవర్తి శాస్త్రోక్త కార్యక్రమాన్ని నిర్వహించారు.

❖




6 బ్లాకుల పరిపాలన సముదాయం

ఆరో బ్లాకులో శాసనసభ, మండలి | ప్రీకాస్ట్ పద్ధతిలో ఏడు దశల్లో నిర్మాణం పూర్తి

నూతన రాజధాని అమరావతికి ప్రభుత్వ కార్యాలయాలను తరలించేందుకు కీలకమైన తాత్కాలిక సచివాలయ భవనానికి ప్రభుత్వం శంకుస్థాపన పూర్తిచేసింది. ఆరు భవనాలుగా నిర్మించనున్న తాత్కాలిక ప్రభుత్వ కార్యాలయాల భవనం నుంచి పరిపాలన కొనసాగించనుంది. తొలి రెండు భవనాలను షాపూర్‌జీ పల్లోంజీ సంస్థ, మిగతా నాలుగు భవనాల నిర్మాణాలను ఎల్‌అండ్‌టీ కన్‌స్ట్రక్షన్ సంస్థ చేపట్టనుంది. పునాదుల నుంచి నిర్మాణం వరకు పూర్తిగా ప్రీకాస్ట్ పద్ధతిలో నిర్మించే ఈ భవనాలను జూన్ నాటికి పూర్తిచేసి, ఆలోగా హైదరాబాద్ నుంచి పరిపాలనను తరలించనుంది. ఆరు భవనాల్లో తొలిరెండు భవనాల ప్రణాళికలను రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) పరిశీలిస్తోంది. ఎల్‌అండ్‌టీ చేపట్టనున్న నాలుగు భవనాల ప్రణాళికలను ఇప్పటికే ఆమోదించింది. ఇందులోనే ముఖ్యమంత్రి కార్యాలయం, తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ అన్నీ ఉంటాయి. కీలకమైన ఆరోభవనం శాసనసభ, మండలిగా ఉపయోగించుకోనుంది. తరువాత ఈ భవనాల సముదాయాలను సీఆర్‌డీఏ పరిపాలన కేంద్రంగా, వాణిజ్య కార్యాలయాలుగా మార్చనుంది. తాత్కాలిక సచివాలయం పేరిట తొలుత జీప్లస్ 1 పద్ధతిలోనే నిర్మించినప్పటికీ, పునాదులు ఏడు అంతస్తుల వరకు నిర్మించేలా వేయనుంది.

తాత్కాలిక సచివాలయం కోసం ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఆరు భవనాలు 25 ఎకరాల విస్తీర్ణంలో రానున్నాయి. ప్రతి భవనం చతురస్రాకారంలో ఉంటుంది. చుట్టూ హరిత వనాలు, పచ్చదనం, పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో సచివాలయ ఉద్యోగులు, విభాగాధిపతులు, కార్యదర్శులు, సంబంధిత మంత్రులు ఆయా విభాగాల కార్యకలాపాలు పర్యవేక్షిస్తారు. మంత్రులు, కార్యదర్శులు, విభాగాలన్నీ ఒకేచోట ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వ శాఖలు తమ అంతర్గత సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా చిన్న సమావేశమందిరాలున్నాయి. సచివాలయానికి వచ్చే సందర్శకులు, పారిశ్రామికవేత్తలు వేచి ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిపాలనలో కీలకమైన సచివాలయ కార్యదర్శులు ఒకేచోట ఉండేలా ఐదోబ్లాకులో ఏర్పాట్లు చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో సచివాలయ కార్యదర్శులు, సమావేశ మందిరాలు, చిల్లర దుకాణాలు, ఫలహారశాలలు ఉంటాయి. నాలుగు సమావేశాలు ఒకేసారి నిర్వహించుకునేందుకు వీలుగా నాలుగు మందిరాలు నిర్మించనున్నారు. తొలినాలుగు బ్లాకుల్లో మాదిరి... ఐదోబ్లాకు మొదటి అంతస్తులో ఉద్యోగులంతా పనిచేసుకునేందుకు వీలుగా నిర్మాణ శైలి ఉంటుంది. ఆరోబ్లాకును పూర్తిగా శాసనసభ, శాసన మండలి సమావేశాల కోసం వినియోగించనున్నారు. ఈ ఒక్కబ్లాకు రెండంతస్తులు ఉంటుంది. రెండో అంతస్తులో అసెంబ్లీ కమిటీలకు స్థలాన్ని కేటాయించారు. అర్ధవృత్తాకార నిర్మాణశైలిలో మండలి, సభ రెండు పక్కపక్కనే ఉంటాయి. దాదాపు 235 మంది కూర్చునేందుకు వీలుగా శాసనసభను ఎల్‌అండ్‌టీ నిర్మించనుంది.

– జాస్తి గోపాలప్రసాద్



కాపుల సంక్షేమానికి ప్రభుత్వ హామీ

పునరుద్ఘాటించిన చంద్రబాబు



తమ వెనకబాటుతనాన్ని అధిగమించేందుకు రిజర్వేషన్లు కావాలన్న కాపుల ఆకాంక్షను రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడో గుర్తించి, అందుకు అవసరమైన చర్యలను చేపట్టింది. అయినా, ఒక దీక్షను అడ్డు పెట్టుకొని, అరాచకం సృష్టించి, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసేందుకు కొన్ని రాజకీయ శక్తులు తెగబడ్డాయి. ఈ విషయాన్ని అటు సామాన్య ప్రజానీకం, ఇటు కాపులు కూడా గ్రహించారు.

ఆంధ్రప్రదేశ్‌లో కాపులకు బీసీ రిజర్వేషన్లు కల్పించాలంటూ ఆమరణదీక్ష చేసిన కాపు నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం దంపతులు... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీతో తమ దీక్షను విరమించారు. కాపులను వెనుకబడిన వర్గాల జాబితాలో చేర్చాలని, కాపుల సంక్షేమ కార్పొరేషన్‌కు ఏటా వెయ్యికోట్లు వంతున నిధులు సమకూర్చాలన్న ప్రధాన డిమాండ్లతో ఆయన ఫిబ్రవరి 5న తూర్పుగోదావరిజిల్లా, కిర్లంపూడిలోని తన స్వగృహంలో ఆమరణ దీక్ష ప్రారంభించారు.

డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రతినిధులను పంపించి ఆయనతో పలుమార్లు సంప్రదింపులు జరిపి, ఒప్పించి, ఎట్టకేలకు ఫిబ్రవరి 9వ తేదీన ఆయనచే దీక్షను విరమింపజేశారు. కాపు ఉద్యమం పక్కదారిపట్టకుండా (రైలుదగ్ధం దుర్ఘటన మినహా), ఉద్రిక్తతలకు అవకాశం కలిగించకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దీక్షను విరమింపజేయడంలో ప్రభుత్వం సఫలమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, టిడిపి రాష్ట్రశాఖ అధ్యక్షుడు, ఎమ్మెల్యే, కాపుల ప్రతినిధి అయిన కిమిడి కళావెంకట్రావు, రామచంద్రాపురం ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు ప్రభృతుల ప్రతినిధి బృందం ఫిబ్రవరి 8న ముద్రగడతో భేటీయై, ఆయనతో చర్చలు జరిపి, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వివరించి, ఆయనను ఒప్పించగలిగారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలతో సంతృప్తి చెందిన ముద్రగడ తన దీక్షను విరమించుకున్నట్లు ప్రకటించారు. ముద్రగడ దీక్షను సాకుగా తీసుకుని రాజకీయంగా రాద్ధాంతం చేయాలనుకున్న ప్రతిపక్షవర్గాలన్నీ ముద్రగడ దీక్ష విరమణతో కంగుతిన్నాయి.

దీక్ష విరమణకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు:

- ఏడు నెలల కాలపరిమితిలోనే బీసీ కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించేలా చర్యలు తీసుకోవడం.
- కాపు సంక్షేమ సంస్థకు ప్రస్తుతం ఇచ్చిన రూ.100 కోట్లకు అదనంగా ఈ ఏడాది బడ్జెట్‌లోనే అదనంగా మరో రూ.500కోట్లు కేటాయించడం. వచ్చే బడ్జెట్ నుంచి ఏటా వెయ్యి కోట్లు కేటాయించడం
- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ వారి అర్హతల ఆధారంగా రుణాలు మంజూరు చేయడం
- కాపు గర్జన సందర్భంగా తునిలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో నిర్దోషులపై కేసులు పెట్టకుండా చర్యలు తీసుకోవడం

ముఖ్యమంత్రి తక్షణ స్పందన

కాపులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారు. వీటిలో ప్రధానమైనవి:

- కాపులను బిసిలుగా పరిగణించాలని కేబినెట్ నిర్ణయం
- కాపు సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు
- కాపులకు ఆర్థిక సాయం అందించేందుకు రూ 100 కోట్ల కేటాయింపు
- కాపులను బిసిల్లో చేర్చడానికి వీలుగా జస్టిస్ మంజునాథ అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు

ఎవరూ అడగకుండానే ముఖ్యమంత్రి ఈ చర్యలన్నీ తీసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా కాపుల చేస్తున్న

డిమాండ్‌ను నిజం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది. అయితే, ఈ లోగా ముద్రగడ పద్మనాభం దీక్షను చేపట్టారు. ఈ దీక్షను అడ్డం పెట్టుకొని, సంఘవ్యతిరేక శక్తులు చెలరేగిపోయాయి. తుని పట్టణంలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు దహనం నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టకే మచ్చలాగా మిగిలింది.

ఇటీవల విజయవంతంగా విశాఖలో భాగస్వామ్య సదస్సు, అటుపిమ్మటే దావోస్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు నేపథ్యంలో తుని హింసాత్మక సంఘటనలు తలవంపులు తెచ్చిపెట్టాయి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుని మంటగలపాలని, ఇప్పుడిప్పుడే శక్తి పుంజుకుంటున్న కొత్త రాష్ట్రాన్ని కుదేలు చేయాలని కుట్రపన్నిన వర్గాలే ఈ అరాచకానికి పాల్పడ్డాయి.

అరాచక వర్గాల ఆగడాలు

ఈ అంశాన్ని రాజకీయం చేసి పబ్బం గడుపుకోవాలని ప్రయత్నించిన వారిపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పుడు కాపు సామాజిక వర్గ రిజర్వేషన్లపై మాట్లాడే వారు ఇన్ని సంవత్సరాలనుంచి ఏమయ్యారని ప్రశ్నించారు. తూర్పుగోదావరి జిల్లా ప్రశాంతతకు మారుపేరని, కాపులు ఎంతో శాంతియుతంగా వుంటారని ముఖ్యమంత్రి చెప్పారు. తూర్పుగోదావరిలో తాను ఇంతటి హింసాత్మక సంఘటనను గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. తూర్పుగోదావరిలో హింసాత్మక ఘటనల వెనుక ఒక రాజకీయ నాయకుడు, ఆయన నాయకత్వంలోని పార్టీ హస్తం ఉందని, ఇది పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవటానికే ఇంతటి దుశ్చర్యలకు, దుర్మార్గాలకు ఒడిగట్టారన్నారు.

కావాలని చేసిన దుశ్చర్య

తునిలో జరిగిన హింసాత్మక సంఘటనలు రాష్ట్రంలో అభివృద్ధి అవకాశాలకు హానికరంగా తయారవుతాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. తుని సంఘటన ఒక పార్టీ నేర మనస్తత్వానికి అద్దం పడుతోందని విమర్శించారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో ఒక పార్టీని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో ప్రజలు పూర్తిగా తిరస్కరించారని, ఆ నాయకుడి రౌడీయిజానికి భయపడే జనం ఓట్లు వేయలేదన్నారు. ఇప్పుడు ఆ పార్టీ వాళ్లు కుల, మత, ప్రాంతాల వారీగా ప్రజల మధ్య విభజన రేఖ సృష్టించాలని యత్నిస్తున్నారని విమర్శించారు.

‘నేటి సమాజంలో ధనికులు, పేదలు అనే రెండే కులాలు ఉన్నాయని, మనం పేదలకు అండగా వున్నాం’ అని సీఎం అన్నారు. ‘ఒక కులంలో పుట్టడమన్నది యాదృచ్ఛికం, మనమెంతో ఉన్నతమైన, విశాలమైన అజెండాతో పనిచేస్తున్నాం’ అని చంద్రబాబు అన్నారు.

‘మనల్ని మన అజెండా నుంచి పక్కకు మళ్లించేందుకు ఇటువంటి శక్తులకు అవకాశం ఇవ్వకూడదు,’ అని సీఎం కోరారు.

యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలంటే సంపద సృష్టించాలన్నారు. ఇందుకోసం జాతీయ సగటు వృద్ధిరేటు మించి వృద్ధి సాధించాలని చెప్పారు. అసాంఘిక శక్తులు రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చాలని చూస్తున్నాయని విమర్శించారు. విశాఖపట్నంలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సిఐఐ) సదస్సును ఘనంగా నిర్వహించామని, రూ. 4.8 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు వచ్చాయని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుచేశారు. ఆ విజయోత్సాహంతో తాను దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు హాజరయ్యానని గుర్తుచేశారు. దావోస్ పర్యటన దిగ్విజయంగా పూర్తిచేశానన్నారు. 2019 జాతీయ క్రీడలను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించటానికి సిద్ధమవుతున్నామని చంద్రబాబు తెలిపారు.

❖

FORM IV (see Rule 8)

Statement about ownership and other particulars of the ‘Andhra Pradesh’ English Monthly Hyderabad as required under rule 8 of the Registration of News Paper (Central) Rules, 1956.

1.	Place of Publication	: Hyderabad
2.	Periodicity of Publications	: Monthly
3.	Printer’s Name	: Ramesh Babu Kandula On behalf of Commissioner, I&PR (on behalf of State Govt.of A.P)
	Whether Citizen of India?	: Yes
	Address	: Samachar Bhavan, A.C. Guards, Masabtank, Hyderabad – 500 028.
4.	Publisher’s Name	: Ramesh Babu Kandula On behalf of Commissioner, I&PR (on behalf of State Govt.of A.P)
	Whether Citizen of India?	: Yes
	Address	: Samachar Bhavan, A.C. Guards, Masabtank, Hyderabad – 500 028.
5.	Editor’s Name	: Ramesh Babu Kandula On behalf of Commissioner, I&PR on behalf of State Govt.of A.P.)
	Whether Citizen of India?	: Yes
	Address	: Samachar Bhavan, A.C. Guards, Masabtank, Hyderabad – 500 028.
6.	Name & Address of Individuals who own the Newspaper	: COMMISSIONER, Information & Public Relations Department, A.C. Guards, Masabtank, Hyderabad – 500 028.

I, Ramesh Babu Kandula, hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

Date : 01-03-2016 Sd/-Ramesh Babu Kandula (Publisher)

కాపులకు రిజర్వేషన్లు - ఇవీ వాస్తవాలు

కాపులను బిసిల్లో చేర్చే విషయం మీద చంద్రబాబు నాయుడి ప్రభుత్వం అన్ని అంశాలను కూలంకషంగా పరిశీలించి, పకడ్బందీగా ముందుకు వెళుతోందని ఈ నేపధ్యం చూస్తే అవగతం అవుతుంది.

- కాపుల రిజర్వేషన్ల అంశంపై రాష్ట్రప్రభుత్వం మొదటి నుంచి స్పష్టంగా వుంది. అందుకే ఒక ప్రాసెస్ ప్రకారం అన్ని చర్యలు క్రమ దశలలో చేపడుతోంది.
- 2014లో మొట్టమొదటి సారిగా కాపులకు రిజర్వేషన్ కల్పిస్తామని తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచింది.
- కాపులకు ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది.(జీవో నెం 12/తేది. 18.12.2015). బడ్జెట్ లో రూ.100 కోట్లు కేటాయించింది.
- ఈ ప్రాసెస్‌లో భాగంగానే 18.01.2016న జస్టిస్ కే.ఎల్. మంజునాథ నేతృత్వంలో బీసీ కమిషన్‌ను నియమించింది. (జీవో నెం.4). 9నెలలలో రిపోర్టు ఇవ్వమని కోరింది.
- 25.08.1994న జారీ చేసిన జీవో.30లో ఏవిధమైన స్పష్టతలేదు. అందులో పొందుపరిచిన విషయాలు అసమగ్రమైనవి.
- కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు రిజర్వేషన్ గురించి ఈ జీవోలో
  - (ఎ) ఎంత శాతం?
  - (బి) ఏ గ్రూపులో?
  - (సి) ఏ ఆర్థిక పరిమితికి లోబడి?
  - (డి) 50% మించితే రాజ్యాంగ రక్షణ...తదితర ముఖ్య విషయాలు ఏమీ లేవు.
- హైకోర్టు కూడా జీవో.30 బీసీ కమిషన్‌కు ఒక విన్నపం మాత్రమే అని పదేపదే చెప్పింది. బీసీ కమిషన్ నివేదిక వచ్చిన తరువాత, దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తరువాత మాత్రమే రిజర్వేషన్లు ఈ కులాలకు వర్తిస్తాయి.
- 'జీవో.30లో ఈ కులాలకు నిర్దిష్టంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నాము అనికూడా చెప్పలేదని' హైకోర్టు పేర్కొనడం గమనార్హం.
- వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వ హయాంలో, దాల్వాయి సుబ్రమణ్యం చైర్మన్‌గా ఉన్న బీసీ కమిటీ, జీవో.30లో పేర్కొన్న 14 కులాలలో 8 కులాలకు మాత్రమే సర్వేజరిపి రిజర్వేషన్ కల్పించారు.
- జీవో 30 జాబితాలో ఉన్న కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్తులకు రిజర్వేషన్ కల్పించలేదు.

ముస్లిం రిజర్వేషన్ల అంశం:

- అదే సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలందరికీ 5 % రిజర్వేషన్ కల్పిస్తూ నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే ఈ రిజర్వేషన్లపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు తప్పుపట్టింది.
- బీసీ రిజర్వేషన్‌ను బీసీ కమిషన్ ద్వారా చేపట్టాలి తప్ప, మైనారిటీ కమిషన్ ద్వారా చేపట్టిన రిజర్వేషన్లు చెల్లవంటూ రాష్ట్రప్రభుత్వ తీరును తప్పు బట్టింది.
- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, ముస్లింలలో ఉన్న సాంఘిక వెనుకబాటును గుర్తించాలంటూ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.
- జాట్‌లకు వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు వర్తించవంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు జాట్లపైనే గాక మొత్తంగా రిజర్వేషన్ల అంశంపైనే ప్రభావం చూపుతోంది.

ఏపీలో 138 కులాలకు బీసీలుగా గుర్తింపు:

- ఇక మన రాష్ట్రానికి వస్తే ప్రస్తుతం రాష్ట్రంలోని 13 జిల్లాల వ్యాప్తంగా 138 కులాల వారిని ఇప్పటికే బీసీలుగా గుర్తించారు.
- దాదాపు వీరి కోటా 50 శాతం వరకు ఉంది. రాజ్యాంగ ప్రకారం ప్రభుత్వం కల్పించే విద్యా, ఉద్యోగపరమైన రిజర్వేషన్లు 50% మించకూడదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రిజర్వేషన్లు పెంచవచ్చు.
- వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించాలని భావించినపుడు, దానిపై వేసిన కమిషన్ రిపోర్టు ఆధారంగా, ఒక చట్టం చేయడం ద్వారా రిజర్వేషన్లు కల్పించవచ్చని సుప్రీంకోర్టు తీర్పు చెబుతుంది.
- ప్రస్తుతం కాపులను బీసీల్లో చేర్చితే తమ కోటాలో కోత విధిస్తారేమోనన్న ఆందోళన ప్రస్తుత బీసీ కులాల్లో వ్యక్తమవుతోంది. ముందుగా ఇతర బీసీ కులాల్లో ఉన్న అపోహను తొలగించాల్సిన అవసరం ఉంది.
- రాష్ట్రంలోని 27% గా ఉన్న కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్థులను బీసీల్లో చేరిస్తే అప్పుడు రిజర్వేషన్ల శాతం 50 శాతానికి మించుతుంది. దీని వల్ల రాజ్యాంగ పరంగా వచ్చే ఇబ్బందులను అధ్యయనం చేయాలి.
- 13 జిల్లాల్లో సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేసి, న్యాయపరమైన చిక్కులు ఏమీ ఎదురుకాకుండా ఉండేలా కాపులను బీసీల్లో చేర్చే విషయంపై నిర్ణయం తీసుకోవాలి.
- ప్రభుత్వంచే నియమించబడిన కమిషన్ ద్వారా సమగ్రమైన సర్వే జరిగి కాపుల్లోని సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో యధార్ధ పరిస్థితులను, వారి వెనుకబాటు తనంను గుర్తించి, ఎంత మేరకు రిజర్వేషన్లు ఇవ్వాలి అన్నది కమిషన్ ముందు తేల్చాల్సి ఉంది.
- సమగ్రమైన పూర్తి స్థాయి రిపోర్టు కమిషన్ నుంచి అందిన తర్వాత తుది నిర్ణయం తీసుకోవల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది.

జీవో 30లో ముఖ్యాంశాలు:

- 25-8-1994న GO MS No. 30 (వెనుకబడిన తరగతుల సంక్షేమం- P2 - శాఖ) లో 14 కులాలు, జాతులను వెనుకబడిన తరగతులుగా గుర్తిస్తూ అప్పటి

ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జీవో 30లో ఏం ఉందంటే..

- "ఈ పరిస్థితుల నేపథ్యంలో, కమిషన్ నివేదిక పెండింగ్‌లో ఉండగా, విద్యాసంస్థలలో సీట్లు, మరియు ప్రభుత్వ/స్థానిక సంస్థల ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించడానికి ఈ అనుబంధ పత్రంలో పేర్కొన్న కులాలు /జాతులను సాంఘీకంగా మరియు విద్యాపరంగా వెనుకబడిన వారిగా పరిగణిస్తూ ఆదేశాలు జారీ చేయడమైనది.

అనుబంధ పత్రంలో 14 కులాలు:

- ముస్లిములు, కాపులు, బలిజలు, తెలగలు, ఒంటరిలు, అయ్యకార, కసికపిడి, పాత్ర, గాజుల బలిజ, నగరాలు, పొందర, కూరాకుల, అవురష్, పాలఅకారి
- ఈ కులాలు, జాతులను వెనుకబడిన తరగతులలో చేర్చడం వల్ల ఇప్పటికీ వెనుకబడిన తరగతులుగా గుర్తించబడిన వారి కోటాకు ఏమాత్రం భంగం వాటిల్లదు.
- "కమిషన్ నివేదిక అందిన తర్వాత ప్రభుత్వం ఈ క్రింది విషయాలపై ప్రత్యేక ఉత్వర్వులను జారీ చేస్తుంది.

i) ఈ ఉత్తర్వుల ద్వారా వెనుకబడిన తరగతులలో చేర్చబడిన వారికి ఇవ్వవలసిన రిజర్వేషన్ శాతం

ii) వారు ఏ గ్రూప్ / వర్గీకరణ / తరగతులు గా పరిగణించబడతారు

iii) వారు రిజర్వేషన్ సౌకర్యాలు పొందడానికి నిర్ధేశించవలసిన ఆర్థిక స్థోమత

- "ఈ ఉత్తర్వుల ద్వారా కల్పించబడుతున్న రిజర్వేషన్లు ఇప్పటికే ఉన్న రిజర్వేషన్లకు అదనం కావడం వల్ల, 50% పై బడిన రిజర్వేషన్లు పొందుపరచడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకొంటుంది."

జీవో 30 పై హైకోర్టు తీర్పు:

- జీవో నంబర్ 30పై అనేక వ్యాజ్యాలు హైకోర్టులో దాఖలయ్యాయి. 7 ఏప్రిల్ 1995న ముగ్గురు జడ్జీల హైకోర్టు బెంచి తమ తీర్పును వెలువరిస్తూ ఈ విధంగా వ్యాఖ్యానించింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు:

- 'GO MS నంబర్. 30/తేదీ 25-8-1994, కొన్ని కులాలను వెనుకబడిన తరగతుల జాబితాలో పొందుపరుస్తూ జారీ చేయడం జరిగింది. కానీ ఈ కులాలను వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చడం సరియైనదా కాదా అనే విషయాన్ని వెనుకబడిన తరగతుల కమిషన్ తేల్చాల్సి ఉంది. కమిషన్ ఈ విషయాన్ని పరిశీలించి అనుకూలంగా గానీ వ్యతిరేకంగా గానీ ప్రభుత్వానికి తన సిఫారసులను పంపవచ్చు. దానిని ఆధారం చేసుకొని ఆంధ్రప్రదేశ్ చట్టం 20/93 ప్రకారం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. ప్రభుత్వం వెనుకబడిన తరగతుల కమిషన్ రిపోర్ట్ తీసుకొని నిర్ణయం ప్రకటించకుండా, ముందుగా నిర్ణయం తీసుకొని దీనిని వెనకబడిన తరగుతుల కమిషన్‌కు నివేదించింది. ఈ జీవోని చదివినప్పుడు జీవోలో పొందుపరిచిన కులాలకు రిజర్వేషన్లు ఇస్తున్నామని స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించలేదు. దీనిని కమిషన్ ఒక రిక్విజిషన్‌గా మాత్రమే భావించవచ్చు.' (పేరా 19, హైకోర్టు ఉత్తర్వులు తేది 7-4-1995)

హైకోర్టు ముందు రాష్ట్రప్రభుత్వం తరపున వాదించిన అడ్వకేట్ జనరల్ మాట్లాడుతూ,'బీసీ కమిషన్ నివేదిక వచ్చే వరకు ఈ జీవోను అమలు చేయమని, అప్పటివరకు కమిషన్ కు నివేదికగా మాత్రమే పరిగణించాలని' తెలియజేశారు.

- దీనిపై హైకోర్టు వ్యాఖ్యానిస్తూ జీవో30 లో పేర్కొన్న 14 కులాలు, జాతులపై కమిషన్ తన నివేదిక ఇచ్చిన తర్వాత రాష్ట్రప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై రిజర్వేషన్లు ఆధారపడి ఉంటాయని అభిప్రాయపడింది.
- కమిషన్ ఏమి నివేదిక ఇస్తుంది? దానిపై ప్రభుత్వం ఏమి నిర్ణయం తీసుకుంటుంది? దాని వలన రిజర్వేషన్లు 50 శాతం పెరుగుతాయా లేదా, సుప్రీం కోర్టు ఆంక్షలను దాటుతాయా లేదా అనే ఊహాత్మక అంశాల జోలికి తాము పోమని హైకోర్టు వ్యాఖ్యానించింది.
- పై విషయాలను పరిశీలించినప్పుడు జీవో 30 ఒక అసమగ్రమైనదని, బీసీ కమిషన్‌కు ఈ 14 కులాలు, జాతుల పరిస్థితులపై నివేదిక కోరినట్లు మాత్రమేనని స్పష్టమవుతుంది.
- బీసీ కమిషన్ నివేదిక ఇంతవరకు సమగ్రంగా సమర్పించలేదు కనుకనే జీవో 30ని ఆచరణలోకి తేవడం అసాధ్యమవుతుంది.
- 1995 హైకోర్టు తీర్పు తర్వాత హైకోర్టు, సుప్రీంకోర్టులలో రిజర్వేషన్లపై అనేక తీర్పులు వెలువడ్డాయి.
- ఇందిరాసహానీ కేసులో రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని పరిమితిని విధించిన సుప్రీంకోర్టు, అసాధారణ పరిస్థితులలో దీనిని అధిగమించి రిజర్వేషన్లు కల్పించవచ్చని అభిప్రాయపడింది.

ఇప్పుడు జరగవలసినది ఏమిటి?

- కాపులు, బలిజలు, తెలగలు మరియు ఒంటరి కులాలలో పేదరికాన్ని శాస్త్రీయంగా ఎత్తిచూపి కమిషన్ ద్వారా నివేదికను తీసుకొని దానిపై చట్టం తీసుకురావడం ఒక్కటే దీనికి పరిష్కారం.
- ఏ మాత్రమైనా తొందరపడి ఒత్తిళ్లకు లోబడి అశాస్త్రీయ నిర్ణయాలు తీసుకుంటే ఏమౌతుందో 'జాట్ల' రిజర్వేషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు తెలియజేస్తాయి.

జాట్ల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు:

- "9 రాష్ట్రాలలోని జాట్ కులస్థులను కేంద్రప్రభుత్వం వెనుకబడిన బడిన తరగతుల జాబితాలో చేర్చడాన్ని మేము అంగీకరించడం లేదు. జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ దీనికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం దానికి ఆధారిత, ప్రామాణికాలు తదుపరి చర్యలకు దారిచూపేవిగా ఉన్నాయి. ఈ పరిస్థితులలో 4-3-2014వ తేదీన కేంద్రప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను మేము సమర్థించడం లేదు. దీని ఫలితంగా పైన పేర్కొన్న నోటిఫికేషన్ 63, తేది 4-3-2014న కేంద్ర వెనుకబడిన తరగతుల జాబితాలో బీహార్, గుజరాత్ , హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్, ఎన్ సీటీ ఆఫ్ ఢిల్లీ, రాజస్థాన్ లోని భరత్ పూర్, ధోల్ పూర్ జిల్లాలకు చెందిన జాట్ కులస్థులను చేరుస్తూ ఇచ్చిన ఉత్తర్వులు కొట్టివేయడమైనది.'

– దబ్బీరు రామకృష్ణ పట్నాయక్

బడ్జెట్‌లో భారీ కేటాయింపులపైనే సీఎం గురి

ముందస్తు వ్యూహంగా ఢిల్లీ పర్యటన

హామీల అమలు గురించి, ప్రత్యేక అవసరాల గురించి పదేపదే గుర్తు చేసి, ఆంధ్రప్రదేశ్‌కి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులను రాబట్టడానికి ఢిల్లీలోని పెద్దలను ముఖ్యమంత్రి మరోసారి కలిశారు. బడ్జెట్‌కి ముందస్తుగా జరిగిన ఈ వ్యూహాత్మక పర్యటనలో ప్రధానితో సహా పలువురు ప్రముఖులతో జరిపిన భేటీలు.. సమావేశాలు.... సమీక్షలు... మంతనాల్లో ముఖ్యమంత్రి ముందుకు తెచ్చిన జాబితాలో డిమాండ్లు మచ్చుకు కొన్ని:



రైల్వే మంత్రిని కలిసిన చంద్రబాబు

రైల్వే మంత్రి సురేష్ ప్రభును కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రతిపాదనలు సీఎం ఆయన ముందు ఉంచారు.

రాజమహేంద్రవరం, పాతరైల్వే బ్రిడ్జిని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని, విజయవాడ, అమరావతి, గుంటూరును కలుపుతూ రైల్వే మార్గం నిర్మాణంపై ప్రతిపాదన చేశారు. కాకినాడ-పిఠాపురం, నడికుడి-శ్రీకాళహస్తి, రైల్వే లైన్ల నిర్మాణంపై ప్రతిపాదన చేశారు. అట్లాగే గుంటూరు, గుంతకల్లు, డబ్లింగ్ పనులు చేపట్టాలని సురేష్ ప్రభును కోరారు. విశాఖ రైల్వే జోన్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని చంద్రబాబు కోరగా, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేయడానికి రైల్వే మంత్రి వెంటనే అంగీకరించారు. విశాఖ చెన్నై మధ్య మూడవ రైల్వే లైన్ నిర్మాణానికి సత్వరం నిర్ణయం తీసుకోవాలని కూడా ముఖ్యమంత్రి కోరారు.

ఆ విధంగా ఏపి విభజన చట్టంలో పేర్కొన్న విధంగా విశాఖపట్నంలో రైల్వే జోన్ ఫైల్ ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపింది. ప్రధాని మోడి ఓకే అనగానే నవ్యాంధ్రకు రైల్వేజోన్ దక్కనున్నది. ఈ విషయం రైల్వే మంత్రి సురేష్ ప్రభు సీఎం చంద్రబాబుకు వివరించారు.

కేంద్ర ప్రాయోజిత పథకాల రద్దుతో ఏపిపై రూ. 5 వేల కోట్ల భారం

కేంద్ర ప్రభుత్వం పన్నుల్లో రాష్ట్రాల వాటాలను పెంచి కొన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలను తొలగించి, మరికొన్ని కేటాయింపులను తగ్గించి ఒక్కచేత్తో ఇస్తూ, మరో చెత్తో తీసుకుంటున్నారని సీయం చంద్రబాబు ఆక్షేపించారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో సమావేశమై రాష్ట్ర ఆర్థిక దుస్థితిని వివరించి కేంద్రం ఆదుకుంటే తప్ప ముందుకు వెళ్లలేమని చేయూతను ఇవ్వాలని కోరారు. అట్లాగే 14 ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర పన్ను ఆదాయంలో రాష్ట్రానికి ఇచ్చే వాటా 32% నుంచి 42% నికి పెంచిన ఏపికి మాత్రం తగిన సాయం లభించడం లేదన్నారు. 2014-15 లో కేంద్ర పన్నుల్లో వాటాగా రూ. 13,964 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల సీఎస్ఎస్ క్రింద రూ. 11,815 కోట్లు మొత్తం రూ.25,507 కోట్లు కాగా 2015-16 లో వాటా రూ. 22,638 కోట్లు సీఎస్ఎస్ కింద రూ. 7000 కోట్లు మొత్తం రూ. 29,694 కోట్లు వచ్చాయి. అంటే రాష్ట్రానికి పెరిగిన నిధులు రూ. 4,127 కోట్లు మాత్రమే అన్నారు.

వైద్యం, విద్య, పౌష్టకాహారం, మహిళల పురోగాభివృద్ధి వెనుకబడిన వర్గాలకు మద్దతు అంశాల్లో బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ఆర్థిక మంత్రిని కోరారు. గతంలో కేంద్రం ఇచ్చే ప్రత్యేక గ్రాంట్లు ద్వారా కీలక రంగాలకు ఆర్థిక సర్దుబాటు చేసుకోగలిగే వాళ్ళం. ఇప్పుడు ఆ గ్రాంట్లను ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు పంపిణీ చేయటంతో న్యాయ వ్యవస్థ, పోలీసు, ఆస్తుల నిర్వాహణ, మొదలైన వాటికి నిధులు తగ్గిపోయాయి కాబట్టి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని కోరారు. కేంద్ర ప్రాజెక్టు పథకాల్లో రాష్ట్రాల వాటాను పెంచడం వల్ల ఏపి పై ఈ ఏడాది రూ.5,000 వేల కోట్లు భారం పడుతుందని రాబోయే సంవత్సరాల్లో ఈ మెత్తం మరింత పెరుగుతుందని ఆర్థిక మంత్రికి వివరించారు. అట్లాగే ఆగష్టులో ప్రారంభం కానున్న కృష్ణా పుష్కరాల నిర్వాహణకు రూ.500 కోట్లు విడుదల చేయాలని ఆర్థిక

మంత్రిని కోరారు. రాష్ట్రంలో రెండవ దశలో గుర్తించిన 163 కరువు మండలాల్లో ఉపాధి హామి పథకం క్రింద పనిదినాలను 150 రోజులకు పెంచాలని కోరారు.

గ్రామీణాభివృద్ధికి రూ.6857 కోట్లు కావాలి

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.6857 కోట్లు కెటాయించాలి కేంద్ర గ్రామీణభివృద్ధి శాఖ మంత్రి చౌదరి బీరేంద్ర సింగ్‌ను కలిసి రెండు వినతిపత్రాలు ఇచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో గత ఏడాది రాష్ట్రానికి రూ. 156.68 కోట్లు కేటాయించాలని అందులో రూ. 112.85 కోట్లు మాత్రమే విడుదల చేశారని మిగిలిన రూ.43.83 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ నీటిసరఫరాకు సంబంధించి ప్రస్తుతం రూ. 1,200 కోట్లతో పనులు జరుగుతున్నాయని దానికి కేంద్రం నుంచి రూ. 1,000 కోట్లు సహాయం చేయాలని అభ్యర్థించారు. జాతీయ నీటిసరఫరా ప్రాజెక్టులో భాగంగా రూ. 1130 కోట్లతో 720 పనులు చేపట్టమని దానికి కేంద్రం రూ. 101 కోట్లు మాత్రమే ఇచ్చిందని దీని పనులు సకాలంలో పూర్తి చేయటానికి ఈ ఏడాది రూ. 500 కోట్లు విడుదల చేయాలని కోరారు. బహుళ గ్రామాల పథకాలు (ఎంవీఎస్) నిర్వహణకు అదనపు నిధులు ఇవ్వాలని మొత్తం రూ. 462 పథకాలున్నాయని దానికి రూ. 338 కోట్లు అవసరమని కేంద్ర మంత్రిని చంద్రబాబు నాయుడు కోరారు. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద 462 రోడ్లు నిర్మిస్తున్నామని వాటికి రూ. 2,450 కోట్లు అవసరమని కేంద్ర గ్రామీణభివృద్ధి మంత్రికి వివరించారు.



– నీరుకొండ ప్రసాద్

అమరావతి 67 కిమీ రైలు మార్గం సర్వేకు ఆమోదం

ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే బడ్జెట్‌లో మళ్లీ నిరాశే మిగిలింది. రాష్ట్ర విభజన చట్టంలోని కొత్త రైల్వేజోన్‌కు ఈ బడ్జెట్‌లోనూ మోక్షం కలగలేదు.

- గుంటూరు–గుంతకల్లు డబ్లింగ్ లైన్.443 కిమీ దూరం అంచనావ్యయం రూ.4000 కోట్లు
- తిరుపతి రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు తిరుచానూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి. అంచనావ్యయం రూ.10 కోట్లు. సీ క్లాస్ నుంచి బీ క్లాస్ స్టేషన్‌గా మార్పు.
- రాజమండ్రిలో మెమూ రైళ్ల నిర్వహణ, మరమ్మతు కేంద్రం అంచనా రూ.7.2 కోట్లు.
- నిర్మాణంలో ఉన్న రైలు మార్గాలకు బడ్జెట్ కేటాయింపులు
- నంద్యాల–ఎర్రగుంట్ల లైన్‌కు రూ.100 కోట్లు. దీంతో ఈ లైన్ నిర్మాణం ఈ ఏడాదే పూర్తికానుంది.
- జగ్గయ్యపేట–మేళ్లచెరువు–జాన్‌పహాడ్ లైన్‌కు రూ.110 కోట్లు

సర్వేకు ఆమోదం తెలిపిన ప్రతిపాదిత లైన్లు.. కేటాయించిన నిధులు

- డోన్–మహబూబ్‌నగర్ డబ్లింగ్ 175 కిమీ.. రూ.68 లక్షలు
- నల్లపాడు–బీబీనగర్ డబ్లింగ్ 243 కిమీ.. రూ.36 లక్షలు
- విజయవాడ – గుంటూరు వయా అమరావతి 67 కిమీ.. రూ.10 లక్షలు
- నర్సాపూర్–మచిలీపట్నం 85 కిమీ.. రూ.13 లక్షలు
- దర్శి–నర్సరావుపేట 65 కిమీ..రూ.10 లక్షలు
- కంభం–ఒంగోలు 115 కిమీ.. రూ.17 లక్షలు
- చిత్తూరు–కుప్పం 118 కిమీ.. రూ.18 లక్షలు
- ఓబుళవారిపల్లి–వాయల్పాడు 150 కిమీ.. రూ.23 లక్షలు
- తుని–కొత్తవలస వయా నర్సీపట్నం 112 కిమీ.. రూ.17 లక్షలు

ఇతర కేటాయింపులు

- ఉత్తరాది–దక్షిణాదితో పాటు తూర్పుకోస్తా మార్గాన్ని అనుసంధానించేలా పీపీపీ విధానంలో విజయవాడ–ఖరగ్‌పూర్‌ల మధ్య ప్రత్యేక సరుకు రవాణా కారిడార్.
- తిరుపతి స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సదు–పాయాలు, స్టేషన్ సుందరీకరణ.

❖

ఏపీకి ఆటోమోటివ్ టెస్టింగ్ సెంటర్

- దొనకొండలో వాహన రంగ పరిశోధన కేంద్రం
- రూ.2వేల కోట్ల పెట్టుబడితో ముందుకొచ్చిన అప్లాజ్ కంపెనీ

రాష్ట్రంలో రూ.2000 కోట్ల పెట్టుబడి పెట్టడానికి మరో ఆటోమొబైల్ కంపెనీ ముందుకొచ్చింది. స్పెయిన్‌కు చెందిన అప్లాజ్ ఐడియాడా కంపెనీ, ఇండియాకు చెందిన ఎస్ బాలన్ గ్రూపుతో కలిసి ఏపీలో స్మార్ట్ కంప్రహెన్సివ్ ఆటోమోటివ్ టెస్టింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటోంది. ఈ రెండు గ్రూపుల ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేశారు.

రాష్ట్రంలోని దొనకొండ ప్రాంతంలో సుమారు వెయ్యి ఎకరాలలో ఏర్పాటుచేయనున్న ఈ వెహికిల్ టెస్టింగ్ కేంద్రం ద్వారా వెయ్యిమందికి పైగా ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. దేశంలో ఈ తరహా వాహన పరీక్షాపరిశోధన కేంద్రం ఏర్పాటు ఇదే మొదటిసారి అవుతుంది. పూనే, మనేసార్, ఇండోర్, చెన్నయ్‌లలో ఇప్పటికే చిన్నస్థాయి ఆటోమోటివ్ టెస్టింగ్ సెంటర్లు వున్నా భారీస్థాయి సామర్థ్యాలతో ఇంత పెద్ద ఎత్తున పెట్టుబడులతో ఏర్పాటవుతున్న కంపెనీ ఇదే అవుతుంది.

ఆటోమొబైల్ పరికరాలు, వాహనాల టెస్టింగ్ కోసం ఈ సంస్థ ప్రత్యేకంగా విభిన్న తరహా రహదారులు, భూభాగంతో కూడిన ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సివుంటుంది. దీనికోసం 800 ఎకరాల నుంచి వెయ్యి ఎకరాల వరకు స్థలం అవసరమవుతుందని సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆటోమోటివ్ మాన్యుఫాక్చరర్లు, వెహికిల్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్లు (ఓఈఎం) కాంపొనెంట్ సప్లయర్లు, టైరు తయారీదారులకు ఎంతో ఉపయుక్తమైన ఈ టెస్టింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ అడ్వాన్స్ ఆటోమోటివ్ టెక్నాలజీని ఇండియాకు పరిచయం చేయనున్నది.

రాష్ట్రంలో నిర్మించే రహదారుల విషయంలో కూడా ఆధునిక సాంకేతికతను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సందర్భంగా చెప్పారు. ఇన్నోవేటివ్ ఐడియాలతో ముందుకొచ్చే పారిశ్రామిక సంస్థలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అప్లాజ్ గ్రూపు డైరెక్టర్ రమోన్ జెబలా, ఇండియా బిజినెస్ యూనిట్ డైరెక్టర్ మ్యాండిప్ ఎస్ టక్, బాలన్ గ్రూపుకు చెందిన అప్లాజ్ సంస్థ ఇండియా పార్టనర్ పునీత్ బాలన్, ఇంకా ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో జే. కృష్ణకిశోర్, ముఖ్యమంత్రి కార్యదర్శి సాయి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి శ్రీప్రద్యుమ్న పాల్గొన్నారు. ఇలావుంటే, ఇసుజు కంపెని ప్రతినిధులు కూడా ముఖ్యమంత్రిని కలిశారు. భారత్‌లో తమ కంపెనీ ప్రణాళికలపై చర్చించారు.

❖

అమరావతిలో మరో మెగా మెడికల్ వర్శిటీ

- ముందుకొచ్చిన 'అమృత'
- రూ.2500 కోట్లతో క్యాంపస్ ఏర్పాటు
- 2250 పడకల ఆసుపత్రి, పరిశోధన, ఆరోగ్య సంరక్షణ కేంద్రం ఏర్పాటు

మన రాజధాని అమరావతి ముంగిట్లోకి మరో భారీ మెడికల్ ప్రాజెక్టు వచ్చి చేరింది. భారతదేశంలో ఉత్తమ పరిశోధనా విశ్వవిద్యాలయంగా పేరొందిన అమృత యూనివర్శిటీ ఏపీ కొత్త రాజధానిలో తన క్యాంపస్ ప్రారంభించడానికి ముందుకొచ్చింది. మూడు దక్షిణాది రాష్ట్రాలలో ఐదు క్యాంపస్‌లను కలిగివున్న అమృత విశ్వవిద్యాలయం త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో మెగా వర్శిటీని నెలకొల్పబోతోంది.

మొత్తం రూ.2500 కోట్ల అంచనాలతో త్వరలో నిర్మాణం జరుపుకునే ఈ మెడికల్ యూనివర్శిటీతో పాటు ఒక మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటుచేస్తారు. 2250 పడకల మెగా ఆసుపత్రిగా దీన్ని ఏర్పాటుచేయనున్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో నెలకొల్పే వైద్య విశ్వవిద్యాలయానికి అనుబంధంగా రీసెర్చ్- హెల్త్ కేర్ క్యాంపస్‌ను ఏర్పాటుచేయనున్నారు.

అమృత విశ్వవిద్యాలయం ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి యూనివర్శిటీ, మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై సవివరణ ప్రాజెక్టు రిపోర్టును అందించారు. అమరావతిలో అమృతా యూనివర్శిటీ క్యాంపస్‌ను ఏర్పాటుచేయాలన్న ముఖ్యమంత్రి అభ్యర్ధన మేరకు మాతా అమృతానందమయిదేవి ఈ నిర్ణయం తీసుకున్నట్టు వర్శిటీ ప్రతినిధులు వివరించారు.

'నవ నగరాల కూర్పు'గా ఏర్పాటుకానున్న అమరావతిలో ఇప్పటికే పలు ప్రఖ్యాత సంస్థలు తమ విద్యాకేంద్రాలను నెలకొల్పడానికి ముందుకొచ్చాయి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో బ్రిటన్‌కు చెందిన ఒక సంస్థ అమరావతిలో మెడికల్ సిటీ ఏర్పాటుకు అవగాహన ఒప్పందం చేసుకుంది. అమరావతి ముఖద్వారం మంగళగిరిలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) భారీ ఆసుపత్రి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

తమిళనాడు కేంద్రంగా పనిచేస్తున్న అమృత యూనివర్శిటీ అటు కేరళ, ఇటు కర్నాటకలో కూడా క్యాంపస్‌లను ఏర్పాటుచేసింది. అమెరికాలోని ఐవీ యూనివర్శిటీ, మరికొన్ని ప్రఖ్యాత యురోపియన్ విశ్వవిద్యాలయాలతో స్టూడెంట్ ఎక్ఛేంజి ప్రోగ్రామ్స్ నడుపుతున్న అమృత వర్శిటీ ఉన్నత విద్యారంగంలో కొన్ని ప్రమాణాలను నెలకొల్పింది.

❖

జూన్‌లోగా శంకుస్థాపన..
మూడేళ్లలో పూర్తి

వెయ్యి పడకల ఆసుపత్రి, మెడికల్ కళాశాల నిర్మాణం

ఐయూఐహెచ్‌తో రాష్ట్ర ప్రభుత్వ అవగాహన ఒప్పందం



అమరావతిలో వెయ్యి కోట్లతో 'హెల్త్ కేర్ సిటీ'

హెల్త్ కేర్ రంగంలో ఆంధ్రప్రదేశ్ మరో ముందడుగు వేసింది. ఇండో–యూకే ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్, ఏపీ ప్రభుత్వం మధ్య విశాఖపట్నంలో ఎంవోయూ జరిగింది. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం ఏపీ రాజధాని అమరావతిలో రూ.వెయ్యి కోట్లతో వెయ్యి పడకల మెగా ఆస్పత్రిని నెలకొల్పుతారు. దానికి అనుబంధంగా వైద్య కళాశాల, వైద్య సంబంధిత విభాగాలు, పరిశోధన, శిక్షణా సంస్థలను ఏర్పాటుచేస్తారు. మొత్తం అన్ని విభాగాలు కలిపి 'హెల్త్ కేర్ సిటీ'గా వ్యవహరించే ఈ మెగా ప్రాజెక్టుకు జూన్‌లోగా శంకుస్థాపన జరగనున్నది. హెల్త్ కేర్ సిటీని మొత్తం 36 నెలల్లో పూర్తిచేస్తామని ఐయుఐహెచ్ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు హామీ ఇచ్చారు. యూకే ప్రతినిధులు విశాఖ ఉడా కార్యాలయంలో ముఖ్యమంత్రితో చర్చలు జరిపారు. అనంతరం అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వంద ఎకరాల భూమిని ఈ హెల్త్ కేర్ సిటీ కోసం సమకూర్చనుంది. ఏపీని హెల్త్ కేర్ రంగంలో ప్రపంచ గమ్యస్థానంగా మార్చేందుకు కృషిచేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. దేశంలో ఐయుఐహెచ్ నిర్మించతలపెట్టిన మొత్తం 11 మెగా మెడికల్ ప్రాజెక్టులకు అమరావతిని హెడ్ క్వార్టర్‌గా చేసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి ఈ బృందాన్ని కోరగా, వారు సుముఖత వ్యక్తంచేశారు. ప్రధానమంత్రి గత ఏడాది బ్రిటన్ పర్యటన సందర్భంగా కుదిరిన ఎంవోయూలో భాగంగా అమరావతిలో ఐయుఐహెచ్ హెల్త్ కేర్ సిటీని నెలకొల్పుతోంది.

బ్రిటన్ ప్రమాణాలతో భారతీయులకు అందుబాటులో వుండే ధరల్లో వైద్య సేవలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. కొన్నిదేశాల్లో ఇప్పటికీ వైద్య సేవలు అందుబాటులో లేవని, యుఎస్ వంటి దేశాల్లో వైద్య రంగం అభివృద్ధి చెందినా సేవలు అత్యంత ఖరీదైన వ్యవహారంగా వుందని ముఖ్యమంత్రి అన్నారు. వీరందరికీ గమ్యస్థానంగా వుండేందుకు అమరావతిలో మెగా హెల్త్ కేర్ సిటీని నిర్మించాల్సివుందని చెప్పారు.

ఐటీరంగాన్ని ప్రోత్సహించినట్టే ఇప్పుడు మెడికల్ టూరిజానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. నాణ్యమైన సేవలు అందిస్తే అమెరికా నుంచి కూడా అమరావతికి వైద్యం కోసం తరలివస్తారని అన్నారు. మెడికల్ టూరిజంలో థాయ్‌ల్యాండ్ తర్వాత రెండోస్థానంలో వున్న భారతదేశాన్ని మొదటి స్థానంగా తీసుకెళ్లడంలో ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషించనున్నదని సీయం చెప్పారు.

అమరావతిని అందంగా, ఆధునికంగా నిర్మించడమే కాకుండా విద్యా, వైద్యరంగాలలో మేటిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే ఎమిటీ, ఎస్ఆర్ఎం, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వంటి విఖ్యాత విద్యాసంస్థలు అమరావతి పట్ల ఆసక్తి చూపిస్తున్నాయని అన్నారు. వైద్యరంగంలో ఇప్పటికే అమరావతి పేరు మార్మోగిపోతోందని, రూ.1600 కోట్లతో ఎయిమ్స్ ఏర్పాటుకానుండటం, దుబాయ్‌కు చెందిన షెట్టీ గ్రూపు మరో భారీ ఆసుపత్రిని నెలకొల్పడానికి ముందుకొచ్చిందని గుర్తుచేశారు. త్వరలో హెల్త్ పాలసీని తీసుకొస్తున్నట్టు ప్రకటించారు.

అమరావతిని 'షోకేస్ ఆఫ్ న్యూ టెక్నాలజీ'గా మార్చడానికి ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మార్చిలో మళ్లీ పెట్టుబడుల ఆకర్షణకు అతిపెద్ద రోడ్‌షో నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

భారతదేశంలోని మొత్తం 11 నగరాలలో రూ.10 వేల కోట్లతో మెగా మెడికల్ యూనిట్లు నెలకొల్పుతున్నామని ఐయుఐహెచ్ చైర్మన్ మైక్ పార్కర్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వున్న ప్రముఖ వైద్య సంస్థలు, విశ్వవిద్యాలయాలను అమరావతిలో నెలకొల్పనున్న హెల్త్ కేర్ సిటీకి తీసుకురావడంలో సహకరిస్తామని చెప్పారు. పంజాబ్ చండీగఢ్‌లో 500 పడకల ఆసుపత్రిని నిర్మిస్తుంటే, ఏపీ ముఖ్యమంత్రి వినతి మేరకు ఇక్కడ వెయ్యి పడకల ఆసుపత్రిని నెలకొల్పుతున్నామని ఐయుఐహెచ్ సీఈవో అజయ్ రంజన్ గుప్తా తెలిపారు.

❖

వయసుడిగిన చెట్లకు మళ్లీ యవ్వనం!

రాజమండ్రి సమీపంలో కోకో పార్క్



తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సమీపాన వి2సీ గ్రూప్ త్వరలో 'ఇంటిగ్రేటెడ్ కోకో పార్కు' నెలకొల్పనున్నది. వీటూసీ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.వి రామ్‌కుమార్ నేతృత్వంలో ప్రతినిధి బృందం విజయవాడ సీఎంఓలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో భేటీ అయి చర్చించింది. రూ 250 కోట్ల నుంచి రూ. 300 కోట్ల వ్యయం కాగల కోకో పార్కులో ప్రధాన పరిశ్రమ (యాంకర్ ఇండస్ట్రీ)ని వీటూసీ గ్రూప్ నెలకొల్పుతుంది. పార్కులో అనుబంధంగా ఏర్పాటయ్యే పరిశ్రమల పెట్టుబడి మరో రూ.300 కోట్ల నుంచి రూ.350 కోట్లు ఉంటుందని అంచనా. ప్రస్తుతం గోదావరి జిల్లాలలో 40% కొబ్బరి చెట్లకు 60 ఏళ్లు దాటుతున్నాయని సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. మరో పదేళ్లకు పంట దాదాపు అంతరించిపోయే పరిస్థితి వస్తుందని కొన్ని పరిశోధనల్లో తేలిందని వారు సీఎంకు వివరించారు. ఇప్పటికే కొబ్బరిపంట దిగుబడిలో తరుగుదల కన్పిస్తోందని ప్రతినిధులు తెలిపారు. పూర్తిస్థాయి పంట దిగుబడి మెరుగుపరిచే అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తాము ఉపయోగిస్తామన్నారు. కోకో పార్కు ఏర్పాటు వల్ల కంపెనీలు పంటను వెనువెంటనే కొనుగోలు చేసి అక్కడికక్కడే డబ్బు చెల్లిస్తాయని చెప్పారు.

కోకో పార్కు ప్రధాన పరిశ్రమతో పాటు అనుబంధంగా మరో 15 పరిశ్రమలు వస్తాయని, కొబ్బరి పంట ఉత్పత్తికి గాను రైతులకు అదనపు ఆదాయాన్ని ఆర్జించిపెట్టడం కోకోపార్కు ఏర్పాటు ప్రధాన ధ్యేయమని అన్నారు. కొబ్బరి పంట మార్కెటింగ్ జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానం జరుగుతుందని, ముడి కొబ్బరి పంట, కొబ్బరి నుంచి టెంకాయ, పీచు, ఇలా ప్రతి పదార్థాన్ని వినియోగంలోకి తెస్తామని వీటూసీ ప్రతినిధులు అన్నారు. పంట అభివృద్ధికి ప్రపంచంలో బెస్ట్ ప్రాక్టీసెస్‌ను తీసుకొచ్చి ఇక్కడ ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

కోకో పార్కు ఆధ్వర్యంలో తాము 10 వేల మంది యువరైతుల్ని ఎంపికచేసి ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించటంలో సుశిక్షితులుగా తీర్చిదిద్దుతామని, ఎంటర్ ప్రెన్యూర్స్‌గా మారుస్తామని ప్రతినిధులు వివరించారు. మూడు వేల మంది కొబ్బరి రైతులతో ఒక గ్రూప్ చొప్పున ఏర్పాటు చేస్తామన్నారు. దీనివల్ల వారు కొబ్బరి దిగుబడిలో పరిజ్ఞానం పెంచుకుంటారన్నారు.

కోకో పార్కు వల్ల దిగుబడి తగ్గిపోకుండా యథాస్థితికి తేవచ్చని, కొబ్బరి కాయలు త్వరగా కుళ్లిపోకుండా వాటి ప్రమాణాలు పెంచవచ్చని తెలిపారు. 'ఇంటిగ్రేటెడ్ ఎండ్ టు ఎండ్' విధానంతో కొబ్బరిలో ఏదీ వృథాకాదని చెప్పారు. కోకో పార్కు ఏర్పాటు ద్వారా 1,500 మందికి ప్రత్యక్షంగా, 2,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం కొబ్బరి పంట ఉత్పత్తిలో 75% ఉభయగోదావరి జిల్లాలలో ఉత్పత్తి అవుతుందని, ఇందులో 60 శాతం తూర్పుగోదావరి, 15 శాతం పశ్చిమగోదావరి జిల్లాలలో ఉత్పత్తి అవుతుందని తెలిపారు. కోకో రజను ఉపయోగించి భవనాల టెర్రేస్‌లపై పంటలను వేయవచ్చని, ఉల్లిపాయల సేద్యాన్ని చేపట్టవచ్చని వీ2సీ సీఎండీ వివరించగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ వివరాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.

ఇది నయాపైసా కూడా నష్టం లేని సేద్యపు విధానం (జీరో వేస్ట్ ఫార్మింగ్) అని సీఎండీ తెలిపారు. కొబ్బరి తోటల్లో 500 కోకో విల్లాస్ ఏర్పాటు చేసి కోకో టూరిజాన్ని అభివృద్ధి చేయవచ్చని చెప్పగా, ఈ దిశగా కూడా ఆలోచన చేసి ఆతిథ్య రంగంలో మహిళా సాధికారతకు తోడ్పడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ❖



ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక సామర్థ్యం

అనంతపురము

ఎలక్ట్రానిక్స్, వస్త్ర తయారీ

కడప

వ్యవసాయ, ఆహార శుద్ధి , ఖనిజ ఆధారిత పరిశ్రమలు

చిత్తూరు

వ్యవసాయ, ఆహార తయారీ శుద్ధి పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, వస్త్ర తయారీ, ఆటో మొబైల్స్, ఆటో విడిభాగాలు తయారీ, హెవీ ఇంజనీరింగ్

నెల్లూరు

తోలు పరిశ్రమ, వ్యవసాయ, ఆహార శుద్ధి, వస్త్రపరిశ్రమ, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్స్, ఆటో విడిభాగాల తయారీ పరిశ్రమలు

ప్రకాశం

వస్త్ర తయారీ, గ్రానైట్ పరిశ్రమలు

కర్నూలు

ఖనిజ ఆధారిత పరిశ్రమలు, ఆహార శుద్ధి పరిశ్రమలు

గుంటూరు

సిమెంట్, వస్త్ర తయారీ పరిశ్రమలు, వ్యవసాయ, ఆహార శుద్ధి పరిశ్రమలు

కృష్ణా

పెట్రోకెమికల్, వ్యవసాయ, ఆహార శుద్ధి పరిశ్రమలు, ఆటోమొబైల్స్, ఆటో విడిభాగాల తయారీ పరిశ్రమలు, జీవిత శాస్త్ర విజ్ఞానం, వస్త్ర తయారీ పరిశ్రమలు, ధాతు శోధన విజ్ఞానం

పశ్చిమ గోదావరి

వస్త్ర తయారీ, సిరామిక్స్, వ్యవసాయ, ఆహార శుద్ధి, మత్స్యపరిశ్రమ

తూర్పు గోదావరి

కెమికల్స్, పెట్రో కెమికల్స్, వ్యవసాయ, ఆహార శుద్ధి పరిశ్రమలు

విశాఖపట్నం

వస్త్ర పరిశ్రమ, ఎలక్ట్రానిక్స్, లోహ శోధనా విజ్ఞానం, ఇంజనీరింగ్, జీవితశాస్త్రం పరిజ్ఞానం

విజయనగరం

వ్యవసాయ, ఆహార శుద్ధి పరిశ్రమలు, లోహ శోధనా విజ్ఞానం, మత్స్య పరిశ్రమ

శ్రీకాకుళం

వ్యవసాయ, ఆహార శుద్ధి పరిశ్రమలు, కెమికల్స్, పెట్రో కెమికల్స్, ఖనిజాధారిత పరిశ్రమలు, జీవిత శాస్త్రం



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారూ!

మరింత ఔదార్యం చూపండి

పునర్విభజన చట్టం అమలుపై ప్రధానికి సిఎం లేఖ

ఆర్థికంగా, సంస్థాగతంగానూ మీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయసహకారాలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. 2014- 15 సంవత్సరానికి గాను- ఆర్థిక లోటు అధిగమించడానికి పాక్షికంగా అందించిన రూ 2,303 కోట్లు, వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర 7 జిల్లాలకు ప్రత్యేక నిధుల కింద రూ 350 కోట్లు, కొత్త రాజధాని అమరావతి నిర్మాణానికి విడుదల చేసిన రూ 500 కోట్లతో కలిపి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం 3,153 కోట్లు విడుదల చేసింది. కానీ, 2015-16కి గాను ఇప్పటి వరకూ రూ 700 కోట్లు (7 జిల్లాలకు ప్రత్యేక నిధుల కింద రూ 350 కోట్లు, కొత్త రాజధాని అమరావతి నిర్మాణానికి రూ 350 కోట్లు) మాత్రమే ఇవ్వడం జరిగింది.

మనదేశంలో ఆంధ్రప్రదేశ్ అంతగా కేంద్ర ప్రభుత్వ ఉదారతపై ఆధారపడే రాష్ట్రం మరొకటి లేదనేది మీకు తెలిసిందే. రాబోయే ఆర్థిక ఇబ్బందులను అధ్యయనం చేయకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించడం వల్ల కొత్త రాష్ట్రం ఏపీలో మొదటి 10 నెలలకు గానూ రూ. 16, 079 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడిన విషయం కూడా మీరు ఎరిగినదే. కేంద్ర ప్రభుత్వం, మీరు వ్యక్తిగతంగా రాష్ట్రానికి అందిస్తున్న సహకారానికి మేము సదా రుణపడి ఉంటాము. అయితే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లో ఉన్న పలు హామీలు మరియు అప్పటి ప్రధాన మంత్రి పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లో పొందుపరచిన అన్ని హామీలను రాబోయే కేంద్ర బడ్జెట్ లో అమలు చేస్తారనే విశ్వసిస్తున్నాను. చట్టపరంగా మాకు రావాల్సినవాటినే కోరుతున్నాను.



ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం అమలు చేయాలి

లోటు బడ్జెట్ భర్తీకి, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి, మరియు ప్రజల అంచనాలను అందుకోవడంలో ఆదాయ వనరుల కొరతతో మేం ఇబ్బందిపడుతున్నాము. 2016-17 కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు తగిన ఆర్థిక సహకారాన్ని ఏపీ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ -2014 కు అనుగుణంగా అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

వనరుల లోటు భర్తీకి గ్రాంటు

కొత్తగా ఏర్పడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆదాయ వనరుల అభివృద్ధికి తగిన గ్రాంట్లను కేంద్ర ప్రభుత్వం అందజేయాలని, ఏపీ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ -2014లో సెక్షన్ 46(2) లో పొందుపరచిన విషయం మీకు తెలిసిందే. దీనికి అదనంగా అప్పటి ప్రధాన మంత్రి పార్లమెంట్ లో "ఆంధ్రప్రదేశ్ లో తొలి ఏడాది ఏర్పడే ఆర్థిక లోటును (ముఖ్యంగా అపాయింటెడ్ డే నుండి 14వ ఆర్థిక సంఘం సిఫారసులు ఆమోదం పొందే వరకు) కేంద్ర ప్రభుత్వం 2014-15 కేంద్ర బడ్జెట్ ద్వారా అందించాలని" పేర్కొన్నారు.

7 వెనుకబడిన జిల్లాలలో సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సమగ్ర సమ్మిళిత అభివృద్ధికి నోచుకుని జాతీయ స్థాయిలో జరిగే అభివృద్ధిని అందుకోవాలంటే ఒక్కో జిల్లాకు రూ. 200 కోట్ల చొప్పున 7 జిల్లాలకు ప్రతి ఏటా అభివృద్ధి గ్రాంటును అందించాలని కోరుతున్నాం.

అయితే దీనికి భిన్నంగా, 02-06-2014 నుంచి 31-03-2015 వరకూ ఆర్థిక లోటు రూ. 16,079 కోట్లుగా ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ ధృవీకరించినప్పటికీ మేము కేవలం రూ. 2,303 కోట్లు మాత్రమే అడ్‌హాక్ గ్రాంట్ గా పొందడం జరిగింది. మాకు ఇవ్వాల్సిన మొత్తంలో మిగిలిన రూ.13,776 కోట్లు సాధ్యమయినంత త్వరగా విడుదల చేయాలని అభ్యర్థిస్తున్నాను. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ బకాయిలలో మొదటి సగాన్ని ఈ ఏడాది, మిగతా సగాన్ని వచ్చే ఏడాది విడుదల చేస్తారని భావిస్తున్నాను. దానికి తగ్గట్టుగా 2016-17 బడ్జెట్ లో అవసరమయిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తారని ఆశిస్తున్నాను.

రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి సహకారం

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం -2014లోని సెక్షన్ 46(3) ప్రకారం, కేంద్ర ప్రభుత్వం ఏపీలోని వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక నిధులిచ్చి అభివృద్ధికి సహకారం అందించాలి. అంతేకాకుండా సెక్షన్ 94(3) ప్రకారం కొత్తగా ఏర్పడే రెండు రాష్ట్రాలలోని వెనుకబడిన ప్రాంతాలలో భౌతిక, సాంఘిక మౌలిక వసతుల విస్తరణతో సహా అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన ప్రాంతాలు ప్రత్యేకించి రాయలసీమ మరియు ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి కొరాపుట్- బొలంగీర్ ? కలహండి ప్రత్యేక ప్యాకేజ్ మరియు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ లో ఉన్న బుందేల్ ఖండ్ ప్రత్యేక ప్యాకేజ్ తరహాలో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని ఇస్తామని అప్పటి ప్రధానమంత్రి వాగ్దానం చేశారు.

దక్షిణాది రాష్ట్రాలకు భిన్నంగా 3 ఉత్తరాంధ్ర జిల్లాలు, 4 రాయలసీమ జిల్లాలు ప్రత్యేక ప్రతిపత్తి రాష్ట్రాలకు సారూప్యంగా ఉన్నట్లు అన్ని ఆర్థిక, మానవాభివృద్ధి సూచికలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ జిల్లాలలో ఆర్థిక వృద్ధి చోదకాల కొరత నెలకొనడమే కాకుండా ఎటువంటి మౌలిక వసతులు లేకపోవడంతో పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యం కొరవడి వృద్ధి రేటును అందుకోలేకున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఉదారంగా గత ఏడాది ఒక్కో జిల్లాకు రూ. 50 కోట్లు మరియు ఈ ఆర్థిక సంవత్సరంలో మరో రూ. 50 కోట్లు ఈ 7 జిల్లాలకు అందించడం వల్ల ఆయా జిల్లాలలో ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి దోహదపడింది.

ఈ 7 వెనుకబడిన జిల్లాలలో సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సమగ్ర సమ్మిళిత అభివృద్ధికి నోచుకుని జాతీయ స్థాయిలో జరిగే అభివృద్ధిని అందుకోవాలంటే ఒక్కో జిల్లాకు రూ. 200 కోట్ల చొప్పున 7 జిల్లాలకు ప్రతి ఏటా అభివృద్ధి గ్రాంటును అందించాలని కోరుతున్నాను.

పారిశ్రామికాభివృద్ధికి ప్రోత్సాహకాలు

పారిశ్రామికీకరణ మరియు ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు పన్ను రాయితీలతో సహా కావలసిన ఆర్థిక ప్రోత్సాహకాలను కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశం పునర్విభజన చట్టం -2014లో సెక్షన్ 94(1) చెబుతోంది. రాయలసీమ మరియు ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేకమైన ప్రోత్సాహకాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక డెవలప్ మెంట్ ప్యాకేజీని అందించాలని సెక్షన్ 46(3) పేర్కొంది. ఒక వైపు లోటు బడ్జెట్ ను పూడ్చుకోవడం, మరో వైపు పెట్టుబడులను ఆకట్టుకోవడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధి సాధించి ఆర్థిక రంగాన్ని పటిష్ట పరచుకునేందుకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారం, వ్యవస్థాగత సహకారం ఆంధ్రప్రదేశ్ కు అవశ్యం. అదనపు తరుగు రాయితీ 15%, అదనపు పెట్టుబడి రాయితీ 15% ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. అయితే పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ ప్రోత్సాహకాలు సరిపోవు. గతంలో కొన్ని ఇతర రాష్ట్రాలకు మంజూరు చేసిన రాయితీలతో పోల్చుకుంటే ఇవి చాలా స్వల్పం. ఉత్తరాఖండ్ మరియు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు 100% సెన్ వ్యాట్ తో సహా పదేళ్ల పాటు ఆదాయపు పన్ను, సేవా పన్నును మినహాయించారు. కాబట్టి గతంలో ఈ పరిస్థితుల్లో ఉన్న మిగిలిన రాష్ట్రాలకు ఏ విధమైన ప్రోత్సాహకాలనిచ్చారో అటువంటి ప్రోత్సాహకాలను ఆంధ్రప్రదేశ్ కూ ఇవ్వాలని మరోసారి మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను.

మేక్ ఇన్ ఇండియా కల సాకారం చేయడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామిక అభివృద్ధి అనుకూల వాతావరణం నెలకొల్పేందుకు లెవెల్ ప్లేయింగ్ గ్రౌండ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. ఈ దిశలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామిక ఎస్టేట్ ల అభివృద్ధికి ఈ బడ్జెట్ లో రూ. 1500 కోట్లు కేటాయించాలని మనవి చేస్తున్నాను.

అమరావతికి ఆర్థిక సహకారం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన రాజధానిలో రాజ్ భవన్, హైకోర్ట్, సెక్రటేరియట్, శాసనసభ, శాసనమండలి తదితర ప్రధాన ఇన్ ఫ్రాస్ట్రక్చర్ తో సహా కావలసిన అన్ని సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ఆర్థిక సహకారం అందించాలని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 సెక్షన్ 94(3) లో పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు మధ్య అమరావతి గ్రీన్ ఫీల్డ్ క్యాపిటల్ సిటీ నిర్మాణానికి రూ.1500 కోట్లు విడుదల చేసినందుకు ధన్యవాదాలు.

విజయవాడ మరియు గుంటూరుల మధ్య 217 చ.కి.మీల విస్తీర్ణంలో నెలకొనే అమరావతి నగరం మనదేశంలోనే కాకుండా మొత్తం ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ క్యాపిటల్ సిటీ అవుతుందని తెలియజేసేందుకు సంతోషిస్తున్నాను. మేము అనుసరించిన వినూత్న పథకం ల్యాండ్ పూలింగ్ ద్వారా 54 వేల ఎకరాల భూమిని కేవలం 6 నెలల్లో సేకరించి భూ యజమానులను, రైతులను రాజధాని నగర అభివృద్ధిలో భాగస్వాములను చేయగలిగాం. అమరావతి ల్యాండ్ పూలింగ్ లో భాగం పంచుకున్న రైతులకు కేపిటల్ గెయిన్ ట్యాక్స్ మినహాయింపును ఇవ్వాలని కోరుతున్నాను.

అమరావతి నగర నిర్మాణానికి రాబోయే రెండు దశాబ్దాలలో రూ. లక్షా 20 వేల కోట్లు అవుతుందని ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయి. రాజభవన్, సెక్రటేరియట్, హై కోర్ట్, శాసనసభ, శాసనమండలి భవనాలతో సహా ముఖ్యమైన మౌలిక వసతుల కల్పనకు భూమి అభివృద్ధికి రాబోయే ఐదేళ్లలో



దాదాపు రూ. 42,935 కోట్లు అవుతుందని అంచనా.

అమరావతి నగరం ఆర్థికాభివృద్ధి చోదకంగా రూపొందాలంటే అన్ని జిల్లాలతో ముఖ్యంగా రాయలసీమ జిల్లాలతో రైల్ మరియు రోడ్డు కనెక్టివిటీ ఉండాలి. అంతేగాకుండా విజయవాడ, విశాఖపట్నం మరియు అమరావతి నగరాలకు మెట్రో రైల్ ప్రాజెక్టులు, విశాఖపట్నాన్ని చెన్నై నగరంతో కలిపే హై స్పీడ్ ట్రైన్ తో సహా ఆంధ్రప్రదేశ్ రీ-ఆర్గనైజేషన్ యాక్ట్-2014 లో హామీ ఇచ్చారు. 2018-19 నాటికి ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కావలసిన సాంకేతిక మద్దతు మరియు ఆర్థిక సహకారాన్ని కేంద్రం అందించాల్సి ఉంది.

అమరావతి నగరంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణంతో పాటు ముఖ్యమైన ఇన్ ఫ్రాస్ట్రక్చర్ నెలకొల్పేందుకు మరియు విజయవాడ మెట్రో ప్రాజెక్ట్ నిర్మాణానికి 2016-17 బడ్జెట్ లో రూ. 4 వేల కోట్లు కేటాయించాలని అభ్యర్థిస్తున్నాను. అమరావతి అభివృద్ధి బాండ్ల జారీ తదితర వినూత్న చర్యల ద్వారా రాజధాని నగర నిర్మాణానికి కావలసిన వనరులను పెంచుకోవాలని అనుకుంటున్నాను. అమరావతి ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటులో పెట్టే అన్ని పెట్టుబడులకు పన్ను మినహాయింపు ఇవ్వాలని నేషనల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్ మెంట్ ఫండ్ నుంచి ఆర్థిక సహకారం పొందేందుకు మరియు జీరో కూపన్ బాండ్స్, టాక్స్ ఫ్రీ బాండ్స్ జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇవ్వాలని కోరుతున్నాను.

కొత్త రాజధాని నగరం కేవలం ప్రభుత్వ కార్యకలాపాల కేంద్రమే కాకుండా ఆర్థిక, అధికార మూల కేంద్రమనేది మీకు తెలియనిది కాదు. నూతన రాజధానిలో మౌలిక వసతులు గొప్పగా ఉండడమే కాకుండా పారిశ్రామిక పెట్టుబడులు వేగవంతం కావాలంటే ఈ రెండింటికీ కొన్ని రాయితీలు ఉండాలి. కాబట్టి అమరావతి ప్రాంతంలో అన్ని పారిశ్రామిక పెట్టుబడులకు ఈ క్రింది రాయితీలు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాను.

1. వాణిజ్య ఉత్పత్తి తేదీ నుంచి పదేళ్ల పాటు ఎక్సైజ్ డ్యూటీ మినహాయింపు.

2. మొదటి ఐదేళ్ల కాలంలో 100% ఆదాయపు పన్ను మినహాయింపు. ఆ తరువాత మరో ఐదేళ్ల పాటు వాణిజ్య ఉత్పత్తి తేదీ నుంచి కంపెనీలకు 30% మరియు కంపెనీయేతర సంస్థలకు 25% .

3. ప్లాంట్ ఒ మెషినరీలో పెట్టుబడులకు క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్ సబ్సిడీ 15% (రూ. కోటి మించకుండా).

ప్రత్యేక ప్రతిపత్తి హోదా

"కేంద్ర సహకారం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐదేళ్లపాటు ప్రత్యేక ప్రతిపత్తి హోదా ఇస్తాం. ఇది రాష్ట్ర ఆర్థిక రంగాన్ని పటిష్టం చేసేందుకు దోహదపడుతుంద"ని పార్లమెంట్ లో ప్రధాన మంత్రి హామీ ఇచ్చారు. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా ప్రతిపత్తిగల రాష్ట్రాలకు, ఇతర రాష్ట్రాలకు మధ్య డెవల్యూషన్ విషయంలో ఎటువంటి డిస్టింక్షన్ చూపనప్పటికీ ఆయా రాష్ట్రాల ఆర్థిక సామర్థ్యం, కాస్ట్ డిజిబిలిటీ లో వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రత్యేక హోదా రాష్ట్రాలు మినహాయించి 2019-20 తరువాత కూడా ఆర్థిక లోటుతో సమతమయ్యే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేననే విషయం 14వ ఆర్థిక సంఘం నివేదిక స్పష్టంగా పేర్కొంది. కొన్నేళ్లుగా ఆర్థిక లోటు ఎదుర్కొంటున్న అనేక రాష్ట్రాలు 42 శాతం డెవల్యూషన్ తరువాత 2015-16 నుంచే మిగులు బడ్జెట్ కు చేరుకోనున్నాయి.

ముందుగా, ఆంధ్రప్రదేశ్ ను ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలతో పోల్చి చూసినప్పుడు, కేంద్రం ఆర్థిక రంగాన్ని పటిష్టం చేసే ఆలోచనతో అన్ని రాష్ట్రాలకు కేటాయించిన 12 సంక్షేమ పథకాలకు అయ్యే ఖర్చును నిలిపివేసి ఆ మొత్తాన్ని రాష్ట్రాల్లోని మరో 13 కొత్త పథకాలకు కేటాయించి కేంద్రం తన సహకారం అందించాల్సి ఉంది. రానున్న ఐదేళ్లలో కేంద్రం చేపట్టిన 25 పథకాలను నిర్వహించడం ఆంధ్ర ప్రభుత్వ ఖజానాకు వీలుపడేది కాదు.

పోలవరం నీటిపారుదల ప్రాజెక్ట్

జాతీయ ప్రాజెక్ట్ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టని భారత ప్రభుత్వమే ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్-2014లోని 90 సెక్షన్ చెబుతోంది. ఇందులో భాగంగా పోలవరం ప్రాజెక్ట్ కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయాన్ని రీ ఎంబర్స్ చేయాలని కోరుతున్నాను. 2014-15లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,952 కోట్లు ఖర్చు చేయగా రూ. 345 కోట్లు మాత్రమే రీ ఎంబర్స్ చేశారు. మిగిలిన రూ. 1,607 కోట్లను రీ ఎంబర్స్ చేయాల్సి ఉంది. 2015-16లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,485 కోట్లు ఖర్చు చేయగా ఈ మొత్తాన్ని రీ ఎంబర్స్ చేయాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్ట్ కు సంబంధించి మొత్తం రూ.4,092 కోట్లను రీ ఎంబర్స్ చేయాలని మరియు 2016-17లో కనీసం రూ . 4 వేల కోట్లు కేటాయించేలా బడ్జెట్ లో ప్రతిపాదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

14వ ఆర్థిక సంఘం ప్రభావం

రాబోయే మూడేళ్లలో ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాల వారికి 20 లక్షల పక్కా గృహాలను నిర్మించాలని మేము ప్రతిపాదించాం. కాబట్టి, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని పేదల గృహ నిర్మాణానికి సర్వీస్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలని మరియు హౌసింగ్ ను ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జాబితాలో సబ్ సెక్టార్‌గా పరిగణించాలని అభ్యర్థిస్తున్నాం.

14వ ఆర్థిక సంఘం సిఫారసులను ఆమోదించినందుకు కేంద్ర ప్రభుత్వానికి మా ధన్యవాదాలు. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర ప్రభుత్వ వాటా 32% నుంచి 42%కు పెంచడాన్ని ఆహ్వానిస్తున్నాను. అయితే వాస్తవానికి కేంద్రం నుంచి మా రాష్ట్రానికి జరిగే బదలాయింపు చాలినంత లేదు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా ఒక చేతితో పెంచినట్లే పెంచి మరో చేత్తో కేంద్రీయ సౌజన్య పథకాలలో తీసుకున్నట్లయింది. ఉదాహరణకు 2014-15లో కేంద్ర పన్నుల్లో వాటాగా రాష్ట్రానికి రూ. 13,964 కోట్లు రాగా కేంద్ర సౌజన్య పథకాల కింద గ్రాంటుగా రూ. 11,815 కోట్లు మొత్తం రూ. 25,507 కోట్లు వచ్చాయి. 2015-16లో కేంద్ర పన్నుల్లో మా వాటా రూ. 22,638 కోట్లు కాగా, సీఎస్-ఎస్ గ్రాంట్లు రూ. 7వేల కోట్లు. మొత్తం కలిపి రూ. 29,638 కోట్లు వచ్చాయి. దీనిని బట్టి చూస్తే 2014-15 కన్నా రూ. 4,127 కోట్లు అదనంగా పెరిగాయి. ఇది కేవలం 16% మాత్రమే. ద్రవ్యలోటుతో పోల్చుకుంటే ఇది చాలా స్వల్పం. మా రాష్ట్రంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ఏ మాత్రం చాలనిది.

రాష్ట్రాలకు గ్రాంట్స్ ఇన్ ఎయిడ్

ప్రధాన రంగాలలో ఆర్థిక లోటు అధిగమించేందుకు రాష్ట్రాలకు కేటాయించే ప్రత్యేక గ్రాంట్లు 14వ ఆర్థిక సంఘం సిఫారసుల కారణంగా తగ్గడం మరో ఉపద్రవం అయ్యింది. దీంతో పాటుగా న్యాయ వ్యవస్థ, పోలీసు శాఖ, ఆస్తుల నిర్వహణ తదితర అంశాలలో ఆంధ్రప్రదేశ్ కు ఉన్న వనరులు అతి స్వల్పం. దీనిని దృష్టిలో ఉంచుకుని పరిపాలన, ప్రజా సేవా రంగాలను పటిష్టం చేసేందుకు కావలసిన నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందని విశ్వసిస్తున్నాను.

సాంఘిక అభివృద్ధి రంగంలో పెట్టుబడి

మనం శక్తివంచన లేకుండా కృషి చేసినప్పటికీ, తలసరి ఆదాయం తక్కువగా ఉన్న ఇతర దేశాలతో పోలిస్తే మన దేశం మానవ అభివృద్ధి సూచికలో వెనుకబడే ఉంది. వైద్యం, విద్య, పౌష్టికాహారం, మహిళా సాధికారత తదితర ప్రాధాన్య రంగాలలో కేటాయింపులను పెంచి సమాజంలో బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదపడాలని ఈ సందర్భంగా తమకి విన్నవిస్తున్నాను. ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు మరియు మైనారిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వాలు చేసే కృషికి అదనపు సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందించేలా చూడాలి.

స్టేట్ ప్లాన్ స్కీమ్స్ కు కేంద్ర సహకారం

సెంట్రల్లీ స్పాన్సర్డ్ డెవలప్ మెంట్ స్కీంలలో రాష్ట్ర ప్రభుత్వాల వాటా పెరగడం ఆయా రాష్ట్రాల ఆర్థిక రంగానికి అదనపు భారం అయ్యింది. ప్రస్తుత ఏడాదిలో దీని వల్ల రూ. 2,500 కోట్ల అదనపు భారం పడగా రాబోయే సంవత్సరాలలో మరింత పెరగనుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం సెంట్రల్లీ సెక్టార్ ప్లాన్ స్కీం మరియు సెంట్రల్ అసిస్టెన్స్ టు స్టేట్ ప్లాన్ స్కీమ్స్ విషయంలో తన వైఖరిని 2016-17 బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంగా పున:సమీక్షించుకోవాలని కోరుతున్నాము. రాష్ట్ర అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్ ను అమలు చేసే విధానాన్ని పునర్ వ్యవస్థీకరించాల్సి ఉంది.

స్టేట్ ప్లాన్ స్కీమ్స్

ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక వినూత్న పథకాలను, కార్యక్రమాలను ప్రారంభించారు. వీటిలో ప్రముఖమైనది స్మార్ట్ విలేజ్- స్మార్ట్ వార్డ్ కార్యక్రమం. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో భారీ ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంలో ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, స్వచ్ఛంద సంస్థలు మరియు దాతల భాగస్వామ్యం ఉంటుంది. స్మార్ట్ విలేజ్ ట్రస్ట్ కు విరాళాలు అందించే వారికి ఆదాయం పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నాను. రాబోయే మూడేళ్లలో ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాల వారికి 20 లక్షల పక్కా గృహాలను నిర్మించాలని మేము ప్రతిపాదించాం. కాబట్టి, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని పేదల గృహ నిర్మాణానికి సర్వీస్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలని మరియు హౌసింగ్ ను ఇన్ ఫ్రాస్ట్రక్చర్ జాబితాలో సబ్ సెక్టార్ గా పరిగణించాలని అభ్యర్థిస్తున్నాను.

ద్రవ్య పరిమాణం పెంపు

పైన ప్రస్తావించినట్లుగా మా రాష్ట్రం ఆర్థిక పరమైన అంశాలలో రెండిందాలుగా నష్టపోతోంది. ఇన్ ఫ్రాస్ట్రక్చర్ నెలకొల్పడంలో, ప్రజా సేవలలో, కొత్త రాజధాని నిర్మాణం తదితర అంశాలలో ప్రభుత్వ పెట్టుబడులు పెరగనుండడం ఒక ఇబ్బంది. దీని వల్ల మాకు చట్టపరంగా ఉండే రుణ బాధ్యత కన్నా అత్యధిక అవసరాలు ఏర్పడతాయి. ఈ విషయంలో 14వ ఆర్థిక సంఘం ఇచ్చిన అనుమతులు ద్రవ్యలోటు లేని రాష్ట్రాలకు మాత్రమే ఉపయోగకరంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న ద్రవ్యలోటు మేము తెచ్చింది కాదు. రాష్ట్రాల పునర్విభజన వల్ల మాపై రుద్దబడినది. ఇది పూర్తిగా రాష్ట్ర ఆర్థిక నిర్వహణ ప్రభావానికి వెలుపల ఉన్న అంశం. కాబట్టి వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ కు అదనపు ఫిస్కల్ స్పేస్ ఉండేలా కేంద్ర ప్రభుత్వం అనుమతించాలని కోరుతున్నాను.

ముగింపు

పునర్విభజన కష్టాలను మా రాష్ట్రం అధిగమించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకించి కేంద్ర ఆర్థిక మంత్రి అందిస్తున్న సహకారానికి మరోసారి నా కృతజ్ఞతలు. విభజన రాష్ట్ర ఆర్థిక రంగంపై తీవ్ర ఒత్తిడి కలిగించడమే కాకుండా అనేక సవాళ్లను విసిరినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర ప్రజానీకం ప్రతీ సవాల్ ను ఒక అద్భుత అవకాశంగా మార్చుకుని రాష్ట్ర మరియు దేశ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడం ముదావహం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ వార్షికంలో మా రాష్ట్ర జీడీపీ 11.3% నమోదయిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. 15 శాతం వార్షిక జీఎస్ డీపీ వృద్ధి సాధించడమే మా లక్ష్యం. రాబోయే 2 దశాబ్దాలు రెండంకెల సుస్థిర వృద్ధి సాధనే మా సంకల్పం. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలును వేగవంతం చేసేందుకు ఈ బడ్జెట్ లో తగిన కేటాయింపులను చేసి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

– నారా చంద్రబాబునాయుడు
ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్



'కార్పొరేట్'కు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలు

మోకాలిచిప్ప మార్పిడి
శస్త్రచికిత్సకు బ్రాండ్ అంబాసిడర్
మంత్రి కామినేని

మాటలు చెప్పడం సులభమే కానీ ఆచరించడమే కష్టం. కానీ చెప్పిన దాన్ని తానే స్వయంగా ఆచరించి మార్గదర్శకులయ్యారు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలని ఆరోగ్య మంత్రిగా పిలుపునివ్వడమే కాదు, తన శస్త్ర చికిత్స కూడా అదే ప్రజా వైద్యశాలలో చేయించుకొని, ఆ ఆస్పత్రులకి తానే బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు కామినేని.

ప్రతి పౌరుడికి ఆరోగ్యం ప్రాథమిక హక్కు. ఆరోగ్యాన్ని అందరికీ అందించాల్సిన విధి ప్రభుత్వానిది. ఆ రోగులకు ఆపరేషన్లు చేయాల్సిన ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పడకేశాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పాలనలో ఇప్పుడు ప్రభుత్వాసుపత్రులలో అన్నిరకాల వైద్య సదుపాయాలకు నిలయాలై, శస్త్రచికిత్సలకు కూడా మార్గం సుగమం అయ్యింది. ప్రభుత్వాసుపత్రుల్లో వచ్చిన ఈ విప్లవాత్మక పరిణామాల్ని చాటి చెప్పాలని మంత్రి కామినేని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్స జరిపించుకున్నారు.

గుంటూరు ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్)లో వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ మోకాలిచిప్ప మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకుని అందరికి ఆదర్శనీయమయ్యారు.

పునర్వైభవ దిశగా...

రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రికి 70, 80 దశకాలు స్వర్ణయుగం వంటిది. అప్పట్లో రాజకీయనాయకుల నుండి పేద ప్రజల వరకు అందరు ప్రభుత్వాస్పత్రులలో చికిత్స పొందేవారు. గత పన్నెండేళ్ళ నుంచి ప్రభుత్వాసుపత్రులు సామాన్య రోగుల పట్ల నిర్లిప్తత, అవినీతికి మారుపేరుగా నిలిచాయి. ఫలితంగా ఉన్నతవర్గాల నుంచి మధ్యతరగతి వర్గాలు కూడా కార్పొరేట్ హాస్పిటల్స్ దారిపట్టాయి. ఈ నేపథ్యంలో సామాన్యులతో పాటు ఉన్నతవర్గాల రోగులు ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్సలు, శస్త్రచికిత్సలు జరిపించుకోడానికి రావాలన్నది నవ్యాంధ్ర ప్రభుత్వ ఉద్దేశ్యంగా మారింది. గుంటూరు జీజీహెచ్ ఆసుపత్రిని ప్రక్షాళన చేయడంలో భాగంగా గడువు నిర్దేశించుకుని పూర్తిస్థాయిలో పారిశుధ్యాన్ని అమలు చేశారు. జీజీహెచ్ ఆసుపత్రిలో అపరిశుభ్రతను తొలగించి, మరుగుదొడ్లు, భవనాలకు మరమ్మతులు చేశారు. శస్త్రచికిత్స వార్డుల్లో ఏసీలు, అన్ని వార్డుల్లో ఫ్యాన్లు, ఆపరేషను అవసరమైనయంత్రాలు, పరికరాలను సమకూర్చారు. క్రమక్రమంగా మళ్ళీ నాటి పూర్వవైభవం సంతరించుకొంటోదన్న సమాచారం ప్రజలకు చేరుకోవాలన్న లక్ష్యంతో మంత్రి కామినేని ఇక్కడే శస్త్రచికిత్స జరిపించుకోవాలని నిర్ణయించుకొన్నట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో ఉన్న అభద్రత భావనని తొలగించేందుకు మెరుగైన గుంటూరు ఆసుపత్రిని ఉదాహరణగా భావించవచ్చు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేట్ వైద్యుల సేవలు

వైద్య, ఆరోగ్య శాఖ తరపున జనవరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదగా ప్రారంభించిన ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు, తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్, 102 కాల్ సెంటర్, టెలీ రేడియాలాజీ (ఉచిత ఎక్స్ రే), ఆసుపత్రుల పరికరాల నిర్వహణ వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేసి ఫలితాలు లభిస్తున్న వైనం కనపడుతోంది. ప్రభుత్వాసుపత్రిలో నిపుణులైన ప్రైవేట్ వైద్యుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. కీలకమైన విభాగాల్లో నిపుణుల కొరత ఎక్కువుగా ఉన్నందున మెరుగైన వైద్యసేవల కోసం కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి దశలవారీగా ఆర్థిక లావాదేవీలు లేకుండా స్వచ్ఛందంగా వైద్య సేవలు అందించే వైద్య నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇప్పటికే పీపీపీ విధానంలో గుంటూరు జీజీహెచ్ లో గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు.

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో మోకాలిచిప్ప మార్పిడి శస్త్ర చికిత్స చేయడానికి అవసరమైన అన్ని సదుపాయాలు ఉండటం వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా జీజీహెచ్ లో ప్రారంభించారు. రాష్ట్రంలో ఏ బోధనాసుపత్రిలో లేనివిధంగా ఇక్కడ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేశారు. జీజీహెచ్ లోని పోదిల ప్రసాద్ భవనంలో 4 మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్లను రూ.3 కోట్ల వ్యయంతో ప్రవాసాంధ్రులుగా ఉన్న గుంటూరు వైద్యకళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (జింకానా) సహకారంతో ప్రత్యేకంగా నిర్మించారు. ఇందులో ప్రస్తుతం రెండింటిలో గుండె శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. మిగిలిన రెండింటిలో మోకాలిచిప్ప మార్పిడి, వెన్నుపూస శస్త్ర చికిత్సలు వంటివి చేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఈ శస్త్రచికిత్స మందిరాల్లో ఇన్‌ఫెక్షన్ శాతం చాలా తక్కువుగా ఉంటుంది. దీనివల్ల రోగి చాలా త్వరగా కొలుకునేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ శస్త్ర చికిత్స మందిరంలోనే మంత్రి కామినేనికి మోకాలిచిప్ప మార్పిడి శస్త్ర చికిత్స చేశారు.

ప్రస్తుతం మోకాలిచిప్ప మార్పిడి శస్త్ర చికిత్సలు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈ హెచ్ ఎస్)లో ఈ ఆపరేషన్ అందుబాట్లోకి వచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈ ఆపరేషన్ చేయించుకొంటున్నారు. "రోగి ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి ఇంటికి వెళ్ళే రోజు వరకు పైసా ఖర్చులేకుండా ఈ శస్త్ర చికిత్స చేయాలని

ప్రభుత్వాసుపత్రుల్లో వచ్చిన విప్లవాత్మక పరిణామాల్ని చాటి చెప్పాలని మంత్రి కామినేని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్స జరిపించుకున్నారు.



వైద్యారోగ్యశాఖ ఆదేశాలిచ్చింది. ఆ మేరకు జీజీహెచ్ లో ఉచితంగా మోకాలిచిప్ప మార్పిడి శస్త్ర చికిత్సలు ప్రారంభించారు. ఇప్పటి వరకు టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి బర్డ్స్ ఆసుపత్రిలో మాత్రమే ఈ శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. రోగులకు అవసరమైన పరికరాల కొనుగోలుకు తొలుత అవసరమయ్యే రూ. 10 లక్షలు సాయి భాస్కర ఆసుపత్రి వైద్యనిపుణులు బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ఇస్తామని ముందుకు రావడంవల్ల ఈ శస్త్రచికిత్స వెంటనే ప్రారంభించగలిగారు. ఈ రంగంలో అనుభవం ఉన్న ఆయన పీపీపీ లో శస్త్ర చికిత్సలు చేయడానికి ముందుకొచ్చారు. ఇది ఇక నిరంతరం కొనసాగుతుందన్న భరోసా వ్యక్తమవుతోంది. ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాలతో తయారు చేసిన కంపెనీ ఇంప్లాంట్స్ వినియోగిస్తున్నారు. మంత్రి కామినేనికి శస్త్ర చికిత్స చేసిన థియేటర్ లో పీపీపీ విధానంలో కృష్ణాజిల్లా నందిగామకు చెందిన విజయలక్ష్మి(60)కు మోకాలిచిప్ప మార్పిడి శస్త్ర చికిత్స చేయడం సామాన్య రోగులకు శుభసూచికమే.

పూర్వ వైద్య కళాశాల విద్యార్థుల సేవలు

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో పీపీపీ విధానంలో వైద్య సేవలు అందించేందుకు పలువురు పూర్వ వైద్య కళాశాల విద్యార్థులు ముందుకొచ్చారు. డాక్టర్ ఆలే గోపాలకృష్ణ గోఖలే ప్రస్తుతం సహృదయ మెడికల్ హెల్త్, ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జీజీహెచ్ లో 100కు పైగా ఓపెన్ హార్ట్ సర్జరీలు చేశారు. మరో పూర్వపు విద్యార్థి అయిన కార్డియోథొరాసిక్ సర్జన్ మన్నం గోపీచంద్ పిల్లలకు గుండె శస్త్ర చికిత్సలు చేసేందుకు ముందుకొచ్చారు. ఇప్పటికే ఓ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద కుటుంబాలకు చెందిన చిన్నారులకు ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. మరో పూర్వపు విద్యార్థి మల్లిక, స్పైన్ సెంటర్ వైద్యులు నరేష్ బాబు వెన్నుముక శస్త్ర చికిత్స అందించేందుకు ముందుకొచ్చారు. వీరు సన్నటి రంధ్రం గుండానే వెన్ను సర్జరీలు పూర్తిచేయడం (కీ హోల్ సర్జరీలు) వంటి అత్యాధునిక విధానం ద్వారా గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో సేవలు అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇటీవల మోకాలిచిప్ప శస్త్ర చికిత్స చేసిన హైదరాబాద్ కేర్ ఆసుపత్రి వైద్యులు బిఎన్ ప్రసాద్, తిరుపతి బర్డ్స్ ఆసుపత్రి వైద్యులు జగదీష్ సైతం గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులే. వీరు భవిష్యత్తులో కూడా మోకాలిచిప్ప మార్పిడి శస్త్ర చికిత్సలు అవసరమైన సాధారణ రోగులకు కూడ వైద్య సేవలు అందించడానికి సుముఖత వెలిబుచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో మంత్రి కామినేనికి శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందంలో జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి ఎం.ప్రశాంత్ తో పాటు, డాక్టర్ బిఎన్ ప్రసాద్, డాక్టర్ వేద ప్రకాష్(కేర్ ఆసుపత్రి), డాక్టర్ జగదీష్ (తిరుపతి బర్డ్స్ ఆసుపత్రి) సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు చెందిన ఎనస్థీషియా వైద్యులు షరీఫ్, త్రినాథ్, సీతారామయ్య, సుధాకర్, టీవీ గోపాలరావు ఎనస్థీషియా బాధ్యతలు నిర్వహించారు.

- ఆరోగ్య శాఖ మంత్రికి ఆపరేషన్ చేయడం ప్రభుత్వాసుపత్రి చరిత్రలో సువర్ణాధ్యాయమని జీజీహెచ్ సూపరిడెంట్ డాక్టర్ రాజునాయుడు పేర్కొన్నారు.
- ఆంధ్రప్రదేశ్‌లో మోచిప్ప, కీలు మార్పిడి ఆపరేషన్లకు ఇక మంత్రి కామినేని శ్రీనివాస్ బ్రాండ్ అంబాసిడర్ గా మారతారని డాక్టర్ బీఎన్.ప్రసాద్, డాక్టర్ నరేంద్ర రెడ్డి అన్నారు.

ఉచిత వైద్య సేవలపై కేంద్రం ప్రశంస

ఏపీలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్యంపై కేంద్ర ప్రభుత్వం కూడా సంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఏపీలో అమలవుతున్న ఉచిత వ్యాధి నిర్ధారణ, వైద్య సేవల విధానాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ప్రశంసించడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఢిల్లీలో ఫిబ్రవరి 18న అన్ని రాష్ట్రాల వైద్య శాఖ మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో ఉచిత వ్యాధి నిర్ధారణ సేవల విధానం, అమలుతీరుపై ఏపీ వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు ప్రజంటేషన్ ఇవ్వడం ఏపీ ప్రభుత్వానికి గర్వకారణం. మరోపక్క 'మీ రాష్ట్రానికి వచ్చి అధ్యయనం చేస్తాం అనుమతించండి. లేదా మీ బృందాన్ని మా రాష్ట్రాలకు పంపించండి'అంటూ కేంద్రప్రభుత్వం ఆహ్వానించింది. జాతీయ ఆరోగ్యమిషన్ (ఎన్‌హెచ్ ఎం)మార్గదర్శకాల ప్రకారం ఏపీలోని ప్రభుత్వ ల్యాబుల్లో నిర్వహించని పరీక్షలను పీపీపీ విధానంలో ప్రైవేటు కంపెనీలు నిర్వహించేలా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇక నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో బోన్ మ్యారో ఆస్పిరేషన్, రుమటాయిడ్ ఫ్యాక్టర్ పరీక్షల నుంచి సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షల వరకు అన్ని పరీక్షలూ ఉచితంగా అందుబాటులో ఉండనున్నాయి. ప్రతీ ప్రభుత్వాస్పత్రిలో పీపీపీ విధానంలో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీ ఏజెంటు ఉంటారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు అవసరమైన రోగుల శాంపిల్స్ తీసుకుని నిర్ణీత సమయంలోగా రిపోర్టులు తిరిగి సంబంధిత డాక్టర్‌కి అందజేస్తారు.

రాష్ట్ర వ్యాప్తంగా 100 ల్యాబ్‌లు

పీపీపీ విధానంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ఎంపికైన మెడాల్ కంపెనీ రాష్ట్రవ్యాప్తంగా 100 ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తోంది. ఇందులో 39 అత్యాధునిక ల్యాబులు. హైదరాబాద్ లాంటి మహానగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే సీమెన్ ఎనాలిసిస్, సైటాలజీ లాంటి కొన్ని సంక్లిష్టమైన పరీక్షలను ఈ విధానంతో ప్రతీ జిల్లాలో అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వం జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో జనవరి 1 నుంచి, సీహెచ్‌సీల్లో జనవరి 15 నుంచి, పీహెచ్‌సీల్లో జనవరి 31 నుంచి ఉచిత వ్యాధి నిర్ధారణ సేవలు ప్రారంభించారు. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షకు పైగా రోగులకు ఉచితంగా వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. . ఆరోగ్య శ్రీకి ఏడాదికి వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయిస్తుండగా కేవలం 3 శాతం మందికి మాత్రమే ఆ ప్రయోజనాలు అందుతున్నాయి. మిగిలిన 97 శాతం మందికి కూడా నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఉచిత వ్యాధి నిర్ధారణ సేవల పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించడం సత్ఫలితాలనిస్తోంది.

– కావూరి సునీల్ కుమార్
ఎమ్మెల్వో, వైద్య, ఆరోగ్య శాఖ

ప్రభుత్వ రాయితీలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ

- పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ వరం
- 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో సరి కొత్త ప్రమాణాలు
- అనుమతుల వ్యవధిని 21 రోజుల నుంచి 15 రోజులకు తగ్గించే యోచన



ఉద్యోగులకు ఫస్టు తారీఖున జీతాలు ఇచ్చినట్టే పారిశ్రామికవేత్తలకు కూడా ప్రతి నెలా మొదటివారంలోనే ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా ఆన్‌లైన్ చెల్లింపుల విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. విద్యుత్ బిల్లుల్లో రాయితీలు, ప్రభుత్వం కల్పించే ఇతర సబ్సిడీలన్నీ ఇక నుంచి నేరుగా లబ్దిదారుని బ్యాంకు ఖాతాలో జమ అయ్యే కొత్త విధానాన్ని వచ్చే ఏప్రిల్ నుంచి అమలు చేయాలని ఆయన సూచించారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'పై ఇటీవల జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి కొన్ని కీలకమైన సూచనలు చేశారు. ముఖ్యంగా 21 రోజుల్లో అనుమతుల విధానంలో వ్యవధి మరింత తగ్గించి దాన్ని 15రోజులకు మార్చే అవకాశాన్ని వెంటనే పరిశీలించాలని చెప్పారు.

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో సింగపూర్ దేశం ప్రపంచంలోనే మొదటిస్థానంలో వున్నదని, దరఖాస్తుల స్వీకరణ, అనుమతులు, ప్రాసెసింగ్ తదితర అంశాలలో ఎక్కడైనా అలసత్వం కనిపిస్తే సంబంధిత సిబ్బందిపై వేటు వేసే విధానం అక్కడ అమలులో వుందని సీయం చెప్పారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చేవారి సమస్యల్ని, ఇబ్బందుల్ని జీరో లెవల్‌కు తీసుకురాగలిగినప్పుడే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో నిర్దిష్ట ప్రమాణాలను అందుకోగలుగుతామని అన్నారు. సింగపూర్‌లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాల్ని పూర్తిస్థాయిలో ఇక్కడ కూడా అమలుచేయాలని సూచించారు.

దేశంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో మనకంటే ఒక స్థానంలో పైనున్న గుజరాత్‌ను ఈ పర్యాయం అధిగమించాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. దీనికోసం పంజాబ్‌లో మాదిరి ఇక్కడ కూడా డెడికేటెడ్ బ్యూరో వ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా అధికారులను కేటాయించి దరఖాస్తుల స్వీకరణ మొదలు అనుమతులను మంజూరు చేసే ప్రక్రియను పర్యవేక్షించడం వరకు అన్ని బాధ్యతల్ని అప్పగించాలని చెప్పారు. కేపీయంజీ, లీ క్వాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, వరల్డ్ ఎకనామిక్ ఫోరం, వరల్డ్ బ్యాంక్ సంస్థల సహాయం తీసుకుని పనిచేయాలన్నారు.

పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతుల విధానంలో ఇప్పటికే పూర్తిస్థాయిలో సంస్కరణలు అమలు చేసి ఉత్తమ రాష్ట్రంగా పేరుతెచ్చుకున్నామని, ముఖ్యంగా ఈ రంగానికి జాడ్యంగా వుండిపోయిన పైరవీలు, లంచాల్ని సమూలంగా నిర్మూలించామని సీయం అన్నారు. 24 శాఖల్ని సమన్వయం చేసుకుని పెట్టుబడిదారులకు సత్వరం అనుమతులు మంజూరుచేయడంలో చొరవ చూపించాలని కోరారు. ల్యాండ్, వాటర్ సమస్యలు వుంటే తక్షణం ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకురావాలన్నారు. ఇక నుంచి సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమల అనుమతుల్ని జిల్లా స్థాయిలోనే పరిష్కరించాలని నిర్ణయించినట్టు చెప్పారు. దీనివల్ల కమిషనర్ స్థాయిలో పెండింగ్ సమస్యలను ఎప్పటికప్పుడే క్లియర్ చేసే అవకాశం వుంటుందన్నారు.

అగ్నిమాపకశాఖ అనుమతుల విషయంలో కొద్దిగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గత ఏడాది 5,357 దరఖాస్తులకు 4,655 దరఖాస్తులను ఆమోదించామని, 403 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని అధికారులు వివరించారు. అలసత్వం ప్రదర్శించే వారిని ఎవరిని ఉపేక్షించవద్దని ముఖ్యమంత్రి వారికి చెప్పారు.

అనుమతులు ఏ దశలో వున్నదీ దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని, అందుకు అవసరమైన కమ్యూనికేషన్ సిస్టమ్‌ను ఏర్పాటుచేసుకోవాలని సీయం సూచించారు. న్యాయ సంబంధిత సమస్యలు ఎదురైతే వాటి సత్వర పరిష్కారానికి పూనుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు, కేపీఎంజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

❖

కాపు వర్గీయుల అభ్యున్నతికి ప్రభుత్వం చేయూత

కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ లో ఋణ మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానం

కాపు రుణాల మంజూరులో హైలెట్స్

- కాపు సామాజికవర్గంలో నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరులో ఫిబ్రవరి 25న రుణ పంపిణీ కార్యక్రమానికి అంకురార్పణ చేశారు.
- కాపు సామాజిక వర్గంలో మొదటి విడతగా రుణాలు పొందుతున్న లబ్ధిదారులు 30వేల మంది ఉన్నారు.
- కాపులకు ఇవ్వనున్న మొత్తం రుణాలు రూ.192కోట్లు
- కాపు కార్పొరేషన్ ద్వారా అందనున్న రాయితీలు రూ.96కోట్లు
- బ్యాంకు రుణం రూ.96కోట్లు
- **లబ్ధిదారులు చేపట్టనున్న వృత్తులు:** ఆటోలు, కాంక్రీట్ మిల్లర్లు, టైలరింగ్, డిటిపి జాబ్‌వర్కు తదితర యూనిట్లకు అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి.

ఆర్థికంగా వెనుకబడిన కాపు వర్గాల అభ్యున్నతికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. అందులోభాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సంస్థను నెలకొల్పింది. కాపు వర్గాల ప్రయోజనాలకు 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేయాలని నిర్ణయించిన రూ.100 కోట్లకుగాను ఇప్పటికే రూ.50 కోట్లు విడుదల చేసింది. ఈ సంస్థలో ఆధ్వర్యంలో ప్రారంభించిన కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అమలు చేయడానికి వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ముఖ్యంగా కాపు వర్గానికి చెందిన యువతీయువకులకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ఆర్థికంగా ఊతం అందించడానికి చర్యలు తీసుకుంటోంది. కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పేద కాపు, తెలగ, బలిజ, ఒంటరి తదితర కులాలకు ఋణ మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానం పలుకుతోంది.

ఉపాధి అవకాశాలు ఏర్పరుచుకునే వారు ఏర్పాటు చేసే యూనిట్ ఖర్చు రూ. 2,00,000లకు సబ్సిడీ కింద రూ.1,00,000, బ్యాంకు లోను ద్వారా రూ.1,00,000 మేర ఋణం పొందడానికి వీలుంది.

ఋణం పొందడానికి అర్హతలు

ఆంధ్రప్రదేశ్ లోని 13 జిల్లాలలో నివసించే కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి ఋణం పొందగోరే కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల యువతీ, యువకుల వయస్సు 21 నుండి 45 సం.ల మధ్య వయస్సులై ఉండాలి.యువతీ, యువకులకు విద్యార్హతలు ఉండాలన్న నిబంధనలు విధించలేదు. తెలుపు రంగు బియ్యం కార్డు మాత్రం కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతంలో రూ. 60,000, పట్టణంలో రూ.70,000 లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబీకులకు మాత్రమే ఈ ఋణం లభిస్తుంది. ప్రభుత్వం ప్రకటించిన ఇతర పథకాలలో ఎటువంటి ప్రయోజనం పొందని పక్షంలో లబ్ధిదారుల వారికి నచ్చిన పథకమును ఎంపిక చేసుకొనే సౌలభ్యం ఉంది. కులధృవీకరణ పత్రాలను 'మీసేవా' కేంద్రాల్లో నమోదు చేసుకోనవసరం లేదు. కుల ధృవీకరణ పత్రాలను తహసిల్దార్ వద్దకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా, మండల రెవెన్యూ అధికారి నుంచి పొందితే సరిపోతుంది.

కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్తులు కులధృవీకరణ పత్రం పొందు విధానం

ఏదేని కంప్యూటర్ / ఇంటర్నెట్ సెంటర్ మీరు, మీ మండల రెవెన్యూ ఇన్స్ పెక్టర్ నుండి పొందిన కుల ధృవీకరణ పత్రంను, ఒక పాస్ పోర్టు సైజ్ ఫొటోను స్కాన్ చేసి తెలుగు రంగు బియ్యం కార్డు నెంబర్ తో AP Obmms.cgg.gov.in వెబ్ సైట్‌లో లాగిన్ అయి ఋణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

❖

రాష్ట్రంలో మోడల్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్

విజయవాడకు సమీపంలో 200 ఎకరాల్లో మోడల్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమైంది. మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం, కార్మికులకు గృహ వసతి ఒకేచోట వుండేలా ప్రణాళికలు సిద్ధంచేసింది. ఈ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం భూమిని కేటాయించనుంది. గన్నవరం దగ్గరలోని వీరపనేనిగూడెంలో భూమిని గుర్తించింది. తన కార్యాలయంలో ఎంఎస్‌ఎంఈ ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ వెన్నుదన్నుగా వుంటుందని, పరిశ్రమలు-యూనిట్ల స్థాపనకు ముందుకొస్తే సకల సదుపాయాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

భూములను కేటాయించడమే కాకుండా రహదారులు నిర్మిస్తామని, అవసరమైనంత విద్యుత్ సరఫరా చేస్తామని, నీటికొరత లేకుండా చూస్తామని ప్రతినిధులకు ముఖ్యమంత్రి మాటిచ్చారు. ఎంఎస్‌ఎంఈ యూనిట్లకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, అనుమతుల మంజూరుకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్, సెయిల్ స్టాక్ యార్డులను విజయవాడలో నెలకొల్పేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొత్త రాష్ట్రంలో సరికొత్త ఆలోచనలతో పెట్టుబడులు పెట్టేందుకు ఎంఎస్‌ఎంఈలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

లీజు ప్రాతిపదికన కాకుండా తక్కువ ధరకు తమకు భూములు విక్రయించాలని ఎంఎస్‌ఎంఈ ప్రతినిధులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. భూమి అందుబాటు ధరలో వుంటే మరిన్ని యూనిట్లు నెలకొల్పి, వేలాదిమందికి ఉపాధి కల్పించేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు.

గన్నవరం నుంచి వీరపనేనిగూడెం మధ్య ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి ఫ్లైఓవర్ నిర్మించాలన్న విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే రోడ్ల విస్తరణ చేపడతామని చెప్పారు. పరిశ్రమల లే అవుట్ల నుంచి పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రభుత్వం కల్పించే మౌలిక సదు-పాయాలతో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ను దేశంలోనే ఒక అత్యుత్తమంగా తీర్చిదిద్దుకోవాలని సీయం ఎంఎస్‌ఎంఈలకు సూచించారు.

❖

సంక్షేమాంధ్ర సాధనే మన లక్ష్యం

ప్రజలు హర్షిస్తేనే అభివృద్ధికి అర్థం: సిఎం చంద్రబాబు



- 15 శాతం వృద్ధి సాధించాలని దిశానిర్దేశం
- మండలానికి ఇద్దరు తహశీల్దార్లుల్ని నియమించే యోచన
- ఈ ఏడాది నుంచి మండలస్థాయిలో జీఎస్‌డీపీ నమోదు
- 2018 నాటికి పోలవరం ఫేజ్ 1 నిర్మాణం పూర్తి

ఆరోగ్యాంధ్ర... హరితాంధ్ర... స్వర్ణాంధ్ర.... పర్యటకాంధ్ర... క్షీరాంధ్ర... క్రీడాంధ్ర... వాణిజ్యాంధ్ర... ఇవన్నీ నవ్యాంధ్ర ముంగిట నిలిచిన లక్ష్యాలు. అయితే, ఆంధ్రప్రదేశ్ సంక్షేమాధ్ర కానిదే, వేరే ఆదర్శాలు, అభివృద్ధీ అందుకోలేమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్దేశ్యం. ఇటీవల విజయవాడలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఆయన ప్రసంగం ఆ ఉద్దేశ్యాన్ని ప్రతిబింబించింది.

"మన ఆంధ్రప్రదేశ్ సంక్షేమ రాష్ట్రం. సంక్షేమం లేని అభివృద్ధిని ప్రజలు హర్షించరు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్థిక, ప్రాంతీయ అసమానతలు తొలిగించేలా పాలన సాగించండి"

- ఇది అధికారులకు ముఖ్యమంత్రి చేసిన దిశానిర్దేశం!

ఈ ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధి రేటును నమోదు చేయడంపై సిఎం హర్షం వ్యక్తం చేశారు. జాతీయ సగటు వృద్ధి రేటు 7.3 శాతం అయితే ఆంధ్రప్రదేశ్ 10.5 శాతం వృద్ధి రేటు సాధించడం అభినందించదగ్గ విషయమని చెప్పారు. విభజన సమస్యలను ఎదుర్కొని సమష్టిగా పనిచేయడంతో మంచి ఫలితాలు రాబట్టగలిగామని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటును 15 శాతం సాధించేలా కృషి చేయాలన్నారు. రెండంకెల వృద్ధి కొనసాగించగలిగినప్పుడే రాష్ట్రం నిలదొక్కుకుంటుందని పేర్కొన్న ముఖ్యమంత్రి, పశ్చిమగోదావరి, నెల్లూరు, శ్రీకాకుళం, చిత్తూరు

'ప్రజలు పరిష్కారాలనే కోరుకుంటారు కానీ, అధికారులు చెప్పే వివరణలలను కాదు. అవినీతి ఏస్థాయిలోనూ వుండటానికి వీల్లేదు, ప్రతి పనిలో పారదర్శకత కనిపించాలి, ఐటీ ఇక సొల్యూషన్స్ ఇచ్చే శాఖగా వుండాలి'

– ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

జిల్లాలు వృద్ధి రేటులో మంచి ఫలితాలు సాధించాయని వివరించారు.

సంక్షేమంలో రాజీపడకుండా బడ్జెట్

సంక్షేమంలో రాజీపడని అభివృద్ధి బడ్జెట్‌ను ఈసారి ప్రవేశ పెడుతున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఫలితాలతో పాటు ప్రజల సంతృప్తి ఎంతో ముఖ్యమని అన్నారు. విభజన వల్ల కలిగిన లోటును భర్తీ చేస్తామని కేంద్రం చెప్పిందని, అయితే 16 వేల కోట్ల లోటుకు గానూ రూ. 2,300 కోట్లు మాత్రమే వచ్చాయని మిగిలిన మొత్తాన్ని ఇవ్వాల్సిందిగా కేంద్రంతో చర్చలు జరుపుతున్నట్టు చెప్పారు.

కరువును తరిమేసేలా చర్యలు

2018 నాటికి పోలవరం ప్రాజెక్ట్ ఫేజ్ 1 పూర్తి చేయాలని నిర్దేశించుకున్నామని, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా 80 నుంచి 100 టీఎంసీల గోదావరి నీటిని వచ్చే ఏడాదికి కృష్ణా డెల్టాకు తీసుకువస్తామని అన్నారు. పక్కనే గోదావరి ప్రవహిస్తున్నా పశ్చిమ గోదావరి జిల్లాలో 17 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఫిజో మీటర్లు, రెయిన్ గన్లు, పంట సంజీవనితో జలవనరుల వినియోగాన్ని పటిష్ట పరుస్తామని, నదుల అనుసంధానం చేసి ప్రాధాన్యతా క్రమంలో 7 ప్రాజెక్టుల సత్వర పూర్తికి పెద్దపీట వేస్తామన్నారు. వర్షం నీటిని భూగర్భ జలాలుగా మార్చుకునేందుకు రాబోయే నాలుగునెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాబోయే రోజుల్లో కరవు అనే మాట ఏ జిల్లా కలెక్టరు అనడానికి అవకాశం లేకుండా ఇప్పటినుంచే కృషి జరగాలని ఆకాంక్షించారు.

జూన్ రెండవ వారానికి సచివాలయం సిద్ధం

జూన్ రెండవ వారానికి సచివాలయ నిర్మాణం పూర్తి చేసి అక్కడ నుంచే పాలన కొనసాగిస్తామని సీయం తెలిపారు. తలసరి ఆదాయంలో దేశంలో 9వ స్థానంలో వున్న రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. సీఐఐ సదస్సు విజయవంతమైందని, ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూతో అంతర్జాతీయ ఖ్యాతీ సాధించామని, తక్కువ ఖర్చుతో విశాఖను సుందరంగా తీర్చిదిద్దడం అన్ని నగరాలకు, పట్టణాలకు ఆదర్శప్రాయమని చెప్పారు.

విద్యుత్ లోటు అధిగమించి మిగులుకు చేరుకోవడం, నరేగా నిధులను సమర్థంగా వినియోగించి సిమెంట్ రోడ్లు, ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకోవడం, భూగర్భ జలాలు పెంచగలగడం ప్రభుత్వం సాధించిన విజయాలని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్య పరీక్షల కింద అందరికీ వైద్య పరీక్షలు అందుబాటులోకి తీసుకువచ్చామని అన్నారు.

50 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణమే లక్ష్యం

ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు ప్రతీ నెల ఫస్ట్ తారీఖున పెన్షన్లు అందిస్తున్నామని, అలాగే మొదటివారంలోనే రేషన్ పంపిణీ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, మొదటివారంలోనే పంపిణీ పూర్తిచేసిన డీలర్లకు కమిషన్ పెంచే ఆలోచన వుందన్నారు. అలాగే, రేషన్ పంపిణీలో జాప్యం చేసే డీలర్లపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

మార్చిలోపు రాష్ట్రంలోని అన్ని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ కల్పిస్తామని, ఇంకా 50లక్షల టాయిలెట్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. 4000 కిలోమీటర్లు సిమెంట్ రోడ్లు నిర్మించి, విద్య, వైద్య సంస్థలలో బయోమెట్రిక్ విధానంతో హాజరు పర్యవేక్షిస్తామని చెప్పారు. జూన్ కల్లా రాష్ట్రమంతా ఫైబర్ కనెక్టివిటీ అందించి, తక్కువ ఖర్చుతో ఇంటర్‌నెట్ అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.

వ్యవసాయరంగంలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లు ఏర్పాటు ద్వారా సమూల మార్పులు తీసుకువస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. స్కిల్ డెవలప్‌మెంటులో మనం చాలా వెనుకబడి వున్నామని, టెక్నాలజీలో మనం ఎంతముందున్నా నైపుణ్యాభివృద్ధి జరగకపోవడం వల్లే ఆశించిన ఫలితాలు రావడం లేదని చెప్పారు. నైపుణ్యాన్ని పెంచగలిగితే ఉత్పాదకత అనూహ్యంగా పెరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు.

ఫైళ్లను పెండింగ్‌లో ఉంచవద్దు

ఇ–ఆఫీసు వ్యవస్థ ఉండికూడా ఫైళ్లను అపరిష్కృతంగా ఉంచటలో అర్థం లేదని ముఖ్యమంత్రి అన్నారు. రికార్డులు, ఫైళ్లన్నింటినీ స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో ఉంచాలని అధికారులను కోరారు. కుటుంబంలో ఎవరెవరు పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, ఉపకార వేతనాలు, రైతు రుణాలు, రేషన్ సరుకులు తీసుకుంటున్నారో మొత్తం వివరాలు లభ్యమయ్యే విధంగా చూడాలని సూచించారు. ప్రజలు పరిష్కారాలనే కోరుకుంటారు కానీ, అధికారులు చెప్పే వివరణలలను కాదని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు–నిధుల వ్యయం, గణాంకాలపై అధికారులందరికీ పట్టు వుండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

'అవినీతి ఏస్థాయిలోనూ వుండటానికి వీల్లేదు, ప్రతి పనిలో పారదర్శకత కనిపించాలి, ఐటీ ఇక సొల్యూషన్స్ ఇచ్చేశాఖగా వుండాలి' అని సీఎం అన్నారు.

ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా ఏపీ

మన రాష్ట్రాన్ని ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఫ్లోరైడ్ పీడిత గ్రామాలుగా నమోదైన 335 పల్లెల్లో తాగునీటిని ఫ్లోరైడు రహితంగా మార్చేందుకు ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకూడదని, ఏ ఒక్క వ్యక్తి ఆకలితో బాధపడే దుస్థితి వుండకూడదని అధికారులకు సీయం స్పష్టమైన ఆదేశాలిచ్చారు. చెరువుల్లో పూడిక తీయించాలని, మారుమూల గ్రామానికి కూడా మంచినీటి సరఫరా జరగాలని కోరారు.

సమావేశం ప్రారంభంలో ఫిషరీస్, లిఫ్ట్ ఇరిగేషన్, నదుల అనుసంధానం, నీరు చెట్టు, ఎనర్జీ, విజిలెన్స్ అంశాలపై రూపొందించిన 'బెస్ట్ ప్రాక్టీసెస్ ఇన్ స్టేట్' అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. సమావేశంలో మంత్రివర్గ సభ్యులతో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

– పెరుమాళ్ల నాగరాజు
మీడియా లైజన్ ఆఫీసర్

పంటసంజీవనితో హరిత విప్లవం







భారత్ దేశం స్వాభావికంగా వ్యవసాయక దేశం. ఇప్పటికీ అత్యధిక ప్రజానీకం గ్రామాల్లోనే నివసిస్తున్నారు. గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు. గ్రామాభివృద్ధి దేశాభివృద్ధి. అందుకే గ్రామం సుభిక్షంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందని జాతిపిత మహాత్మాగాంధి ప్రవచించారు. ఆ మహాత్ముని అడుగుజాడల్లో నడుస్తోంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. గ్రామాల్లో అధికశాతం మంది ప్రధాన వృత్తి అయిన వ్యవసాయం లాభసాటిగా సాగాలంటే అందుకు ముఖ్య వనరైన నీటి సదు-పాయం కల్పించడం అత్యంతావశ్యకం. రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు తదనుగుణంగా అడుగులు వేస్తూ రాష్ట్రంలోని గ్రామాలన్నింటిలో నీటి సంరక్షణ పనులు చేపట్టి హరిత గ్రామాలుగా మార్చే దిశగా ముందుకు సాగుతోంది. అందులో భాగంగా మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధిహామి పనుల ద్వారా నీటిని సంరక్షించి, భూగర్భ జలాలను పెంపొందిస్తోంది. ప్రతి వర్షపు బొట్టును ఒడిసి పడుతోంది. ఈ పనుల్లో అపత్కాలంలో రైతుని ఆదుకునేది పంటసంజీవని (సేద్యపునీటి గుంత-ఫాంపాండ్). పారే నీటిని నిలువరించి, నిలిచిన నీటిని భూమిలోకి ఇంకించి, భూమిలో తేమ శాతాన్ని పెంచే పంటసంజీవనిని నిరుపేద రైతులకు వరమని చెప్పాలి. రాష్ట్రంలో కరువును ఎదుర్కొనేలా దాదాపు ఐదు వేల గ్రామాల నీటి అవసరాలు తీర్చేందుకు ఈ పంట సంజీవని కార్యక్రమం దోహద పడనుంది.

“రాష్ట్రంలో కరవును శాశ్వతంగా తరిమికొట్టేందుకు చేపట్టిన స్మార్ట్ వాటర్ గ్రిడ్ అనే మహాసంకల్పానికి ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలి. నేను చేస్తున్న భగీరథ యత్నానికి అటు అధికారులు, ఇటు ప్రజలు కదిలివస్తే దేశానికే ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా చేయవచ్చు. భగవంతుడు ఇచ్చిన నీటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉంది. ఇందులో భాగంగానే

నీటి సంరక్షణకు వివిధ కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతూ వస్తోంది. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే అనంతపురం జిల్లా నుంచే కరువును తరిమికొట్టే కార్యక్రమానికి పెద్దఎత్తున శ్రీకారం చుట్టాం. 'పంట సంజీవని' పేరుతో ఈ ఒక్క జిల్లాలోనే లక్ష ఫామ్ పాండ్స్ తవ్విస్తున్నాం. ప్రతి హెక్టారుకు ఒక ఫామ్ పాండ్ తవ్విస్తాం. దీనికి ప్రతి రైతు సహకరించాలి. ప్రస్తుత సీజన్ లో పది వేల ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేయగా, వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రూ.100 కోట్లతో లక్ష ఫామ్‌పాండ్స్ పూర్తి చేస్తాం. వీటి తవ్వకానికి ముందుకొచ్చే రైతులకు వంద శాతం సబ్సిడీ అందిస్తాం. ఫామ్ పాండ్స్‌తో 50 రోజులు కరువు వచ్చినా పంటలు కాపాడుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇంకా రాష్ట్రవ్యాప్తంగా 5 నుంచి 6 లక్షల వరకు ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించాం. వ్యవసాయ రంగానికి ప్రయోజనం కలిగించేలా గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులలో 60 శాతం నీరు-చెట్టు కార్యక్రమానికి వినియోగించాలి," అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు.

రాష్ట్రంలో 13 జిల్లాల్లో దాదాపు 8,75,000 పంట సంజీవనులను తవ్వాలనే లక్ష్యంతో మన అధికారులు ముందుకు కదులుతున్నారు. ప్రతి సన్న, చిన్నకారు రైతూ వారి పొలాల్లో నీటి గుంటలు లేక సాగునీటి బావులు తవ్వుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. 90 శాతం కూలీలను ఈ తరహా పనుల కోసం వినియోగించనున్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వమే పంటసంజీవనిని నిర్మిస్తుంది. రైతుకున్న మొత్తం పంట భూమిలో కనీసం 5 శాతం భూమిలో పంటసంజీవనిని తవ్వుకోవచ్చు. సాధారణంగా ప్రతి రెండు ఎకరాలకు ఒకటి వంతున రైతులు ఏర్పాటు చేసుకోవచ్చు. వివిధ పరిమాణాల్లో ఈ ఫాంపాండ్ ని ఏర్పాటు చేసుకొని వేలాది లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు. సుమారు ఒక ఘ.మీ. పరిమాణంలో1000 లీటర్ల వర్షపు నీటిని నిల్వ చేయవచ్చు. 10 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతు కొలతల ప్రకారం ఒక పంటసంజీవని తవ్వినట్లయితే 2 లక్షల లీటర్ల నీటిని సంరక్షించవచ్చు.

నీటికుంటల కొలతలు, ఖర్చు, నీటినిల్వ సామర్థ్యం వివరాలు

కొలతలు(మీటర్లలో)	వ్యయం	నీటినిల్వ సామర్థ్యం(లీటర్లలో)
5×5×2	రూ.25 వేలు	75 వేలు
10×10×2	రూ. 50 వేలు	1.50 లక్షలు
15×15×2	రూ. 75 వేలు	1.75 లక్షలు
20×20×2	రూ. లక్ష	3 లక్షలు

ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతులకు ఇది వరదాయిని అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. మెట్ట భూముల్లో కురిసిన వర్షపు నీటిని నిలవ చేసుకుని, ఈ నీటిని పంటలకు అవసరమైనప్పుడు వాడుకోవచ్చు. ప్రధానంగా వ్యవసాయ భూమిలో వర్షపు నీరు ఎక్కువగా చేరే పల్లపు ప్రాంతాన్ని ఎంచుకుని అక్కడ గుంతని తవ్వుతారు. సేద్యపు నీటి వనరుల కొరతను పంటసంజీవని తీర్చనుంది. పంటసంజీవనితో పొలాలు ఎండే పరిస్థితి నుంచి కాపాడుకోవచ్చు. పంటసంజీవనితో పొలాల దాహార్తిని తీర్చునుండటంతో ఇక రాష్ట్రంలో వ్యవసాయం కరవు బారిన పడదన్నమాట.

పంటసంజీవని వలన ప్రయోజనాలు

రాష్ట్రంలో ఏడాదికి సగటున 966 మి. మీటర్ల వర్షపాతం నమోదవుతోంది. ఫలితంగా కొన్ని జిల్లాల్లో కరవు తాండమాడుతోంది. ఇన్నాళ్లూ వాన నీటి సంరక్షణ శాస్త్రీయంగా జరగలేదు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తక్షణం ప్రధానంగా నీటి సంరక్షణపై దృష్టి పెట్టారు. ఏపీలో ప్రతీ ఏటా 5 వేల టీఎంసీల పరిణామంలో వర్షపాతం నమోదవుతోంది. మన రాష్ట్ర అవసరాలకు కావాల్సిన 2,750 టీఎంసీలను సమకూర్చుకోవాల్సి ఉంది. పంటసంజీవని ద్వారానే నీటి వనరుల పెంపు,భూగర్భజలాల మట్టాలు అందుబాటులోకి రావడం సాధ్యం కానుంది. పంట సంజీవని ద్వారా నిల్వ ఉంచిన నీటిని వివిధ రకాల పంటలకు, పండ్ల తోటల పెంపకానికి వాడుకోవచ్చు. అంతేకాక పురుగు మందుల పిచికారి చేయడానికి కూడా వాడుకోవచ్చు. నీటిని నిల్వ చేయడం వల్ల భూమిలోకి ఇంకి, భూగర్భ జలాల మట్టాలు పెరుగుతాయి. ఇంకా పరిసర ప్రాంతాల్లో ఉన్న బోర్లు, బావులు పునరుద్ధరించబడతాయి. భూమిలో తేమ శాతం పెరగడం వల్ల పంట దిగుబడులు పెరుగుతాయి. వ్యవసాయానికి వినియోగించే విద్యుత్‌ను సైతం పొదుపు చేయొచ్చు. మేకలు, గొర్రెలు, ఇతర పశు పక్షాదులకు తాగునీటి కొరతను పంటసంజీవని తీరుస్తోంది. కుంటల్లోని అడుగు భాగంలో చేరే ఒండ్రుమట్టిని పంటలకు ఎరువుగా వినియోగించవచ్చు.

ఈ ఏడాది మార్చి 31 నాటికి రాష్ట్రంలో 13 జిల్లాల్లో మొత్తం 6,35,000 పంటసంజీవనిలను ఏర్పాటు చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. రూ.2609 కోట్లతో దాదాపు 3.5 లక్షల ఫాంపాండ్లు నిర్మించడానికి అధికారులు అంచనాలు వేశారు. మిగిలిన వాటికి కూడా త్వరితగతిన అంచనాలు పూర్తిచేసి , మార్చి 31 లోగా నిర్మించాలనే దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు. బహుళ ప్రయోజనాలున్న పంటసంజీవని రైతుకు ఉంటే వారి ఇంట సిరులు కురుస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు. వచ్చే ఆర్థిక సం.లో దేశ వాప్తంగా 5 లక్షల నీటి కుంటలు ఏర్పాటు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. కాని మన రాష్ట్రం ఇంతకంటే ఎక్కువ లక్ష్యాన్ని నిర్ణయించుకొని నీటి కుంటలు ఏర్పాటులలో దేశానికి ఆదర్శంగా నిలవాలని కృతనిశ్చితంతో ఏపీ ప్రభుత్వం పయనిస్తోంది.

- బత్తినేని మురళీమోహన్ రావు (ఎమ్మెల్వో)
గ్రామీణ నీటి పారుదలశాఖ



ఐఎఫ్ఆర్ 2016

విశాఖ నావికా తలంలో ఎగిరిన భారత బావుటా!



అద్భుతం కళ్లకు కట్టింది. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష(ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ-ఐఎఫ్ఆర్ 2016) కి వేదికైన ఘనత మన విశాఖకు దక్కింది. యాభైకి పైగా దేశాల నావికా దళాల గౌరవ వందనాన్ని భారత రాష్ట్రపతి, సర్వసైన్యాధ్యక్షుడు ప్రణబ్ ముఖర్జీ స్వీకరించిన అపురూప ఘట్టం ఆవిష్కృతమయ్యింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లతో సహా ఎందరో ప్రముఖుల హాజరైన ఈ వేడుక మరింత శోభాయమానమయ్యింది. ప్రశాంత సాగరమే వేదికగా, వినీలాకాశమే హద్దుగా జరిగిన విన్యాసాలకి విశాఖ ప్రజ విస్మయపడింది.

అంతేనా.... సంబరాల తళుకులు అంబరాన్ని తాకడం, ... ఉవ్వెత్తున ఎగసిన కోలాహలానికి తిన్నెల మీద కెరటాలు చిన్నబుచ్చుకోడం- ఈ సందడేనా ఐఎఫ్ఆర్ 2016 సారాంశం, సందేశం? ఇది మాత్రమే కాదు. సరిహద్దు రేఖలుగా కంచెలు కట్టడానికి చదునైన నేల కాదు సముద్రం! అనంతంగా విస్తరించి అఖండం అనిపించే సాగరంలో లెక్కలేనన్ని ఎల్లలు; జాతీయ... అంతర్జాతీయ జలాల పేరిట లెక్కతేలనన్ని పొలిమేరలు. సముద్ర జలాల్లో అయిదు దేశాలతో సరిహద్దులు పంచుకుంటున్న దేశం మనది. ఈ కనిపించని హద్దు గీతలు.... నీటి మీద రాతలు కాకూడదనీ తీరాల వెంట సుస్థిరమైన రక్షణ సాధించాలనీ, పరస్పర సహకారం, సావాస సంబంధాలు వృద్ధి చెందాలనీ ఈ అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష లక్ష్యిస్తుంది. అంతే కాకుండా గణనీయంగా పెరిగిన మన భారత నావికా పటిమని, ప్రాభవాన్నీ చాటడం ద్వారా మన ఉత్పాదనలకు వాణిజ్యావకాశాల్ని పెంచుకోవడం, పక్కలో బల్లెంగా మారిన దేశాలకు ఒక ప్రచ్ఛన్న హెచ్చరికని వినిపించడం కూడా ఐఎఫ్ఆర్ 2016 సంకేతాలే. తూర్పు నౌకాదళ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయే ఐఎఫ్ఆర్ 2016 తీర ప్రాంత రక్షణలో, సముద్ర మార్గాన భద్రమైన వాణిజ్య కార్యకలాపాలకు సంబంధించి భారత నేవీ వ్యూహపరిణతిని పరోక్షంగా ప్రకటించింది. త్వరలో ప్రప్రథమ అంతర్జాతీయ మారిటైమ్ సమ్మేళనాన్ని జరుపుతామని ప్రధాని ప్రకటించడం మరో విశేషం.

విదేశీ యుద్ధనౌకల నుంచి గౌరవ వందనం స్వీకరించి, నౌకాదళ సమీక్షను ప్రారంభించిన సందర్భంగా రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ మాట్లాడుతూ, సముద్ర తీర రక్షణలో నౌకాదళ సమీక్ష కొత్త ముందడుగు అన్నారు. సముద్రతలంపై శాంతి, ప్రశాంతి నెలకొల్పడంలో నౌకాదళాలది కీలక భూమిక అని, శాంతి సామరస్యాలు కాపాడటంలో సంయుక్త ప్రదర్శనలు గొప్ప బలాన్నిస్తాయని రాష్ట్రపతి అన్నారు.సముద్ర మార్గాల రక్షణ, వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలకు నౌకాదళం అండగా ఉ ంటుందన్నారు. హిందూ మహాసముద్రంలో భారత్ నిర్వహిస్తున్న పాత్ర ఎంతో ప్రాధాన్యమని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ నౌకాదళ గౌరవ వందనం స్వీకరించడం అద్భుతమైన అనుభూతినిచ్చిందన్నారు. నౌకాదళానికి సహకారం అందించిన విశాఖ వాసులకు రాష్ట్రపతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

- రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సుమారు 90 దేశాల నుంచి వచ్చిన దేశ, విదేశీ యుద్ధనౌకలను సమీక్షించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్నారు. సముద్రంలోపల సుమారు 10 కిమీ దూరంలో సమీక్ష కార్యక్రమం జరిగింది.
- అంతర్జాతీయ నౌకాదళ ప్రదర్శనను వీక్షించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ, విశాఖ ప్రజల స్ఫూర్తిని కొనియాడారు. నగరంలో



అద్భుత ప్రదర్శనకు హాజరైన ప్రధాని, గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి

ఏర్పాటు చేసిన అంతర్జాతీయ నౌకదళ ప్రదర్శనను వీక్షించేందుకు వచ్చిన ఆయన మాట్లాడుతూ.. అందమైన విశాఖ నగరమంటే తనకు ఎంతో ఇష్టమని వ్యాఖ్యానించారు. హుద్‌హుద్ విలయం సంభవించినప్పుడు తాను విశాఖ పర్యటనకు వచ్చానని, విశాఖ ప్రజలు ఏడాదిలోనే ప్రళయానికి తగిన సమాధానం ఇచ్చారని ప్రశంసించారు. అంతే కాకుండా, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ఏపీ సీఎం చంద్రబాబుకు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. తూర్పుతీరంలో ఇలాంటి అద్భుత కార్యక్రమానికి ప్రపంచ నలుమూలల నుంచి తరలి రావడం శుభ సంకేతమన్నారు. తీరప్రాంత దేశాలతో ఆర్థిక, వాణిజ్య సంబంధాల బలోపేతానికి మారిటైమ్ ఉపయోగపడుతుందని, సముద్రాల ద్వారా 20 ట్రిలియన్ల విలువైన వాణిజ్యం జరుగుతోందని ప్రధాని తెలిపారు. భారత్‌కు 7,500 చదరపు కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, సునామీ, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు సవాళ్లు విసురుతున్నాయన్నారు. అన్ని దేశాల నౌకాదళాలు సమష్టిగా భద్రతపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

- నావికదళ కేంద్రంగా విశాఖను రక్షణమంత్రి ప్రకటించడం సంతోషకరమైన విషయం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇంతటి అద్భుత కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భారత నౌకాదళాన్ని ఆయన అభినందించారు. ఈ ఉత్సవాలను చూస్తుంటే అసలు భారత్‌లోనే ఉన్నామా అనిపించిందన్నారు. తొలిరోజు సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖ బీచ్‌రోడ్డులోని 1971వ సంవత్సర అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, హస్తకళావైభం చాటిచెప్పేలా వందకు పైగా స్టాళ్లతో తీర్చిదిద్దిన ఐఎఫ్ఆర్ గ్రామాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) ఇంజినీరింగ్ కళాశాలలో ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఐఎఫ్ఆర్ జరిగిన నాలుగురోజుల పాటు ముఖ్యమంత్రి విశాఖలోనే ఉన్నారు. ఆయన కార్యాలయ అధికారులు, సిబ్బంది కూడా వచ్చారు. వీరి కోసం గవర్నర్ బంగ్లాలో తాత్కాలిక ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.
- అంతకు ముందు, ఐఎఫ్ఆర్ 2016ను గవర్నర్ నరసింహన్ లాంఛనంగా ఆరంభించారు. విశాఖపట్నంలో డాక్‌యార్డ్ ప్రాంగణంలోని కమాండ్ స్టేడియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎఫ్ఆర్‌లో పాల్గొంటున్న 51 దేశాల నావికా దళ ప్రతినిధులు, నావికుల సమక్షంలో ప్రారంభ వేడుకలు ఆహ్లాదకరంగా సాగాయి. ప్రారంభ వేడుకల్లో ఐఎఫ్ఆర్ బ్రాండ్ అంబాసిడర్లు హిందీ తారలు అక్షయ్‌కుమార్. కంగనా రనౌత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.
- భారత నౌకాదళం ఫిబ్రవరి 4–8 మధ్య అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఐఎఫ్ఆర్ 2016 కు విశాఖని అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. ఏడాది కిందట హుద్‌హుద్ తుపాను నగరాన్ని ఛిన్నాభిన్నం చేసిందన్న ఊహే ఎవరికీ అందని విధంగా సిద్ధం చేశారు. అందమైన వనాలు, అద్దాల్లాంటి తారురోడ్లు, చుక్కల ఆకాశాన్ని నేలకి దింపినట్టు మిరుమిట్లు గొలిపే దీపాలంకరణలు విశాఖ రూపురేఖల్ని మార్చేశాయి.
- ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోనే 'మారీటైమ్ఎగ్జిబిషన్' ఏర్పాటుచేశారు. ఇందులో భారత యుద్ధనౌకలు, జలాంతర్గాములు, క్షిపణులు, టోర్పెడోల నమూనాలతో పాటు భారత సాంకేతిక, పరిశోధక సత్తాను చాటిచెప్పేలా భారీ ప్రదర్శన ఏర్పాటుచేశారు. భారీ తెరపై నౌకదళ ప్రతిష్ఠను చాటిచెప్పే కథనాలను ప్రసారం చేశారు. సూపర్‌సోనిక్ క్షిపణి బ్రహ్మోస్ నమూనా, వివిధ ఉపగ్రహాల నమూనాలను ప్రదర్శించారు.
- విశాఖలోని ఆంధ్రవిశ్వవిద్యాలయ ఇంజినీరింగ్





ప్రళయానికి వికలమైన విశాఖని చూశాను. కానీ, విలయాన్నీ.... విధ్వంసాన్ని ధిక్కరించి నిలిచిన విశాఖ ప్రజల ధీరత్వాన్నీ చూశాను. నిండా ఏడాది తిరక్కుండానే ఇటువంటి అంతర్జాతీయ కార్యక్రమానికి అంగరంగ వైభవంగా సిద్ధమైపోవడమే ఈ నగరానికి ఓ అద్భుతమైన నివాళి. విశాఖ స్ఫూర్తికి వినమ్రుడనౌతున్నా. ఆ స్ఫూర్తి వెనక చోదక శక్తి, ఈ అంతర్జాతీయ కార్యక్రమ నిర్వహణ సారథి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి నా అభినందనలు.

– ప్రధాని నరేంద్ర మోడీ

కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన ఐఎఫ్ఆర్ గ్రామం, సముద్ర ప్రదర్శనలను ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులు సందర్శించారు. ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అరకు కాఫీని ప్రధాని రుచి చూసి అద్భుతంగా ఉందంటూ కితాబిచ్చారు. గిరిజన సహకారసంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో తయారుచేస్తున్న అరకు కాఫీకి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరకు కాఫీ బ్రాండ్లతో ప్రత్యేకంగా ఒక స్టాల్ ఏర్పాటు చేయించారు.

- ఐఎఫ్ఆర్ కార్యక్రమ బందోబస్తు నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 4.20 కోట్లు కేటాయించింది. ఇప్పటికే కేటాయించిన నిధులకు అదనంగా ఈ నిధులు ఇచ్చేందుకు అవసరమైన పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. డీజీపి జేవీ రాముడు నుంచి ప్రభుత్వానికి అందిన ప్రతిపాదనల మేరకు ఈ నిధులను కేటాయించింది.
- 'నౌకాదళ యుద్ధవిన్యాసాల ప్రదర్శన' (ఆపరేషన్స్ డిమానిస్ట్రేషన్), 'అంతర్జాతీయ నగర కవాతు' (ఇంటర్నేషనల్ సిటీ పరేడ్) కార్యక్రమానికి లక్షల సంఖ్యలో జనం పోటెత్తారు. బీచ్‌రోడ్డులో ఏర్పాటుచేసిన గ్యాలరీలు, ఇసుక తిన్నెలపై ఏర్పాటుచేసిన 'ఎన్‌క్లోజర్లు', తీరంవైపునున్న ఫుట్‌పాత్ మొత్తం కిక్కిరిసిపోయాయి. నావల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్‌హోటల్ వరకు జనసందోహంతో నెలకొంది. భారతీయ కళావైభవాన్ని చాటిచెప్పే నృత్యప్రదర్శనలు వీక్షకులకు కనువిందు చేశాయి. 'భారత్ తయారీ'(మేకిన్ ఇండియా శకటం), ఆకర్ష విశాఖ శకటం, అంతరిక్ష విభాగ శకటం, నౌకానిర్మాణ వారసత్వ శకటం తదితరాలు వీక్షకులను ఆకర్షించాయి. భారత నౌకాదళంతోపాటు పలుదేశాల దళాలు కవాతులో పాల్గొన్నాయి. ఆయా దేశాల సంస్కృతి, సంప్రదాయాలు చాటిచెప్పే వస్త్రధారణతో విద్యార్థులు కవాతు చేశారు. వేల అడుగుల ఎత్తులో ఎగురుతున్న విమానం నుంచి మెరైన్ కమాండోలు పారాచూట్‌ల సాయంతో భూమ్మీదకు దూకడం, హెలీకాప్టర్లు, హాక్‌లు, మిగ్‌లు, పి8ఐ విన్యాసాలు నమ్మశక్యంకానంత అద్భుతంగా ప్రదర్శించబడ్డాయి. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్షలో భాగంగా ఒక రోజు ముందు విశాఖ బీచ్‌రోడ్డులో నిర్వహించిన నమూనా విన్యాసాల ప్రదర్శనలో స్కాండినేవియా దేశ నౌకాదళ మహిళల సాహసాలు చూపరుల్ని కట్టిపడేశాయి. ఆకాశంలో ఎగురుతున్న చిన్నపాటి విమానం రెక్కలపై చక్కర్లు కొడుతూ చేసిన విన్యాసాలను జనం కళ్లార్పకుండా వీక్షించారు. విమానం నుంచి త్రివర్ణ పతాకం రంగులు వెదజల్లి జాతీయపతాకాన్ని ఆవిష్కరించిన విన్యాసం అబ్బురపరిచింది.
- విన్యాస ప్రదర్శన సందర్భంగా ప్రధాని ముందు ఒక యుద్ధ దృశ్యం ఆవిష్కారమైందింది. సముద్రంలో మందుపాతరను పేల్చి ప్రధాని మోడీకి స్వాగతం పలికారు. మూడు హెలికాప్టర్లు జాతీయ పతాకం, నౌకాదళపతాకం, ఐఎఫ్ఆర్ పతాకంతో ప్రధానిని ఆహ్వానిస్తూ గగన విహారం చేశాయి. మూడు కమోవ్-31 హెలికాప్టర్ల శ్రేణి, హాక్ యుద్ధవిమానాలు అత్యంత వేగంగా దూసుకువచ్చి ప్రధాని ఉన్న వేదిక ముందు డైమండ్ ఆకారంలో ఏర్పడి పైకి దూసుకుపోయాయి. 12 జెమినీ పడవల్లో మెరైన్ కమాండోలు సముద్రంలోంచి నారింజ రంగు పొగల మధ్యగా తీరానికి దూసుకొచ్చి మెరుపుదాడులు ప్రదర్శించారు. రెండు మందు-పాతరలను పేల్చడంతో నీరు నింగిని తాకినట్టు ఎగసిపడింది. ఐఎన్ఎస్ జలాశ్వ యుద్ధనౌక నుంచి చిన్నపాటి బోట్లలో ఏకంగా యుద్ధట్యాంకులను తీరానికి చేర్చే విన్యాసం అందరినీ విస్మయపరిచింది. తీరంలోని శత్రుస్థావరాల్ని బాంబులతో ధ్వంసం చేయడం, తుపాకులతో శత్రువులపై విరుచుకుపడడం వంటి విన్యాసాలతో వీక్షకులు ఉద్వేగానికి గురయ్యారు. యుద్ధనౌకల నుంచి ఆకాశంలోకి ఎగబాకటం, ఆకాశంలో పదివేల అడుగుల ఎత్తున ఎగురుతున్న యుద్ధవిమానం నుంచి ప్యారాచూట్ల సహాయంతో వంటి విన్యాసాలు సంభ్రమాశ్చర్యాలకి గురిచేశాయి. భారత నౌకాదళ సత్తా, ధైర్యసాహసాలు దేశం గర్వపడేలా ఉన్నాయని ప్రధాని ప్రశంసించారు.

❖

ముస్లిముల సంక్షేమానికి సకల చర్యలు

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చిత్తశుద్ధితో చట్టాల అమలు



ముస్లిముల అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి స్పష్టం చేశారు. మైనారిటీల ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రంలో 65,770 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయని పల్లె చెప్పారు. ఎస్టేట్ అబాలిషన్ యాక్ట్ మరియు జాగీర్దార్ అబాలిషన్ యాక్ట్ కింద 16751 ఎకరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, ఈ భూమిని తిరిగి వక్ఫ్ బోర్డుకు బదలాయించాలని అడిగామని, ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని ఆయన తెలిపారు.

వివిధ ప్రభుత్వ శాఖలకు నోటిఫై చేసి ప్రభుత్వం కేటాయించిన భూమి 4004 ఎకరాలు కాగా, దీనికి సంబంధించి ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు పరిహారం కూడా చెల్లించడమైనదని చెప్పారు. అయితే, భూసేకరణ యాక్ట్ కింద ఇచ్చిన పరిహారం తక్కువగా ఉందని, పెంచాలని అడిగామని మంత్రి వివరించారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం ఒకసారి వక్ఫ్‌కు కేటాయించిన భూమి ఎప్పటికీ వక్ఫ్ ఆస్తే. దాన్ని ప్రభుత్వం కూడా స్వాధీనం చేసుకోవడానికి అవకాశం లేదు.

గతంలో వక్ఫ్ బోర్డు 203 ఎకరాలు భూమి అమ్మడం జరిగింది. కానీ 2013 సంవత్సరంలో వక్ఫ్ చట్టాన్ని సవరించడం ద్వారా అమ్మడానికి వీలుకల్పిస్తున్న సెక్షన్ 51 రద్దు చేయబడింది. కాబట్టి అమ్మడానికి వీలు లేదు. అమ్మినా చెల్లదు.

ఇదిలా ఉంటే, 969 ఎకరాల వక్ఫ్ భూమి ఇతర వ్యక్తులకు చెందేవిధంగా వివిధ కోర్టు తీర్పులు వచ్చాయి. రాష్ట్రంలో 31,594 ఎకరాల వక్ఫ్ భూమి అన్యాక్రాంతమైనట్లు గుర్తించామని మంత్రి తెలిపారు. వక్ఫ్ భూములు కబ్జాచేసిన వారిపై కఠిన చట్టాలు అమలు చేస్తున్నామని చెప్పిన మంత్రి, వక్ఫ్ బోర్డు గత ఏడాది అక్టోబర్ వరకు ఉమ్మడి జాబితాలో ఉన్నందున, వక్ఫ్ భూముల పరిరక్షణ సరిగా చేయడానికి వీలు పడలేదని, గత ఏడాది నవంబర్ 1 నుంచి ఏపీకి ప్రత్యేకంగా వక్ఫ్ బోర్డును కాంపిటెంట్ అథారిటీ ద్వారా ఏర్పాటు చేసుకుని ఈ పనిని వేగవంతంగా చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

వక్ఫ్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం, ముఖ్యమంత్రి సీరియస్‌గా తీసుకున్నారని పల్లె చెప్పారు. దీనికోసమే జీవో నెంబర్ 18ని జారీ చేశారు. ఈ జీవో ప్రకారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, డిఆర్వో, అటవీ, రిజిస్ట్రేషన్, మున్సిపాలిటీ, పంచాయితీరాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి తదితర విభాగాల అధికారులు మెంబర్లుగా కమిటీ వేశారు. ఈ కమిటీ ప్రతినెలా సమావేశమై వక్ఫ్ భూముల అన్యాక్రాంతంపై తగిన చర్యలు తీసుకుంటుంది. సెక్షన్ 52 వక్ఫ్ యాక్ట్ ప్రకారం మరియు తగిన ఐపిసి సెక్షన్లను పెట్టి కబ్జాదారులపై కేసులు నమోదు చేయడం జరిగింది.

81 కేసులు నమోదు

ఈ సెక్షన్ ప్రకారం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 81 మందిపై కేసులు నమోదు చేశారు. కృష్ణా జిల్లా నిడమానూరులో 29 ఎకరాలు, ఇబ్రహీంపట్నం గుంటుపల్లిలో 39 ఎకరాలు, పెనమలూరు మండలం తాడిగడపలో 25 ఎకరాలు, కడప జిల్లా ప్రొద్దుటూరు వద్ద మోడెంపల్లిలో 7 ఎకరాలు, రెడ్డిపాలెంలో 181 ఎకరాలు, కర్నూలు జిల్లా కల్లూరులో 11 ఎకరాలు, అనంతపురం నగరంలో కోట్ల విలువ చేసే ఎకరం భూమి, శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలో 9 ఎకరాలు, నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలంలో 8 ఎకరాలు వక్ఫ్ భూములను రాష్ట్ర ప్రభుత్వ చొరవ వల్ల తిరిగి



వక్ఫ్ భూములు కబ్జాచేసిన వారిపై కఠిన చట్టాలు అమలు చేస్తున్నామని చెప్పిన మంత్రి పల్లె చెప్పారు. వక్ఫ్ బోర్డు గత ఏడాది అక్టోబర్ వరకు ఉమ్మడి జాబితాలో ఉన్నందున, వక్ఫ్ భూముల పరిరక్షణ సరిగా చేయడానికి వీలు పడలేదని , గత ఏడాది నవంబర్ 1 నుంచి ఏపీకి ప్రత్యేకంగా వక్ఫ్ బోర్డును కాంపిటెంట్ అధారిటీ ద్వారా ఏర్పాటు చేసుకుని ఈ పనిని వేగవంతంగా చేస్తున్నామని వెల్లడించారు.

స్వాధీనమైంది. 13 జిల్లాల్లో మొత్తంగా సుమారు 300 ఎకరాల భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి తెలిపారు.

రిజిస్ట్రేషన్ యాక్ట్ 22 ప్రకారం వక్ఫ్ భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదని అందరు రిజిస్ట్రార్లకు, కలెక్టర్లకు ఆదేశాలివ్వడం జరిగింది. అవినీతి నిరోధక చట్టం కింద వక్ఫ్ భూములను అధికారులుకానీ, ముతవల్లిలుకానీ, మసీదు, వక్ఫ్ కమిటీ మెంబర్లు కానీ దుర్వినియోగం చేస్తే వారిని కూడా చట్ట రీత్యా శిక్షించడానికి సెక్షన్ 101 క్లాజ్ వన్ అండ్ టూ దోహదపడతాయి.

వక్ఫ్ ఆదాయం ముస్లిం సంక్షేమం కోసమే

వక్ఫ్ భూములను ఆదాయ వనరులుగా మార్చుకుని, ఆ ఆదాయాన్ని ముస్లిం సంక్షేమానికి ఖర్చు పెట్టాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. వక్ఫ్ భూములను కమర్షియల్‌గా మలచుకోవడానికి కొన్ని ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. విజయవాడ, వైజాగ్, గుంటూరు, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, కడప, శ్రీకాకుళం ప్రాంతాల్లో వక్ఫ్ భూములను అభివృద్ధి చేయనున్నారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు వంటి వాటి కోసం 30 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడానికి త్వరలో టెండర్లు పిలవాలని నిర్ణయించారు. విశాఖ జిల్లా దేవుడా గ్రామంలో 2990 ఎకరాల వక్ఫ్ భూమిని ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు పూర్తయ్యాయి. వచ్చే ఏడాదిలోగా 500 కోట్ల రూపాయల ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 52-ఏ చట్టం కింద వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తున్న మొట్టమొదటి రాష్ట్రం దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఒక్కటే.

ఏపీ వక్ఫ్ బోర్డు పరిధిలో కోట్ల విలువ చేసే భూములున్నాయి. వాటిని కమర్షియల్ గా మార్చి వచ్చే రెండు మూడేళ్లలో 500 కోట్ల రూపాయలను ఆదాయంగా సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని మంత్రి తెలిపారు. ఈ మొత్తాన్ని పేద ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

క్రిస్టియన్ మైనార్టీ ఆస్తుల పరిరక్షణ కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుంది.

స్కాలర్ షిప్పులు

2014-15లో రాష్ట్రంలోని అర్హులైన 1,31,069 మంది మైనార్టీ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ లకింద రూ.27 కోట్ల 95 లక్షలు విడుదల చేశారు. 2014-15 లో 98,216 మంది విద్యార్థులకు ఎంటిఎఫ్ కింద రూ.29 కోట్ల 29 లక్షలు, ఆర్టీఎఫ్ (ఫీజు రిఇంబర్స్ మెంట్) కింద రూ.82 కోట్ల 40 లక్షలు విడుదల చేశాం.

మెరిట్ కమ్ మీన్స్ కింద 2014-15లో 286 మందికి రూ.85 లక్షలు విడుదల చేశారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పుల కోసం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) కింద 5,515 మందికి రూ.3 కోట్ల 77 లక్షలు విడుదల చేశారు.

- 2014-15లో మొత్తంగా 1,36,870 మంది విద్యార్థులకు రూ.144 కోట్ల 66 లక్షల స్కాలర్ షిప్పుల నిధులను పంపిణీ చేశారు..
- 2015-16లో మొత్తంగా 52,631 మంది విద్యార్థులకు రూ.10 కోట్ల 48 లక్షలు విడుదల చేశారు.
- 2014-15, 2015-16కు ఫీజు రీఎంబర్స్ మెంటు కోసం మరో రూ.186 కోట్లు అవసరం ఉంది. తక్షణం రూ.90 కోట్ల రూపాయలు విడుదల చేయాల్సి ఉంది.

అభివృద్ధి కార్యక్రమాలు

పేద ముస్లిం బాలికల వివాహం కోసం ప్రభుత్వం దుల్హన్ పథకం కింద రూ.50 వేలు ఆర్థిక సాయం చేస్తోంది. ఈ పథకం కింద 3,200 మంది లబ్ధిదారులకు రూ.16 కోట్ల రూపాయలు విడుదల చేశారు. ఇప్పటివరకు 5,122 మంది ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోగా.. ప్రస్తుతం 3,200 మందికి రూ.16 కోట్లు విడుదల చేశామని మంత్రి చెప్పారు.

- తత్కాల్ పథకం కింద రుణాల కోసం ఇప్పటివరకు 2,000 మందికి రూ.3 కోట్ల రూపాయలు విడుదల చేయాల్సి ఉంది.
- ఆదరణ కింద 9,823 మందికి రూ.10 కోట్ల 50 లక్షలు విడుదల చేయాల్సి ఉంది.
- స్మాల్ స్కేల్ రుణాల కింద 6 వేల మందికి రూ.9 కోట్లు విడుదల చేయాల్సి ఉంది
- దుకాణ్-మకాన్ కింద వెయ్యి మందికి రూ.8 కోట్ల 20 లక్షల రూపాయలు విడుదల చేయాల్సి ఉంది.
- ముస్లిం యువతీయువకుల శిక్షణ, ఉపాధి కోసం 3,900 మందికి రూ.8కోట్ల 09 లక్షలు ఖర్చు చేస్తున్నారు.
- క్రిస్టియన్ మైనార్టీల రుణాల కోసం 1,200 మందికి రూ.12 కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నారు.
- మైనార్టీల సర్వతోముఖాభివృద్ధి పథకం కింద (ఎంఎస్డిపి) రాష్ట్రంలో రూ.22 కోట్ల 67 లక్షలు విడుదల చేశారు. కడప, కర్నూలు, అనంతపురం, గుంటూరు జిల్లాల్లో మైనార్టీలకు అదనపు తరగతి గదులు, ఐటిఐలు, బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు.
- రూ.7 కోట్ల రూపాయలతో మసీదుల మరమ్మత్తులు, మౌలిక సౌకర్యాల కోసం ఖర్చు చేశారు.
- జెరూసలెం, హజ్ యాత్రకు సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడి ఇస్తోంది. 2015లో హజ్ యాత్రకు 2,404 మంది వెళ్లారు. ఈసారి జెరూసలెంకు 200 మందిని పంపుతున్నామని మంత్రి చెప్పారు.
- చంద్రన్న తోఫా, కర్నూలులో ఉర్దూ యూనివర్శిటీ, కడప, విజయవాడలో హజ్ హౌస్‌కు రూ.12 కోట్లు కేటాయించారు.
- గుంటూరులో రూ.10 కోట్లతో క్రిస్టియన్ భవన్‌కు శంకుస్థాపన చేశారు. త్వరలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, హజ్ కమిటీ పాటు అన్ని నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తాం.
- చంద్రన్న తోఫా కింద 9 లక్షల 93 వేల 405 ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుక ఇచ్చారు.
- ప్రస్తుతం కర్నూలు, గుంటూరు, విశాఖ పట్టణంలో మైనార్టీ స్టడీ సర్కిళ్లు ఉన్నాయి. త్వరలో ఒంగోలు, కడప, అనంతపురంలో ఏర్పాటు చేయనున్నారు.

వచ్చే మార్చి నాటికి శతశాతం గృహ విద్యుద్దీకరణ



- త్వరలో 4.3లక్షల గృహాలకు కొత్త కనెక్షన్లు
- ఎల్ఇడి బల్బులతో వీధిదీపాలు
- త్వరలో గృహాలకు విద్యుత్ ఆదా ఫ్యాన్లు
- మూడేళ్లలో 15లక్షల వ్యవసాయ పంపుసెట్లు
- విద్యుత్ పొదుపుతో రూ.6137 కోట్లు ఆదా

నవ్యాంధ్రప్రదేశ్‌లో వచ్చే మార్చి నెలాఖరునాటికి గృహావసరాలకు శతశాతం విద్యుద్దీకరణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చకచకా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా త్వరలో 4.3లక్షల గృహాలకు విద్యుత్ కనెక్షన్లు కొత్తగా ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ప్రజల అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పాదకతను పెంచి, గృహ వినియోగదారులకు సంపూర్ణంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్యుత్ సదుపాయం లేని గృహం ఉండకూడదని సీఎం అధికారులను ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ, సరఫరా విభాగాల అధికారులతో తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ విద్యుత్ రంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నవ్యాంధ్రను తీర్చిదిద్దాలని సీఎం కృషి చేస్తున్నారు. ఇందుకోసం అనేక సంస్కరణలు అమలు చేస్తున్నారు.

విద్యుత్ ఉత్పాదకత, సరఫరాలో రాష్ట్రం ముందంజలో ఉంది. విద్యుద్దీకరణ లేని గృహాలు ఉండకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. అలాగే విద్యుత్ వినియోగంలో ఆదా పాటించేందుకు, విద్యుత్ దుబారా, దుర్వినియోగాన్ని నియంత్రించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని ఇందుకోసం వినియోగదారులను చైతన్యం చేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ కార్యదర్శి అజయ్‌జైన్ తెలియజేశారు. గృహావసరాలకు సంబంధించి డొమెస్టిక్ ఎఫిషియన్ట్ లైటింగ్ కార్యక్రమం(డిఇఎల్‌పి) కింద తక్కువ విద్యుత్‌తో పనిచేసే లెడ్ బల్బులను పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యుత్ ఆదా పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా మొత్తం 5.4కోట్ల బల్బులు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఇప్పటివరకు 1.63కోట్ల కన్వెన్షనల్ బల్బులు పంపిణీ చేసినట్లు జైన్ వివరించారు.

5జిల్లాల్లో ఎల్ఇడి బల్బులు పంపిణీ

రాష్ట్రంలోని 13జిల్లాలలో ఇప్పటివరకు ఐదు జిల్లాల్లో ఈ పథకం కింద ఎల్ఇడి బల్బుల సరఫరా ప్రక్రియ పూర్తయింది. ఫిబ్రవరి నెలాఖరునాటికి మిగిలిన జిల్లాల్లో ఈ బల్బుల పంపిణీ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొన్ని ప్రాంతాల ప్రజలు ఈ పథకంలో చేరేందుకు ముందుకు రావడంలేదని, అయినా వారిని కూడ కలుపుకుంటూ వచ్చే మార్చి31నాటికి అందర్నీ

ఎల్ఇడి బల్బుల పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తామని అజయ్‌జైన్ వెల్లడించారు. ఎల్ఇడి బల్బుల ఉత్పత్తి గణనీయంగా పెరగడంవల్ల 9వాల్టుల సామర్థ్యంగల ఒక్కో బల్బు విలువ రూ.265ల నుంచి ఒకేసారి రూ.64లకు తగ్గిందని గుర్తు చేశారు.

వీధి దీపాలకు ఎల్ఇడి బల్బులు

వీధి దీపాలను కూడ ఎల్ఇడి బల్బులకు మార్చాలని లక్ష్యంగా నిర్దేశించారు. మొత్తం 5.49లక్షల బల్బులను మార్చాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 2.85లక్షల వీధి దీపాలను ఎల్ఇడి బల్బులకు మార్చారు. రాష్ట్రంలోని మొత్తం 110మున్సిపాలిటీలలో వచ్చే జూన్ 30నాటికి వీధి దీపాలన్నింటినీ ఎల్ఇడి బల్బులకు మార్పు చేయడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి.

మూడేళ్లలో 15లక్షల పంపుసెట్లు పంపిణీ

గ్రామీణ ప్రాంతాలలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్‌ను ఆదా చేసేందుకు అవకాశం ఉన్న వ్యవసాయ పంపుసెట్లను కూడ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రైతుల వద్ద ప్రస్తుతం ఉండే పంపుసెట్ల స్థానంలో విద్యుత్ ఆదా చేసే పంపుసెట్లను ఏర్పాటు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో పైలట్ పథకం కింద 2000వ్యవసాయ పంపుసెట్లను విజయవంతంగా మార్పుచేశారు. రాష్ట్రంలో మొత్తం 15లక్షల పంపుసెట్లను రాబోయే మూడు లేదా నాలుగేళ్ల కాలపరిమితిలో మార్చాల్సిన అవసరం ఉంది. ఈ పథకం కింద రాబోయే మూడేళ్లలో రూ.5వేల కోట్లు ఇవ్వడానికి కేంద్రప్రభుత్వం అంగీకరించిందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా 2016-17లో నాలుగు నుంచి ఐదు లక్షల పంపుసెట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విద్యుత్ ఆదా చేసే ఈ పంపుసెట్లను ఉచితంగానే పంపిణీ చేస్తున్నట్లు అజయ్‌జైన్ స్పష్టం చేశారు. ఒక్కో పంపుసెట్ ఖరీదు రూ.50,000 ఉంటుందన్నారు.

కొత్తగా విద్యుత్ ఆదా ఫ్యాన్లు

గృహాలలో ప్రస్తుతం వినియోగిస్తున్న ఫ్యాన్ల స్థానంలో విద్యుత్‌ను ఆదా చేసే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంగల ఫ్యాన్లు కూడ పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ కార్యక్రమాన్ని పశ్చిమగోదావరిజిల్లా, నరసాపురం డివిజన్‌లో వచ్చే మార్చి 1వ, తేదీ నుంచి పైలెట్ ప్రాజెక్టుకింద అమలు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్లో ఒక్కో ఫ్యాన్ ఖరీదు రూ.1,600లు ఉండగా, దీన్ని రూ.950లకే పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ లెక్కన ఒక్కో కుటుంబానికి రెండు ఫ్యాన్లు పంపిణీ చేయనున్నారు.

విద్యుత్ పొదుపుతో రూ.6,137కోట్లు ఆదా

విద్యుత్‌ను ఆదా చేయడానికి తీసుకుంటున్న చర్యలవల్ల 24.1శాతం లేదా 11,408మిలియన్ యూనిట్ల విద్యుత్ పొదుపు చేయవచ్చని, ఈ లెక్కన డబెంబతా లెక్కిస్తే రూ.6,137కోట్లు ఆదా అవుతుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు.

పవన, సౌరశక్తి ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదకతను మరింత పెంచుకోవడానికి వీలుగా సౌరశక్తి, పవన విద్యుత్ ఉత్పత్తిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతుంది. వచ్చే 2022నాటికి 175 గిగా వాట్స్ సామర్థ్యంగల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి కేంద్రప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 18,000మెగావాట్స్ సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇందులో తొలిదశగా పవన, సౌరశక్తి ద్వారా 800మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి పలు ప్రాజెక్టులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.5,000కోట్ల అంచనా వ్యయంకాగల విద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పేందుకు వివిధ ప్రైవేటు కంపెనీలతో ప్రభుత్వానికి అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. రాయలసీమలో 350మెగావాట్ల సామర్థ్యంతో సౌరశక్తి విద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పనున్నారు. అలాగే 619మెగావాట్ల సామర్థ్యంతో మరో 21ప్రాజెక్టులు కూడ నెలకొల్పేందుకు ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. విద్యుత్ నిర్వహణ, సరఫరాలో చోటుచేసుకుంటున్న చోరీలను, దుర్వినియోగాన్ని నియంత్రించేందుకు పకడ్బంధీగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యుత్‌శాఖ కార్యదర్శి అజయ్‌జైన్ స్పష్టీకరించారు. ❖



ఏపీ గిడ్డంగుల సంస్థ డివిడెండ్ రూ 4.66 కోట్లు సీయంకు అందజేత

ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ 2013-14, 2014-15 ఆర్థిక సంవత్సరాలకు గాను రూ.4,66,56,000 డివిడెండ్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసిన కార్పొరేషన్ చైర్మన్ ఎల్‌వీఎస్‌ఆర్‌కే ప్రసాద్ ఈ మొత్తాన్ని చెక్ రూపంలో అందజేశారు. వ్యవసాయశాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు, కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఏఆర్ సుకుమార్‌లతో కలిసి సీయంను కలిసిన చైర్మన్ ప్రసాద్ కార్పొరేషన్ అభివృద్ధి ప్రణాళికల గురించి వివరించారు. సంస్థను అభివృద్ధిపథంలో నడిపిస్తున్నందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పాలకవర్గాన్ని అభినందించారు. ముఖ్యమంత్రి సహాయనిధికి ఇటీవలే కార్పొరేషన్ రూ. కోటీ 40 లక్షల్ని అందించింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రైతులకు గోదాములను అందుబాటులోకి తెస్తున్నట్టు చైర్మన్ ప్రసాద్ వివరించారు. ❖

నవ్యాంధ్రలో రూ.18వేల కోట్లతో ఓడరేవుల అభివృద్ధి

- కేంద్రానికి వెళ్ళిన ప్రతిపాదనలు
- నాలుగు నెలల్లో మచిలీపట్నం రేవు భూసేకరణ
- అనకాపల్లి వద్ద లాజిస్టిక్ పార్కు



కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పథకం సాగరమాల - సుమారు వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్ కు కచ్చితంగా ఓ వరమాల. నవ్యాంధ్ర తీర ప్రాంత ముఖచిత్రాన్ని సమూలంగా మార్చివేయాలని దీక్షబూనిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి స్వప్నాన్ని సాకారం చేసే ఉజ్వల జల సంకల్పం - సాగరమాల.

నవ్యాంధ్రప్రదేశ్‌లో కేంద్రప్రభుత్వ సహకారంతో 'సాగరమాల ప్రాజెక్టు' కింద రాబోయే రోజుల్లో రూ. 18వేల కోట్ల అంచనా వ్యయంతో ఓడరేవులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రేవుల ప్రగతికి సంబంధించిన ప్రతిపాదనలు అధికారులు కేంద్రానికి పంపించారు. ఈ ప్రతిపాదనలను కేంద్రం అనుమతిస్తే, వచ్చే నాలుగేళ్లలోనే ప్రాజెక్టులన్నీ పూర్తిచేయొచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అన్నీ అనుకున్నట్టే జరిగితే ప్రస్తుతం ఓడరేవుల ఆధారంగా జరుగుతున్న వ్యాపార, వాణిజ్య లావాదేవీల వ్యయం 13శాతం నుంచి సగానికి తగ్గించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

విశాఖపట్నం, కృష్ణపట్నం, కాకినాడ రేవుల వద్ద లాజిస్టిక్ పార్కులు నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. నవ్యాంధ్రలో కొత్తగా నాలుగు ఓడరేవులు ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతున్నట్లు ఏపీ ఓడరేవులశాఖ డైరెక్టర్ వి రవికుమార్ స్పష్టీకరించారు. అలాగే కాకినాడ, విశాఖపట్నం రేవుల్లో కంటైనర్ టెర్మినల్స్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ రంగ సంస్థయిన కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐఎల్)కు భూములు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈనెల 11న జరిగిన 'మారిటైమ్ ఇండియా సదస్సు రోడ్‌షో'లో పాల్గొన్న సందర్భంగా రవికుమార్ ఈ విషయాలను తెలియజేశారు. వచ్చే ఏప్రిల్ 14 నుంచి 16వ, తేదీలలో ముంబయిలో జరగనున్న 'మారిటైమ్ ఇండియా సదస్సు'కు సన్నాహంగా హైదరాబాద్‌లో ఈ సదస్సు జరిగింది.

నవ్యాంధ్రప్రదేశ్‌లో గల పారిశ్రామిక కారిడార్లు, క్లస్టర్లను చైనా తరహాలో ఓడరేవులతో అనుసంధానం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

భావనపాడు పోర్టుకు త్వరలో బిడ్డర్ ఎంపిక

శ్రీకాకుళంజిల్లా భావనపాడుకు సమీపంలో రూ. 5వేల

కోట్ల అంచనా వ్యయంతో రెండు దశల్లో తలపెట్టిన ఓడరేవుకు త్వరలో బిడ్డర్‌ను ఎంపిక చేయాలని నిర్ణయించారు. అయితే బిడ్డర్ ప్రక్రియను వచ్చే ఏప్రిల్ నెలాఖరు నాటికి ఏదో ఒక కంపెనీకి ఖరారు చేయాలని నిర్ణయించారు. ఏ కంపెనీకి అప్పగించాలన్న కోణంలో ప్రభుత్వం కసరత్తు చేసస్తున్నది.

గంగవరం, కృష్ణపట్నం ఓడరేవులతోపాటు అదానీ పోర్టు కంపెనీలు భావనపాడు పోర్టు నిర్మాణం, నిర్వహణ చేపట్టేందుకు పోటీపడుతున్నాయి. అలాగే మచిలీపట్నం ఓడరేవు నిర్మాణానికి అవరోధంగా తయారైన భూసేకరణ ప్రక్రియను కూడ వచ్చే మూడు లేదా నాలుగు నెలల్లో పూర్తవుతుందని ఏపీ ఓడరేవులశాఖ డైరెక్టర్ వి రవికుమార్ వెల్లడించారు. భావనపాడుతోపాటు నరసాపురం, రామాయపట్నంలలో కూడ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఓడరేవులను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

అనకాపల్లి వద్ద లాజిస్టిక్ పార్కు

విశాఖపట్నంజిల్లా, అనకాపల్లికి సమీపంలోని సుమారు 400ఎకరాల విస్తీర్ణంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. రెండున్నరవేలక ఓట్ల అంచనా వ్యయం కాగల ఈ ప్రాజెక్టు మూడు నుంచి ఐదేళ్లలో పూర్తవుతుంది. నవీకరణ, విస్తరణ ద్వారా ఈ నౌకాశ్రయం సామర్థ్యాన్ని 93.83 మిలియన్ టన్నుల నుంచి వచ్చే ఏడాదికి 125.97మిలియన్ టన్నులకు పెంచబోతున్నట్లు విశాఖపట్నం పోర్టు ట్రస్టు ఛైర్మన్ ఎం.టి. కృష్ణబాబు స్పష్టంచేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఐదొందల కోట్ల వ్యయంతో విశాఖపట్నం పోర్టు ట్రస్టు ఏర్పాటు చేయనున్నది.

కెపిఎంజి సంస్థ మూడు నెలల్లో ఈ లాజిస్టిక్ పార్కుకు సంబంధించిన సవర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) సమర్పిస్తుందని ఛైర్మన్ కృష్ణబాబు వెల్లడించారు.

విశాఖపట్నం పోర్టు ట్రస్టు ద్వారా ఆరుకోట్ల టన్నుల సరుకుల ఎగుమతి, దిగుమతుల లావాదేవీలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. అయితే రేవుల్లో బెర్తుల నవీకరణ, నౌకాశ్రయంతో రహదారులు, రైలు మార్గాల అనుసంధానాన్ని మరింత మెరుగుపరచాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.4,500కోట్లు పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నారు. తమ పోర్టులో ఎగుమతి, దిగుమతుల లావాదేవీల సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ ప్రాజెక్టు పనులు 2020నాటికి పూర్తయ్యేలా కృషి చేస్తున్నట్లు కృష్ణబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏటా 8.5కోట్ల టన్నుల సరుకులను ఎగుమతి,దిగుమతుల లావాదేవీలు చేయొచ్చని భావిస్తున్నారు. ఓడరేవులో సరుకుల రవాణా ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు రూ.600కోట్లతో ఎలివేటెడ్ రహదార్లను నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు.

'సౌరవిద్యుత్'దిశగా పనిచేసే తొలి ఓడరేవు

దేశంలో సౌరవిద్యుత్‌తో పనిచేసే తొలి ఓడరేవుగా విశాఖపట్నం గుర్తింపు పొందనున్నదని విశాఖపట్నం పోర్టు ట్రస్టు ఛైర్మన్ కృష్ణబాబు తెలిపారు. ప్రస్తుతం ఓడరేవులో రెండు మెగావాట్ల సామర్థ్యంగల సౌరవిద్యుత్ ప్లాంట్ పనిచేస్తుంది. మార్చి 20నాటికి మరో 8మెగావాట్ల సామర్థ్యంగల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మొత్తం 10మెగావాట్ల సామర్థ్యంగల సౌరవిద్యుత్ ఓడరేవు అవుతుందన్నారు.

❖

రాష్ట్రంలో 10 కంపెనీలు.. లక్ష కోట్ల పెట్టుబడులు

జనవరి 10 నుంచి 12 వరకు విశాఖపట్నంలో నిర్వహించిన పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలు కార్యరూపం దాల్చునున్నాయి. విడతల వారీగా పరిశ్రమల శాఖ అధికారుల సమక్షంలో కంపెనీల ప్రతినిధులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ టక్కర్ నిర్వహిస్తున్న సమీక్షలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 10 కంపెనీలు తమ కార్యకాలపాలను ఆంధ్రప్రదేశలో చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నామంటూ టక్కర్‌కు హామీ ఇస్తున్నాయి.

99,441 కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టడం ద్వారా 2,11,986 మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నాయి. తమకు భూమితో పాటు పలు మౌలిక సదుపాయాలు కల్పిస్తే తక్షణమే తమ కార్యకలాపాలకు సన్నద్ధమవుతామని వివరిస్తున్నారు. ఎయిర్‌బ్‌సతో సహా పలు ప్రపంచ ఖ్యాతి చెందిన సంస్థలతో అవగాహన కుదుర్చుకున్న ఎస్సెల్ గ్రూప్ అనంతపురం జిల్లాలో ఏరోస్పేస్, డిఫెన్స అకాడమీని ఏర్పాటుచేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. చైనాకు చెందిన ప్రముఖ కంపెనీలతో చేసుకున్న ఒప్పందం మేరకు చిత్తూరు జిల్లాలో భారీ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తామని వివరించింది.

గుజరాత్ అంబూజా మొక్కజొన్నతో ఆహార తయారీ యూనిట్‌ను స్థాపించేందుకు సిద్ధమైంది. మొదట్లో 100 ఎకరాలను కేటాయించాలని కోరిన ఈ సంస్థ ఇప్పుడు మొక్కజొన్న సాగు కోసం మరో 100 ఎకరాలు కేటాయించాలని కోరుతోంది.

భారీ పరిశ్రమలకు ట్యూబ్‌లను అందించే రెడ్‌సన్ పరిశ్రమ 400 కోట్లతో నెల్లూరులో యూనిట్‌ను స్థాపించేందుకు ముందుకు వచ్చింది.

ప్రకాశం జిల్లాలో మోహన్ ద్విల్లర్స్ భారీ టెక్స్ టైల్ పరిశ్రమను స్థాపించేందుకు ముందుకు వచ్చింది. జిన్నింగ్ నుంచి వస్త్రాల ఉత్పత్తి, డిజైనింగ్ వరకూ ఒకేచోట ఉత్పత్తులు జరుగుతాయి. ఇలాంటి పరిశ్రమ రాష్ట్రంలో ఇప్పటి వరకూ రాలేదు. 500 ఎకరాల్లో స్థాపించే ఈ ప్లాంటు కోసం 2,000 కోట్ల రూపాయలు పెట్టుబడి పెడతామంటూ కంపెనీ ప్రతినిధులు వివరించారు.

1200 కోట్లతో దక్కన్ కెమికల్స్ రాష్ట్రంలో ప్లాంట్‌ను స్థాపించేందుకు సిద్ధమైంది. సొంతంగా భూమిని సేకరించుకున్న ఈ కంపెనీ తమకు అప్రోచ్ రోడ్ ఉంటే చాలాని చెబుతోంది.

శ్రీకాకుళంలో జిఎంఆర్ గ్రూపు ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 500 ఎకరాలను సొంతంగా సమీకరించుకున్న సిఎంఆర్ సంస్థ త్వరలోనే తమ కార్యకలాపాలను చేపట్టెందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

జైన్ ఇరిగేషన్ కూడా తమ కార్యకలాపాలను విస్తరించేందుకు సిద్ధమైంది.

2,000 కోట్ల రూపాయల పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న రామ్‌కో సిమెంట్స్‌కు సున్నపురాయి నిక్షేపాల అప్పగింతపై త్వరలో నిర్ణయం తీసుకోవాలని పరిశ్రమల శాఖను సిఎస్ ఆదేశించారు.

వెన్‌టెక్ కూడా తన కార్యకలాపాలను రాష్ట్రంలో చేపట్టాలని నిర్ణయించింది.

హిందూస్తాన్ కోకాకోలా 1,275 కోట్ల రూపాయల పెట్టుబడితో నెల్లూరు, మరో 1,275 కోట్ల రూపాయలతో విశాఖలో తన కార్యకలాపాలను చేపట్టెందుకు కార్యాచరణను సిద్ధం చేసింది.

సోలార్ మాడ్యూల్స్‌ను తయారు చేసే హరియాన్ 1,200 కోట్ల రూపాయలతో విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది.

❖



‘షి ఆటో’లతో వినూత్న ప్రయోగం

డ్వాక్రా మహిళల్లో ఆర్థిక స్వావలంబనకు సీఎం చంద్రబాబు చేయూత

మహిళా సాధికారత కోసం రెండు దశాబ్దాల క్రితం ప్రవేశపెట్టిన డ్వాక్రా గ్రూపుల నిర్వహణ వల్ల వారికి ఎన్నో రకాల ప్రయోజనాలు ఒనగూరుతున్నాయి. వారి ఆదాయం పెంచేందుకు రాష్ట్రంలో సరికొత్త కార్యక్రమాలు చేపట్టడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకశ్రద్ధ కనపరుస్తున్నారు.

మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా వున్న 89 లక్షల మహిళలలో 14 లక్షల మంది మాత్రమే ఆదాయాన్ని ఆర్జించే కార్యక్రమాలు చేపట్టారని, మిగిలిన వారికి కూడా అవసరమైన శిక్షణ ఇచ్చి వారిని కూడా ఆదాయాన్ని ఆర్జించే కార్యక్రమాలు చేపట్టేలా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారు.

2019 నాటికి ప్రతి ఇంటికి ఒక మహిళ ఈ–లిటరేట్ కావాలి...డ్వాక్రా మహిళల్లో నూరు శాతం అక్షరాస్యత సాధించాలి... నైపుణ్యాలు పెంచుకుని మహిళలు వ్యాపారదక్షులు కావాలి... అన్నసంజీవని, ఫుడ్ క్యాంటిన్లు వారి ద్వారా మహిళలకు ఉపాధి కల్పించాలి... రాష్ట్రంలో మహిళల జీవనోపాధులు మెరుగుపర్చడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యం.... ప్రతి మహిళ నెలసరి ఆదాయం రాబోయే నాలుగేళ్లలో రూ.10 వేలకు పెరగాలి... రాష్టంలోని మహిళల్లో చైతన్యం పెంచేందుకు గత అక్టోబరు 2 నుంచి మహిళా సాధికార యాత్ర చేపట్టేలా చూశాం... ఇవీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షలు. రాష్ట్రవ్యాప్తంగా రూ.14 వేల కోట్లు కార్పస్ నిధులున్న స్వయం సహాయక బృందాలు మనకున్న గొప్ప వేదిక, మహిళా శక్తికి నిదర్శనం అంటూ, వారిని ఒక్కో రంగంలో తర్ఫీదు నిచ్చి స్వావలంబనకు దోహద పడాలన్నది ముఖ్యమంత్రి ప్రగాఢ కోరికగా కనపడుతోంది.

విజయవంతమైన ‘షి ఆటో’

మహిళల సాధికారికత విషయమై నిత్యం తపించే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. మగాళ్లకు ధీటుగా మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలి, అన్ని రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో ‘షి ఆటో’ పథకాన్ని ప్రారంభించారు. ఆ పథకంలో భాగంగా విజయవాడలో 49 మంది మహిళలకు సుమారు రూ. కోటి విలువ చేసే ఆటోరిక్షాలు పంపిణీ చేశారు. పూర్తిగా సీఎన్జీతో నడిచే ఈ ఆటోలు పర్యావరణ రహితమే కాకుండా, మహిళా ప్రయాణికులకు రక్షణ కల్పించడానికి ‘షి ఆటో’ దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. షిఆటోల మూలంగా మహిళా ప్రయాణీకులకు భద్రతకల్పించడం, సవాళ్ళను స్వీకరించే మహిళలు ఉపాధి పొందడానికి మంచి అవకాశం. ఇదే విధంగా అనేక రంగాల్లో ఉపాధి పొందుతూ ఆయా చోట్ల ఎదురయ్యే సవాళ్లకు ఎదురొడ్డి నిలవడం ద్వారానే అత్యధిక శాతం మహిళలు లబ్ధిపొందగలుగుతారు. మహిళా సాధికారత సాధించడం వల్ల సమాజ స్థితిగతులు మెరుగు పడతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రూ.1,91,000 విలువ చేసే ఈ ఆటోలకు 7 శాతం సబ్సిడీ అందించిన ప్రభుత్వం.. మిగిలిన మొత్తాన్ని 40 ఇన్‌స్టాల్‌మెంట్లలో నెలకు రూ.4,500 చొప్పున చెల్లించే అవకాశం కల్పించింది. ఆటోలు

నడపడం ద్వారా నెలకు రూ. 18 వేల వరకు లబ్దిదారులు ఆర్జించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

'షి ఆటో' పథకంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలో సైతం లబ్దిపొందిన మహిళలు ఉపాధి పొందుతూ వారి కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లా, అదేమండలంలోని బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన కొందరు మహిళలు ఆటోలను నడుపుతూ విజయపథాన నడుస్తున్నారనడానికి పలు ఉదాహరణలున్నాయి. ఈ మహిళలు ఏడు నుంచి పదో తరగతి వరకూ మాత్రమే చదువుకున్నారు. ఆ మహిళల భర్తలు సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, ఆటో రిక్షా డ్రైవర్లు, తాపీపనివారలు, చేతి వృత్తులవారు. పలువురు మహిళలు ఉపాధి కల్పించుకొంటూ మిగిలిన మహిళాలోకానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. విజయవాడలో గారపాటి కానుమిల్లి ఛారిటీ, పీపుల్స్ వెల్ఫేర్ సొసైటీ, పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలన మిషన్, నగరపాలక సంస్థలు సంయుక్తంగాను, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, గ్రామీణాభివృద్ధి ట్రస్ట్ సహాయంతో పలువురు మహిళలకు వేర్వేరుగా ఆయా ప్రాంతాల్లో ఆటో డ్రైవింగ్ పై శిక్షణ ఇచ్చారు. డ్రైవింగ్ తోపాటు జీవిత కాల లైసెన్స్ లను కూడా లభించేట్లు చేశారు. అదే సమయంలో ఆత్మరక్షణలో కూడా మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ మహిళలకు జిల్లాయంత్రాంగం, పోలీసులు, ఆర్టీఓ అధికారుల నుంచి తగిన సహాయసహకారాలు అందేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు తోడ్పడ్డారు. అనంతపురం పట్టణంలో రైల్వేస్టేషన్, బస్టాండుల వద్ద ప్రత్యేకంగా డ్వాక్రా మహిళా ఆటో డ్రైవర్లకు ఆటోలు ఆపేందుకు స్థలం కేటాయించారు. బుక్కపట్టణంలో గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులను, వ్యవసాయ కూలీలను కచ్చా రోడ్లపై కూడా తీసుకెళ్ళేటట్లు ఈ మహిళా డ్రైవర్లు ఆటోలను నడపగలుతున్నారు.

ఆటో డ్రైవరుగా వెళ్ళడానికి ముందు కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు.. అయితే షి ఆటో పథకం ప్రభుత్వం నడుపుతోందని తెలిసి తన భర్త అంగీకరించారని విజయవాడకు చెందిన స్వర్ణ అనే మహిళ శిక్షణ సమయంలో పేర్కొంది. ఇలా అనేక మంది ఎన్నో అనుమానాలు, భయాల మధ్య ఆటో డ్రైవర్లుగా ఉపాధి పొందడానికి వెనుకాడినా కొంతమంది ముందుకొచ్చి శిక్షణ పొంది, ఇప్పుడు ఉపాధిలో ఒక్కోసారి భర్త కంటె అధికంగా సంపాదిస్తూ వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా తోడ్పాటునందిస్తుండటం విశేషం. అమరావతి రాజధాని అయిన దృష్ట్యా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సీఎన్జీ ఆటోలను శిక్షణ పొందిన



మహిళలకు పంపిణీ చేసింది.

మెట్రిక్యులేషన్ చదివిన 35 ఏళ్ళ ఆత్మకూరు మండలం హనుమంతురుకు చెందిన ఒంటిమిడి నల్లమ్మ ఇద్దరు పిల్లల తల్లి కూడా. నల్లమ్మ నడుపుతున్న ఆటోలోనే మహిళలు, ఉ ద్యోగినులు అధికంగా ఎక్కుతుంటారు. ఈ ఆటో నడపడం ద్వారా రోజుకు ఆమె రూ. 500 నుంచి రూ. 600 వరకూ సంపాదిస్తూ కుటుంబానికి అండగా ఉంటోంది. ఆటో నడపడంవల్ల లభించే ఆదాయంతో

సి.నాగలక్ష్మి అనే మరో మహిళ తన కూతురు ఇంటర్మీడియెట్, కుమారుడు తొమ్మిదో తరగతి చదవడంలో చెల్లించే అయ్యే ఫీజుల ఖర్చులో తాను కూడా కొంత భరిస్తున్నట్లు చెప్పింది. ఆటో నడపడంతోపాటు దాని మరమ్మతుల నిర్వహణలోనూ కొందరు మహిళలు తర్ఫీదు పొందడంతో సులువవుతోంది. సొంత ఆటో లేనిపక్షంలో అద్దె ఆటోకు సంపాదించిన సొమ్ములో అధికభాగం సంబంధిత యజమానికి ఇవ్వాల్సి ఉండేది. గతంలో నెలవారీ రూ. 7000 ఉండే వారి కుటుంబ ఆదాయంతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అయితే సొంతంగా ఆటో నడపడం మూలంగా ఇప్పుడు రోజుకు రూ. 800 వరకూ సంపాదించడంతో ఎంతో హాయిగా కుటుంబ జీవనం సాగిపోతోందని షేక్ షబీ అనే 28 ఏళ్ల మహిళ వివరించింది. మహిళల అపార శక్తి, సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవడానికి సరైన సదుపాయాలు, అవకాశాలు ప్రభుత్వాలు కల్పించాలి. ప్రత్యేకంగా ఉపాధి కల్పనలో, జీవనోపాధి కోసం కష్టించే మహిళలను సాటివ్యక్తులు సోదర భావంతో ఆదరించి ప్రోత్సహించడం వల్ల సత్ఫలితాలొస్తాయి. సమాజానికి మేలు చేసే కారకాలలో మహిళాభ్యున్నతి అత్యున్నతమైనది ఆంధ్రప్రదేశ్ భావించి అందుకు తగిన వేదికలను ఏర్పాటు చేస్తోంది. హీనభావం, వర్గబే ధాలకు వ్యతిరేకంగా పోరాడే మహిళలకు ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో 'షి ఆటో' పథకం ఒక ముందడుగు.

– సి.ఎస్. రామలక్ష్మి, ఐఎఫ్ఎస్ (రిటైర్డ్)
ప్రభుత్వ సలహాదారు, సెర్ప్, ఏపీ ప్రభుత్వం

ఏపిలో వెయ్యికోట్ల పెట్టుబడులకు 'జెడ్‌టీఇ' సాఫ్ట్ ఆసక్తి

- ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఐటి కంపెనీలలో ఒకటైన 'జెడ్‌టీఇ' సాఫ్ట్ కంపెనీ నవ్యాంధ్రప్రదేశ్‌లో దాదాపు వెయ్యికోట్ల మేరకు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపింది. ఈ-ప్రగతి, స్మార్ట్ సిటీలు, స్మార్ట్ టెక్నాలజీస్ ప్రాజెక్టుల్లో రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించేందుకు ఈ కంపెనీ ముందుకు వచ్చింది. ఏపీ ఐటీశాఖ మంత్రి డా.పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో ఐటీశాఖ ప్రత్యేక కార్యదర్శి జివిఎస్ ఫణికిషోర్, జెడ్‌టీఇ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ హెచ్ ప్రసూన్ శర్మ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

'ఉపాధి హామీ'లో జాతీయ అవార్డు అందుకున్న 'ఏపీ'

- కేంద్రప్రభుత్వానికి సంబంధించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిన నవ్యాంధ్రప్రదేశ్‌కు జాతీయస్థాయి అవార్డు లభించింది. ఫిబ్రవరి 2వ తేదీన న్యూఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రభుత్వం అందుకున్నది. ఈ అవార్డును ఏపీ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక కార్యదర్శి దినేష్‌కుమార్ ప్రభుత్వం తరఫున కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా, జబాబుదారీతనంతో అత్యుత్తమంగా అమలు చేస్తున్నందుకు కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి ఈ అవార్డు ఇచ్చింది.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక చర్యలు

- ఈ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డా.పి నారాయణ వెల్లడించారు. ప్రకాశం, గుంటూరు, కృష్ణా, కర్నూలు జిల్లాల్లో ఈ ఏడాది త్రాగునీటి ఎద్దడి అధికంగా ఉందన్నారు. అందుకే వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ కలుగనీయకుండా ఈ సవస్యను పరిష్కరించాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఒంగోలులో ఏడుగుండ్లపాడు నుంచి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు పైపులైన్ల ద్వారా త్రాగునీటిని సరఫరా చేయడానికి నిధులు మంజూరు చేసినట్లు మంత్రి చెప్పారు. ప్రస్తుతం ఉన్న పైపులైన్ల సామర్థ్యం తక్కువగా ఉండటంవల్ల కొత్త పైపులైన్లు నిర్మించేందుకు రూ.40 కోట్లు మంజూరు చేస్తున్నట్లు నారాయణ తెలియజేశారు. ఈ పనులకు తొందరలోనే టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు.
- అలాగే ఒంగోలు పట్టణానికి రూ.371కోట్ల అంచనా వ్యయంతో శాశ్వత మంచినీటి పథకాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా గుండ్లకమ్మ నది నుంచి త్రాగునీటిని సరఫరా చేయడానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. ఒంగోలులో రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు ఉన్నాయని, మూడవ సమ్మర్‌స్టోరేజీ ట్యాంకును పేర్నమిట్టలో నిర్మించే విషయాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు.

'మెరైన్' మెంబర్‌గా 'తమటాపు'

- మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ మెంబర్‌గా ఆంధ్రప్రదేశ్ (విశాఖపట్నం) కు చెందిన తమటాపు భాస్కరమూర్తిని కేంద్రప్రభుత్వం నియమించింది.

చంద్రబాబుకు 'ఆదర్శ' ముఖ్యమంత్రి అవార్డు

- నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రతిష్ఠాకరమైన 'ఆదర్శ ముఖ్యమంత్రి' అవార్డు లబించింది. పూణేకు చెందిన భారతీయ ఛాత్ర సంసద్ (బీసీఎస్) ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ప్రజాజీవితంలో యువతకు ఆదర్శంగా నిలుస్తూ, రాష్ట్ర విభజన జరిగిన క్లిష్ట పరిస్థితుల్లో నూతన రాష్ట్ర ఆవిష్కరణతోపాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సత్పరిపాలనకు సనర్థవంతంగా చర్యలు తీసుకుంటున్నందుకు గాను చంద్రబాబుకు ఈ అవార్డు లభించింది. ముఖ్యమంత్రిగా సత్పరిపాలనకు ప్రతీకగా నిలిచారంటూ ఈ మహాసభలో నిర్వాహకులు చంద్రబాబును కీర్తించారు. చంద్రబాబు రాజకీయ జీవితం భారత ప్రజాస్వామ్య వ్యవస్థను బలపరిచిందని నిర్వాహకులు ప్రశంసించారు.

తెలుగు రాష్ట్రాల్లో డ్రైవర్లే ఓనర్లు

- డ్రైవర్ల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్న ప్రధాన లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల ఇచ్చిన పిలుపును అందుకుని అమెరికాకు చెందిన ప్రఖ్యాత ట్రాన్స్‌పోర్టు కంపెనీ ఉబర్ సంస్థ ముందుకు వచ్చింది. ఆ సంస్థ ఏపీ, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో డ్రైవర్లను యజమానులు చేయడానికి నడుంబిగించింది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాలలో క్యాబ్ డ్రైవర్లను వాహన యజమానులుగా తీర్చిదిద్దుతారు. ఈ మేరకు ఎన్టీఆర్ ట్రస్ట్‌తో ఆ కంపెనీ ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నది. ఈ ఒప్పందంలో భాగంగా 20వేల మంది క్యాబ్ డ్రైవర్లను యజమానులను చేసేందుకు ఉబర్ కంపెనీ రంగం సిద్ధం అవుతోంది. ఎన్టీఆర్ ట్రస్టుతో ఉబర్ కంపెనీ ఒడంబడిక కుదుర్చుకున్న అనంతరం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ప్రత్యేకంగా భేటీ అయ్యింది.

నిరుపేదలకు చంద్రబాబు అండ

- నవ్యాంధ్రప్రదేశ్‌లో రకరకాల సమస్యలతో సతమతమవుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆసరాగా ఉంటూ, ఆర్థిక సహకారం అందిస్తున్నారు.
- విజయవాడకు చెందిన ఎస్కే నాగుల్‌బి కిడ్నీ సంబంధ సమస్యలతో చికిత్సపొందుతూ ఇటీవల సీఎంను కలిశారు. ఆమెకు లక్ష రూపాయలను 'ముఖ్యమంత్రి సహాయనిధి' నుంచి చంద్రబాబు మంజూరు చేశారు. వైద్యానికి ఎంతఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామం నుంచి వచ్చిన తమ్మా రమాదేవి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా, ఆమె వైద్యానికి రెండు లక్షల రూపాయలను మంజూరు చేశారు. కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం, పోచంపల్లికి చెందిన వెంకటరావమ్మ రైలు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆర్థికంగా దెబ్బతినగా, ఆమెను ఆదుకోడానికి ముఖ్యమంత్రి లక్ష రూపాయల సహాయం అందించారు. పేదరికం తన ఉన్నత చదువుకు అడ్డంకిగా ఉందని మచిలీపట్నం మండలం, రాజుపేటకు చెందిన బీ.కాం చదువుకున్న జబీనా బేగం ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయగా, రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. విజయవాడ పాయకాపురం పాతరాజీవ్ గాంధీనగర్ నుంచి ఎం రమాదేవి వికలాంగుడైన తన కుమారునితో వచ్చి కుటుంబ ఇబ్బందులను విలపించగా, అందుకు స్పందించిన చంద్రబాబు వారికి 25వేల రూపాయల ఆర్థిక సహాయం మంజూరు చేశారు. ప్రకాశంజిల్లా త్రిపురాంతకం మండలం, కొత్త సముద్రం గ్రామం నుంచి వచ్చిన దిరిశాల కోటయ్య కుటుంబం ఆర్థిక ఇబ్బందులను పరిష్కరించేందుకు రూ.25వేలు మంజూరు చేశారు.

రాజమండ్రిలో 'కోకో' పార్క్

- తూర్పుగోదావరిజిల్లా, రాజమండ్రిలో విటూసీ గ్రూప్ ఆధ్వర్యంలో కొబ్బరి పంట ఆధారిత 'ఇంటిగ్రేటెడ్ కోకో పార్కు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ కంపెనీ సీఎండీ డివి రామ్‌కుమార్ నేతృత్వంలో గల ప్రతినిధిబృందం ఇటీవల ముఖ్యమంత్రిని

కలిసింది. దాదాపు మూడొందలకోట్ల పెట్టుబడితో కోకోపార్కు (యాంకర్ ఇండస్ట్రీ) ప్రాజెక్టును నెలకొల్పాలని నిర్ణయించింది. దీనికి అనుబంధంగా పరిశ్రమలు నెలకొల్పేందుకు మరో రూ.350 కోట్ల మేరకు పెట్టుబడులు అదనంగా పెట్టానున్నారు. కొబ్బరిపంట ఉత్పత్తి నుంచి దిగుబడి వరకు, అలాగే కొబ్బరికాయలో ప్రతి పదార్థాలన్నీ వినియోగంలోకి తీసుకొచ్చి, ఈ కొబ్బరి పంటను రైతులకు లాభసాటిగా మార్చాలన్నదే కోకో పార్కు ప్రాజెక్టు ముఖ్యోద్దేశం. కోకో ప్రధాన ప్రాజెక్టుతోపాటు దీనికి అనుబంధంగా మరో 15పరిశ్రమలు రానున్నాయి.

గిడ్డంగుల విస్తరణకు ప్రణాళికలు

- నవ్యాంధ్రప్రదేశ్‌లో గిడ్డంగులను విసస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. రాష్ట్ర అవససరాలకు తగ్గట్టుగా గిడ్డంగి వసతి సౌకర్యం మెరుగుపరచాలని, ఇందుకు తగిన ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ ఎల్వీఎస్ఆర్కె ప్రసాద్‌కు సూచించారు. ప్రసాద్ ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి గిడ్డంగుల అభివృద్ధిపై కూలంకషంగా చర్చించారు. ఏపీలో తమకు మొత్తం 54గిడ్డంగులు ఉండగా ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచే సామర్థ్యం ఉన్నట్లు ప్రసాద్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఏడాది మరో రెండు లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని పెంచబోతున్నట్లు తెలిపారు.

'శ్రీవారి' దర్శనానికి మొబైల్‌లో టిక్కెట్లు

- తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి దర్శనానికి సంబంధించి అమలులో ఉన్న మూడొందల రూపాయల దర్శనం టిక్కెట్లను ఇకపై మొబైల్ అప్లికేషన్ ద్వారా బుక్ చేసుకోవడానికి వీలుగా అతిత్వరలో చర్యలు తీసుకోబోతున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) కార్యానిర్వాహక అధికారి డి సాంబశివరావు తెలిపారు. అలాగే వెయ్యి స్థంభాల మంటపం పునర్నిర్మాణం ఈ ఏడాది పూర్తవుతుందని టిటిడి చీఫ్ ఇంజినీరు చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు.

'మొబైల్ ఆప్' ద్వారా విద్యుత్ బిల్లులు

- రాష్ట్రంలో విద్యుత్ బిల్లులను ఇక నుంచి మొబైల్ యాప్ విధానంలో కూడ చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏపిఎస్‌పిడిసిఎల్ సంస్థ ఈ కొత్త విధానాన్ని అమలులోకి తెస్తోంది. ఈ మొబైల్ యాప్‌ను ఎక్కడ నుంచైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తొలుత ఇ-మెయిల్ ఐడితో సైన్ అయి, తర్వాత 13 అంకెలు గల విద్యుత్ కనెక్షన్ సర్వీసు నంబరు టైప్ చేసి, బిల్లు మొత్తాన్ని చెల్లించవచ్చు. మొబైల్ యాప్ సౌకర్యంతో బిల్లు వివరాలు, చెల్లింపు వివరాలను కూడ తెలుసుకోవచ్చు. అలాగే విద్యుత్ సరఫరా సమాచారం కూడ తెలుసుకోవచ్చు. బిల్లు చెల్లింపులకు సంబంధించి అన్ని వివరాలను తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది.

అంతర్జాతీయ స్థాయిలో తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి

- శ్రీవేంకటేశ్వరస్వామి వేంచేసి ఉన్న తిరుపతి (తిరుమల) రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి సురేష్‌ప్రభుకు టిటిడి ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఇందుకు అవసరమైన సహకారం టిటిడి తరపున అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు .ప్రతిరోజూ వేలాది మంది యాత్రీకులు రైల్వేస్టేషన్‌కు వచ్చి పోతుంటారని, అందువల్ల ఈ స్టేషన్‌ను ఉన్నత స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.

కృష్ణా 'వర్సిటీ' నిర్మాణ బాధ్యత వీసీకి

- రుద్రవరం వద్ద వంద ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన కృష్ణా యూనివర్సిటీ నిర్మాణ పనులు చురుకుగా సాగించే బాధ్యతలను ఆ వర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ సుంకరి రామకృష్ణారావుకు అప్పగించారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంపు

- రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల గౌరవ వేతనాలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కార్యకర్తలకు నెలకు రూ.4,200 నుంచి రూ.7వేల వరకు, సహాయకులకు నెలకు రూ.2,950 నుంచి రూ.4,500ల వరకు పెంచారు. దీంతో రాష్ట్రంలో 1,04,377 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు లబ్ధిపొందనున్నారు. ఈ వేతనాలు పెంచడంవల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఏటా రూ.308.85 కోట్ల మేరకు అదనంగా భారం పడనున్నది. ఈ మొత్తం భారంలో కేంద్రప్రభుత్వం రూ.74.12 కోట్లు భరిస్తుండగా, రాష్ట్రప్రభుత్వం రూ.234.73 కోట్లు భరిస్తుంది.

గుంటూరులో వ్యర్థాలతో విద్యుత్ కేంద్రం

- ఘనవ్యర్థాల నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) కింద రాష్ట్రంలోని తొలిసారిగా గుంటూరులో చెత్తతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జిందాల్ కంపెనీతో గుంటూరు, విజయవాడ నగరపాలక సంస్థలు ఫిబ్రవరి 6న అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. గుంటూరు, విజయవాడ నగరపాలక సంస్థలతోపాటు తెనాలి, నరసరావుపేట, పొన్నూరు, తాడేపల్లి, చిలకలూరిపేట, మంగళగిరి, సత్తెనపల్లి తదితర అందుబాటులోకి మునిసిపాలిటీలలో వచ్చే చెత్తను ఈ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో వినియోగించనున్నారు.

డిగ్రీలో కొత్తగా ఆనర్స్ కోర్సు

- ప్రతిభావంతులైన విద్యార్థులు తనకు నచ్చిన సబ్జెక్టును లోతుగా అధ్యయనం చేససేందుకు వీలుగా డిగ్రీలో 'ఆనర్స్' కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) రూపొందించిన 'ఛాయిస్ బెస్ట్ క్రెడిట్ సిస్టమ్' విధానంలో భాగంగా విద్యార్థులకు ఈ నూతన అవకాశం కల్పిస్తున్నారు. మూడేళ్ల సాధారణ డిగ్రీతోపాటు ఆనర్స్ కోర్సును కూడ కూడ ఎంపిక చేసుకోవచ్చు. బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సులలో ఈ ఏడాది నుంచి ఆనర్స్‌కోర్సులు కొత్తగా ప్రవేశపెడుతున్నారు. ఆనర్స్ కోర్సు ద్వారా విద్యార్థులు తమకు ఇష్టమైన సబ్జెక్టులో సమగ్రమైన అధ్యయనం చేసేందుకు వీలు కలుగనున్నది.

ఎంసెట్‌కు ఆధార్ తప్పనిసరి

- 'ఎంసెట్-2016'కు సంబంధించి ఇంజినీరింగ్, మెడిసిన్ వ్యవసాయం తదితర విభాగాలలో ప్రవేశాలకోసం నిర్వహించే అర్హత పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు నంబర్లను నమోదు చేసుకోవాలని ఏపీ ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబా స్పష్టీకరించారు. వచ్చే ఏప్రిల్ 29వ తేదీన నిర్వహించనున్న ఎంసెట్ పరీక్షకు అవసరమైన దరఖాస్తును ఒకసారి మాత్రమే ఆన్‌లైన్‌లో ఆమోదిస్తామని సాయిబాబా వెల్లడించారు. దరఖాస్తు ఫీజును ఏపీ ఆన్‌లైన్, టీఎస్ ఆన్‌లైన్, ఐసీఐసీఐ, యాక్సిస్ కోటక్ మహేంద్ర బ్యాంకుల్లో చెల్లించవచ్చన్నారు. అయితే అభ్యర్థులు అపరాధరుసుం లేకుండా వచ్చే మార్చి 21వ తేదీవరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. . హాల్ టిక్కెట్లు ఏప్రిల్ 21 నుంచి 25వరకు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలియజేశారు. ఇతర వివరాలకు '0884-2356255, 2340535' నంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

'దాహార్తి'ని తీర్చేందుకు రూ.85 కోట్లు

- నవ్యాంధ్రలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూ.85 కోట్లు కేటాయించారు. ఈ వేసవిలో ప్రజలు తాగునీటికి ఎలాంటి ఇబ్బందీ పడకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు.

ఖండాంతర కాలాంతర భావసామ్యం

రాబర్ట్ బ్రౌనింగ్ కవిత రాణీ శివశంకర శర్మ కథ

ఆంధ్రప్రదేశ్ ఫిబ్రవరి సంచికలో రాణి శివశంకర శర్మగారి కథ "ప్రొఫెసర్ అంతరంగం" లోని ఒక విశేషం గురించి ప్రస్తావించాలి. శర్మ గారి కథకీ, రాబర్ట్ బ్రౌనింగ్ బహుళ ప్రాచుర్యం చెందిన "మై లాస్ట్ డచెస్" (1842) కవితకీ మధ్య భావసామ్యం గురించి ఈ స్పందన. శర్మ గారు ఆ కవిత చదివారో... లేదో గానీ, రెండు రచన మధ్య సారూప్యం యాదృచ్ఛికం, అద్భుతం అనిపించింది. "ప్రొఫెసర్ అంతరంగం" లోని స్త్రీ చిత్రం, దాని చుట్టూ అలుముకుపోయిన భావాలు అన్నీ "మై లాస్ట్ డచెస్"లో తారాడినవే అనిపిస్తాయి. ఈ కథలో ప్రొఫెసర్ కూడా డ్యూక్ ఆఫ్ ఫెరారా కి తీసిపోకుండా అన్నిటినీ తన అధికారంలో ఉంచుకోవాలని పట్టుదలతో ఉండడం; వస్తుజాలాన్నీ భావజాలాన్నీ కూడా తన ఆధిపత్యంలో పెట్టుకోవాలని వెంపర్లాడటం, ఆ వెంపర్లాట ఒక తీవ్రవాదంగా పరిణమించడం; ఆ తీవ్రవాదమే దార్శనిక తీవ్రవాదంగా మారి ఇమాన్యుయెల్ కాంట్ నే హతం చేసే ఉద్దేశ్యం ప్రకటించడం; ఇవన్నీ బ్రౌనింగ్ పోయెంని గుర్తు తెస్తాయి. వైవిధ్యం ఉన్న కథ.

బ్రౌనింగ్ "మై లాస్ట్ డచెస్" లో రాచరికపు హంగులూ, అధికారపు గర్వాలూ, అహంకారాలూ, అసహనాలూ, సంపదలూ కుటుంబ మర్యాదలుగా చెలామణి అవుతున్న కర్కశ ప్రవృత్తులూ, అన్నీ "ప్రొఫెసర్ అంతరంగం" కథలోనూ కదలాడతాయి.

ఫెరారా అనే ఓ డ్యూక్ సరదాపడి వివాహం చేసుకున్న సౌందర్యవతి ఓ సాధారణ కుటుంబానికి చెందినది. పెళ్లి తర్వాత ఆమెలో ఎన్నో లోపాలు కనిపిస్తాయి అతనికి. నడమంత్రపు సిరి తెచ్చిపెట్టిన 'డచెస్' హోదాను గుర్తించకుండా ఆమె చాలా సహజంగా, అమాయకంగా ఉంటుంది. షికారుకి తీసుకెళ్ళే గుర్రపు సైసుకీ, తన ఉద్యానవనంలోని పూలను కోసి తనకే బహూకరించిన వనమాలికీ, తొమ్మిది వందల సంవత్సరాల రాజవంశపు కీర్తినీ, దర్పాన్నీ తనకు ప్రసాదించిన డ్యూక్‌కి భేదం లేనట్టు అందరికీ ఒకేలాంటి మనోహర మందహాసం బహూకరిస్తుంది. తన చిత్రపటాన్ని రూపు-రంగులు దిద్దిన పాండాల్ఫ్ అనే కళాకారుడి దగ్గర, భర్త వద్ద మాత్రమే ప్రదర్శించే సరదాలు, కళలూ-కవళికలూ, ముద్దరాలి రంగులూ... అన్నీ చూపి ఒక ప్రాణమున్న

> "మై లాస్ట్ డచెస్" లో డ్యూక్ ఫెరారా తల దన్నిన ఉగ్రరూపం మార్కండేయుది. డ్యూక్ ఇంకా ఈ లోకం వాడే. మార్కండేయుది ఊబర్మెంక్ట్ మనస్తత్వం, మహత్వాకాంక్ష.

చిత్రం లాగ దిద్దించుకోవడం- ఇవన్నీ డ్యూక్‌కి క్షమించరాని తప్పులుగా అనిపిస్తాయి. లోలోపలే మథన పడతాడు కాని ఆమెకి చెప్పలేదు. చెప్పడం రాదు. వచ్చినా ఆమె స్థాయికి వంగ లేదు. ఇక భరించలేక ఒక రాజాజ్ఞ జారీ చేస్తాడు. మందహాసాలన్ని ఆగిపోతాయి. ఆమె గోడ మీద ఒక చిత్రపటంగా మిగిలిపోతుంది. ఆ పటంమీది పరదా తను తప్ప ఎవరూ జరుపడానికి వీలులేదు. జీవించి ఉండగా లేని అధికారం ఆమె మరణించిన తరువాత అతనికి దక్కుతుంది. అయినా డ్యూక్‌కి అదికారమే ముఖ్యం. అతనికి వారసత్వంగా వచ్చిన క్రూరత్వం ఎటువంటిదంటే శాసించలేని జీవకోటికంటే శాసించగల కళాకృతులే ఎక్కువ ఇష్టం. అటువంటి "ఆబ్జెక్ట్"లని తన కళాఖండాల కలెక్షన్లో ఎన్నిటిని చేర్చుకున్నా అవి అతని శాసనాన్ని జవదాటవు. భార్య, పట్టపురాణి తనకూ, తన మాటకూ, తన రాచ ఠీవికి అణిగిమణిగి ఉండాలి. తన రాణి అయినందుకు ఆ హోదా బరువుకి లొంగి, వంగి బానిసై ఉండాలి. అప్పుడే తనకు ఒక సార్థకత; వంశ ప్రతిష్ఠ. ఒక భార్య పోతే ఇంకో భార్య వస్తుంది. తన క్రీతం రాణి("మై లాస్ట్ డచెస్") తన అపారమైన కళా సంపదలో ఇంకొక ఆబ్జెక్ట్ గా మిగిలిపోతుంది.

"ప్రొఫెసర్ అంతరంగం" లో మార్కండేయ కూడా ఈ కోవకు చెందినవాడే. ఆతనికి వస్తుగత సత్యాన్ని తన పంచేంద్రియ శక్తుల ద్వారా స్వంతం చేసుకోవాలనే కోరిక బలంగా ఉంటుంది. వస్తుగత సత్యం మన ఇంద్రియ, మేధాశక్తులకు అందవని బల్ల గుద్ది చెప్పిన జర్మనీ దార్శనికుడు ఇమాన్యువల్ కాంట్ ని 'చంపేస్తాను' అని ఉన్మాదంగా పలుకుతాడు. చంపడం అతనికి కొత్త కాదు- అతని భార్యని అతనే చంపేసాడని ఒక సందర్భంలో ఇంటి డ్రైవర్ చెప్తాడు(డ్రైవర్ "మై లాస్ట్ డచెస్" లో ఉన్న కొంతమంది పనివాళ్ళ ప్రతినిధి అనుకోవచ్చు). కానీ మనకి ఇక్కడ కావలసిన సారూప్యం భౌతికాన్ని దాటి అధిభౌతికం (ఆబ్‌స్ట్రాక్ట్) వరకూ వెళుతుంది. అంటే ప్రొఫెసర్ మార్కండేయ అధికార కాంక్ష, ఎటువంటిదంటే ఫిజికల్, మెటాఫిజికల్ స్తరాలలో అన్నీ తన శాసనానికి తల ఒగ్గాలి, తన కంట్రోల్ లోనే ఉండాలి. "మై లాస్ట్ డచెస్" లో డ్యూక్ ఫెరారా తల దన్నిన ఉగ్రరూపం మార్కండేయుది. డ్యూక్ ఇంకా ఈ లోకం వాడే. మార్కండేయుది ఊబర్మెంక్ట్ (జెర్మన్ లో Ubermencht అంటే మామూలు మనిషి కంటే చాల పరిణామం చెందిన కొత్తరకం మహా మనిషి) మనస్తత్వం, మహత్వాకాంక్ష. దాని సాఫల్యం కోసం ఎటువంటి చర్యనైనా, భావాలనైనా సమర్థించుకొస్తాడు. అసలు వస్తువు- భావం అన్న భేదం లేకుండా సకల విశ్వం పైన తన ఏకాధిపత్యాన్ని ప్రకటించుకోవడమే అతని లక్ష్యం. సత్యశోధనలో ఇది రినైజాన్స్-మనిషి తత్వం. నేను కనుగొన లేనిది, అర్థం చేసుకోలేనిది ఏదీ ఉండదు అన్న ప్రగాఢ (అంధ) విశ్వాసం. ఒకలాంటి తీవ్రవాదం. అందుకే నక్సల్ తీవ్రవాదం ప్రసక్తి కూడా వస్తుంది. సాంఘిక జీవనమైనా, బౌద్ధిక జీవనమైనా, మనిషి ఒక విధమైన తీవ్రవాదాన్ని అధిగమించలేడు అని నర్మగర్భితంగా చెప్పడమే శర్మ గారి కథ ఆంతర్యం.

కథలోని మర్మం విశదీకరించడం ఈ వ్యాఖ్య ఉద్దేశ్యం కాదు. నూట డెబ్బయి సంవత్సరాల తరువాత మళ్ళీ అవే భావాలు సమయానుకూలంగా, సమకాలీనంగా ప్రతిబింబించడం కాలాంతర, దేశాంతర భావబంధంగా అనుకోవాలి. ఇంకా చెప్పాలంటే శర్మగారు కథని ఆబ్జెక్ట్ నుంచి ఆబ్‌స్ట్రాక్ట్ దగ్గరకి తీసుకెళ్ళారని భావించాలి. శర్మగారి అభిమానులలో ఒకడినైన నాకు ఆ పరిణీత ప్రయాణాన్ని దర్శించే మంచి అవకాశం దక్కిందని సంతోషిస్తున్నాను.

– గడేపల్లి కామేశ్వర సుబ్బారాయుడు (సుబ్బు)

బుద్ధాస్ బౌల్!





ఏంది ఇచ్చింది? చేతికి చిప్ప! అనే మాట తెలుగునాట ప్రాచుర్యంలో ఉన్న ఊత పదం! తెలుగు ప్రజల జీవనసాగరాలకు వెయ్యిన్నరేండ్లు దీపస్తంభంలా నిలచిన బౌద్ధం ఈ ఊతపదం వేర్లలో ఉంది.

'గృహస్తులు ఆహ్వానిస్తే వారి నుంచి భిక్ష స్వీకరించేందుకు వెళ్తున్నావు. అలాగే నా ఇంటికీ రావచ్చు కదా' అంటాడు బుద్ధునితో శుద్ధోధనుడు. దు:ఖానికి కారణం కనుగొన్నవాడికి తిరస్కరించేందుకు కారణం కన్పించలేదు. సిద్ధార్థునిగా రాజప్రాసాదాన్ని వీడిన ఏడేండ్లకు బుద్ధునిగా మూడు వందల మంది భిక్షువులతో విచ్చేస్తాడు బుద్ధుడు. అందరూ తమ తమ భిక్షాపాత్రల్లోనే ఆహారాన్ని గ్రహిస్తారు. 'తరచూ రావచ్చు కదా' అంటాడు శుద్ధోధనుడు. "సంఘ నియమాలు అందుకు అంగీకరించవు" అంటాడు పూర్వాశ్రమంలోని సిద్ధార్థుడు. 'అడుగో మీ తండ్రి' అంటుంది యశోధర, ఏడేండ్ల రాహులుడుతో. పిల్లవాడి తల నిమురుతాడు బుద్ధుడు. 'నీ బాటలోకి సంతోషంగా వస్తాను. సంఘంలో సభ్యత్వం ఇవ్వ'మంటుంది యశోధర. అప్పటికి స్త్రీలను సంఘంలో చేర్చుకోలేదు. సంఘం నిర్ణయించాలి అంటాడు. యశోధర అభ్యర్థన మేరకు పిల్లవాడు సంఘంలోకి వచ్చివెళ్లేందుకు అంగీకరిస్తాడు బుద్ధుడు. కొన్ని రాకపోకల తర్వాత "నన్నూ ఇక్కడనే ఉండనివ్వండి" అంటాడు రాహులుడు. సరే అంటాడు బుద్ధుడు. భిక్షకు బయలుదేరుతూ బాలునికి ఏమి ఇవ్వగలడు? చేతికి చిప్ప! ఈ విషయం తెలిసి 'ఏ హోదాలో బాలునికి భిక్షాపాత్రను ఇచ్చావు?' అని బుద్ధుని అడుగుతాడు శుద్ధోధనుడు. నిజమే! పెద్దలు అనుమతి లేకుండా బాలురను సంఘంలోకి తీసుకోరాదు అని సంఘనియమాన్ని సవరిస్తాడు.

భిక్షాపాత్ర అంత తేలికైనది కాదు. ఒకరు మరొకరికి ఇచ్చేది కాదు. ఇందుకు ఇటీవల సంఘటనే ఒక ఉదాహరణ! ఆఫ్గనిస్తాన్‌లోని కాబూల్ నేషనల్ మ్యూజియంలో ప్రస్తుతం ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తోన్న వస్తువు పేరు 'బుద్ధాస్ బౌల్' (బుద్ధుని భిక్షాపాత్ర). ఇది స్వయంగా బుద్ధుడు వినియోగించినదే అనే వాదోపవాదాలు జరిగాయి. ఇందుకు చారిత్రక ప్రస్తావనలూ ఉన్నాయి. తాను నిర్వాణం చెందేందుకు కుశీనార వెళుతూ, తనకు ఆహారమే అక్కర్లేదు, భిక్షాపాత్ర ఎందుకు అనుకుంటాడు బుద్ధుడు. తన భిక్షాపాత్రను వైశాలీ నగర ప్రజలకు ఇచ్చివేస్తాడు. కనిష్కుడు ఇప్పటి పెషావర్ అయిన క్రీ.శ.1వ శతాబ్దినాటి పుషాపూర్‌కు బుద్ధాస్‌బౌలును తీసుకువెళ్తాడు. అది కాందహార్, ఇప్పటి కాబూల్ చేరుతుంది. ఆఫ్గనిస్తాన్ అంతర్యుద్ధం నేపథ్యంలో ప్రెసిడెంట్ నజీబుల్లా కాబూల్‌లోని నేషనల్ మ్యూజియంకు బౌల్‌ను అందజేస్తాడు. కాబట్టి : తన పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని వైశాలీనగరానికి చెందిన బుద్ధాస్‌బౌల్‌ను కాబూల్ నుంచి తీసుకురావాలని ఆర్‌జేడీ సభ్యుడు రఘువంశప్రసాద్ సింగ్ లోక్‌సభలో 2013లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసాడు. బహుశ లోక్‌సభ చరిత్రలో సభ్యులు అంత సావధానంగా వ్యవహరించిన ఘటన ఇటీవలి దశాబ్దాలలో లేదు. స్పీకర్ ఆదేశం మేరకు భారత పురావస్తు బృందం కాబూల్ వెళ్లింది. మ్యూజియం ప్రారంభంలోనే స్వాగతించే ఆ బౌల్‌ను ఇచ్చేందుకు ఆఫ్గనిస్తాన్ సిద్ధంగా లేదు. ఇంతకీ ఆ బౌల్ తేలికైనది కాదు. 1.75 మీటర్ల వ్యాసం. 18 సెంటీమీటర్ల మందం. ముప్పావు మీటర్ ఎత్తు. దాదాపు నాలుగు వందల కిలోల బరువు. ఆకుపచ్చ గ్రానైట్ శిలలో రూపొందించిన కళాఖండం అద్భుతమైనదే. కాని, బుద్ధుడు వినియోగించినది కానే కాదు అని తేల్చారు. 5 వ శతాబ్దికి చెందిన, పర్షియన్ భాషలో అరబిక్ లిపిలో బౌద్ధ సూత్రాలను పొదుగుకున్న ఆ భిక్షాపాత్రను సాక్షాత్తూ బుద్ధునిగా భావించి, సమున్నత స్థానంపై ఉంచి, ఆఫ్గన్ భిక్కులు ధ్యానం చేసేవారని చైనా సాహిత్యం వెల్లడిస్తోంది. ఇది బుద్ధుడు వినియోగించినది కాకపోవచ్చు, భిక్కుల విశ్వాసం ప్రకారం సాక్షాత్తూ బుద్ధుడే మా వద్దే ఉంటుంది, అని సగర్వంగా ప్రకటించింది కాబూల్ నేషనల్ మ్యూజియం!

ఇప్పుడు దీపాలదిన్నె దగ్గరకు వద్దాం. అమరావతి మట్టిదిబ్బలోని పొరలను తొలగించుకుని క్రీ.శ 1817 లో బుద్ధుని భిక్షాపాత్రలు రెండు బయటపడ్డాయి. తర్వాత కాలంలో ఒకటి మాయమైంది. లేదా సున్నమైంది. మెకంజీ బృందంలోని హెన్రీహెమిల్‌టన్ భిక్షాపాత్రను డ్రాయింగ్ చేసాడు. మనం చూస్తోన్న ఫోటోలోని బుద్ధాస్ బౌల్ ప్రస్తుతం మెడ్రాస్ మ్యూజియంలో ఉంది. దయనీయంగా ఉంది అంటున్నారు నిపుణులు. ఇది కాబూల్ శిల్పం వలె కఠినమైనది కాదు. ఆకుపచ్చని పల్నాటి సున్నపురాయిలో లలితంగా రూపు పోసుకుంది. మనిషి ఎత్తలేనంత బరువైనదీ కాదు. కానీ కళాత్మకత రీత్యా, భావసంపదరీత్యా సమున్నతమైనది. శిల్పాన్ని చూడండి. విశాలమైన బంగారపు పళ్లెంలో విరాజిల్లుతోన్న బుద్ధుని భిక్షాపాత్రను దేవ–గంధర్వ–కిన్నెర–కింపురుష–నాగ ముఖ్యులు నృత్యగానాలతో ఊరేగింపుగా ప్రజలకు ప్రదర్శిస్తున్నారు. ఆ భిక్షాపాత్ర మననుంచి తీసుకోవడానికి రాలేదు. మనకు ఇచ్చేందుకే వచ్చింది. అందులో ఏముంది? ముందుగా మనం క్లీన్ బౌల్డ్ కావాలి. 'చిప్ప'లో లేనివి 'చిప్ప'లో లభించవచ్చు!

– పున్నా కృష్ణమూర్తి



కొత్తగురుతులు



డా. వి చంద్రశేఖరరావు

సాయంత్రం చాలా మంది మిత్రులం హోటల్లో కలిశాము. సందర్భం, నేను తీసిన టి.వి ఫీచర్ కి జాతీయస్థాయి అవార్డు రావటం. ఒక మినియేచర్ పెయింటింగ్ లా; టైమ్ మిషన్ లోకి వెళ్ళి, పదో, ఇరవయ్యో సంవత్సరాలనాటి కబుర్లను, మనుషుల్ని, సంఘటనల్ని గుర్తు చేసుకుంటూ ఉండగా, "ఇకచాలు, ఎనఫ్ ఈజ్ ఎనఫ్, విడిపోదాం, ఐ నీడ్ డివోర్స్" అని, హిస్టారికల్‌గా అరిచే తన భార్య గురించిన కబుర్లు, ఆనంద్ మొదలు పెట్టాక, మొత్తం సన్నివేశం మారిపోయింది.

సరయు తన పదిహేనేళ్ళ కొడుకు గురించి చెప్తుంది. వాడికదేదో సిండ్రోమ్ అని చెబుతుంది. హఠాత్తుగా తలను గోడకు టప్ టప్ మని కొట్టుకుంటూ, పెద్దగా అరుస్తూ, ఎక్కడనుంచి నేర్చుకున్నాడో తెలియదుగానీ, కర్ణకఠోరమైన బూతులతో వాళ్ళ నాన్నని తిడుతూ ఉంటాడని; సందర్భం మారింది. మధురమైన సంగతులు. నాస్టాల్జియాలు ఏమీలేనట్లుగా; రోదనో, ఆక్రోశమో మాత్రమే మిగిలినట్లుగా.

విస్కీ బాటిళ్ళు, సోడా, నీళ్ళు తెచ్చి టేబుల్ పై పెట్టారు. మళ్ళీ కబుర్ల వర్షం, మాటలు, అరుపులు, ఎగ్జైట్మెంట్; సత్యమూర్తి పొడవాటి చుట్టను వెలిగించాడు. కరుణాకరు తన రియల్ ఎస్టేట్ ఎడ్వెంచర్లు మొదలు పెట్టాడు. పవన్, టి.వి యాంకర్ల భాషను అనుకరిస్తూ జోకులు చెబుతున్నాడు.

రచయిత శివసుందరం గురించి చర్చ మొదలైంది. శివసుందరం ఒక మూల కుర్చీపై, శప్తయోగిలా, గంభీరంగా, దు:ఖంగా, నిర్వేదంగా కూర్చున్నాడు; తెలుగునాట సుప్రసిద్ధుడైన నవలా రచయిత, ఆరు నవలలు, ఏడెనిమిది కథా సంపుటాలు; చరిత్రను తవ్వి, కథలన్నిటికీ ఆధునిక రూపాన్నిచ్చే రచనలు ఆయనవి. సరిగ్గా నెలక్రితం, ఆయన నవలలపై ఒక విమర్శ వచ్చింది. ఆయన రచనలు యాంటి – గాడ్ అని; సంస్కృతికి వ్యతిరేకమని, outrageous అని; మరుసటి వారం వేల సంఖ్యలో కరపత్రాలు వెలిశాయి. ఆయన రచనల్ని నిషేధించాలని ఊరేగింపు; సోషల్ మీడియాలో హేట్ మెయిల్స్; ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యాలు సేకరించబడ్డాయి. హర్తాళ్ళు, బంద్‌ల మధ్య, కులప్రస్తావన వచ్చింది. ఆయన రచనల వలన కులం ఆత్మ గాయపడిందని; ఆయన్ను నిషేధించాలని. శివసుందరం గొంతు విప్పాడు. టైమ్ మిషన్ లోకి వెళ్లి యాభై యేళ్లనాటి సంగతులు గుర్తుచేసుకున్నాడు. అతని తండ్రిని, తండ్రి తండ్రిని; దుర్భరమైన బాల్యాన్ని, ఒక కుల హింసని; మొదటి నవల రాసిన కాలాన్ని; నవల రాసే వేళ తను అనుభవించే సృజనాత్మకమైన వేదనని; ఇటీవల నవల గురించి. ఖాళీ చూపులతో; చాలా సేపు అందరం ఒక సామూహిక నిశ్శబ్దంగా మారిపోయాము.

రూమ్‌లో, ఆయన గొంతే, మెల్లగా, మృదువుగా, దు:ఖాన్ని, వచనంలో రిసైట్ చేస్తున్నట్లుగా!

శివసుందరం, లేచి నిలబడి, సంచిలోంచి తన నవలను బయటకు తీసి, నవలలోని చివరి అధ్యాయాన్ని చదివాడు. చరిత్ర తలుపులు తెరుచుకుని, ఎన్నో పాత్రలు మాముందుకు వచ్చినట్లు; అందరం విస్మయంగా, అనిమేషంగా.

ఆయన నవల చదవటం ఆపివేసి, "ఈ విధ్వంసాన్ని, వేటాడటాన్ని ఇక తట్టుకోలేను. ఏ వైపు నుంచీ

సు నామీ పెను ఉత్పాతం మిగిల్చిన మహావిషాదానికి గుండెలు బద్దలై, ఇటువంటి ప్రాణనష్టం మరిక మున్ముందు జరగకుండా మరింత పటిష్ఠమైన, ఇంకెంతో ఆధునికమైన వైజ్ఞానిక సమాజాల్ని నిర్మించుకోవడమే మన లక్ష్యమని నాగరిక సమాజం యావత్తూ మూకుమ్మడిగా తీర్మానించుకుంటున్నప్పుడు, ఎవరైనా ఏద్దేవ చేస్తూ కిస్సుక్కున నవ్వితే ఎలా ఉంటుంది? ఎంత అసందర్భం? అరడజను కథాసంపుటాలుగా, నాలుగైదు నవలలుగా, ఓ గుప్పెడు సాహితీ వ్యాసాలుగా విస్తరించిన **డా. వి చంద్రశేఖరరావు** పాతికేళ్ల సాహితీ సృజన మొత్తం ఆ అసంగతమైన, అసమయమైన నవ్వులా, ఆ నవ్వంత ఘోరమైన తప్పిదం!

అయితే, సునామీ మహా ప్రళయాన్ని ముందే గ్రహించి, జాగ్రత్త పడి సురక్షితంగా ఉండగలిగిన అండమాన్ ద్వీపాల్లో ఆదిమ జాతుల జ్ఞాన వ్యవస్థల్ని– బతుకులు కాలాక కూడా– గుర్తించలేని అత్యాధునిక శాస్త్రీయ అంధ బధిర అవ్యవస్థకి వెక్కిరింపుగా, ఒక పరిహాసంగా ఆ నవ్వుని అర్థం చేసుకుంటే అది తప్పిదంగా కాదు, దిద్దుబాటుగా అనిపిస్తుంది– చంద్రశేఖరరావు సాహిత్యం కూడా. ఈ రచయిత ఏ వ్యవస్థని చూసి ఎగతాళి చేశాడో, ఆ ఆధునిక... నాగరిక సమాజానికి ఆయన పరాయి కాదు; అందులో అంతర్భాగమైన వాడే. తనని తాను మినహాయించుకోలేని వాడు కావడం వల్లే ఆయన నవ్వు (తన సాహిత్యం మొత్తం) – నిందారోపణలా ఉండదు, నేరంగీకారంలా ఉంటుంది, ఒప్పుకోలులా ఉంటుంది... ముందు మేల్కొన్నవాడి ఉలికిపాటులా ఉంటుంది. ఆత్మశోధనంలా... అంతర్మథనంలా..... అస్తిత్వాన్ని నిలువెల్లా చీలికలుపేలికలు చేసే చింతనలా ఉంటుంది.

చంద్రశేఖరరావు తన సృజనకి తనంతటతానుగా ఎంచుకున్న వస్తువు (కంటెంట్) వల్ల ఆయన అనుభవించిన శిక్ష ఇది. ఇక రూపం (ఫార్మ్) విషయంలో కూడా తన సమకాలీన రచయితలు పొందిన సుఖం ఆయన పొందలేదు. 'కథ' వంటి పడమటి సాహిత్యరూపాన్ని సొంతం చేసుకునే యాతనలో తొలినాళ్ల రచయితలు పడిన శ్రమ నుంచి మినహాయింపు, వారి శ్రమ వల్ల దక్కిన ఫలాల్ని అనుభవించే వెసులుబాటు దక్కిన మలితరం రచయితలలో అయన లేడు. ప్రపంచ సాహిత్యంలో కథకచక్రవర్తులైన ఓ హెన్రీ, చెకోవ్, మపాసా, పో, మామ్, కాఫ్కా లని మథించి, ముందు తరం వారు అందించిన సరంజామా సరిపోలేదు చంద్రశేఖరరావుకి. లాటిన్ అమెరికన్, ఆఫ్రో– అమెరికన్, ఓరియంటల్ రచయితల కొత్త చైతన్యాల సారాన్ని సరికొత్త దేశీయ రూపంగా మలిచిన ఆయన శైలీగత యాతనే తెలుగు అత్యాధునిక కథకుల వరసలో ఆయనని ముందు నిలిపింది. సముద్రంలా సంక్షుభిత జీవితం నిరంతరం కొట్టే చెంపదెబ్బల్ని సహించే సహనాన్ని, నిభాయింపుని ఇచ్చే చంద్రశేఖరరావు కథల కోవలోదే ఈ– కొయ్యగుర్రాలు కథ!

సాయం రావటం లేదు. సాటి రచయితలు, పొలిటికల్ పార్టీలు ఎవరూ నన్ను సమర్థించి మాట్లాడలేదు. నా జీవితంలో ఉగ్రరూతలూగించే సందర్భాలన్నీ ఆగిపోయాయి; కాలాన్ని ఇక్కడ ఆపివేసి; ఇక్కడే నాలోని రచయితకు ఉరి వేస్తున్నాను. శివసుందరం అనే రచయిత మ–రణించాడు;" అంటూ నవలను నేలపై విసిరి, సంచిలోని మిగిలిన నవలలన్నిటినీ నేలపై విసిరి; వాటిపై విస్కీ పోసి, మేము వారించేలోపే, వాటికి నిప్పు పెట్టాడు. హాలంతా ఒక నిశ్శబ్దం. నల్లటి నుసి ఏదో ఇల్లంతా ఎగిసి; ఆ తగలబడటం ముగియనట్లు; అదృశ్యంగా ఇంకా, మా మధ్యన కొనసాగుతున్నట్లుగా–

❖ ❖ ❖

ఏళ్ళ క్రితం ఎప్పుడో కవిగా జీవితం మొదలుపెట్టాను. యూనివర్సిటీ రోజులవి. నోట్‌బుక్‌లో రాసుకున్న కవితలు, చిన్న సమూహాల ముందు భయం భయంగా రిసైట్ చేసేవాణ్ణి. ఆ సమూహంలో లలిత కూడా ఉండేది. సోవియట్ సాహిత్యం మా ప్యాషన్. చెకోవ్, దోస్తోవ్‌స్కీలు నాకిష్టం. లలిత ఎప్పుడూ ఒక గోర్కీ పుస్తకంతో ప్రత్యక్షమయ్యేది. లలితను మేము ఇష్టంగా 'నటాషా' అని పిలుచుకునేవాళ్ళం. లోపలెక్కడో కవిత్వం చిన్న గూడులో కూర్చుని, గువ్వపిట్టలా కిచకిచమనేది. అదెప్పుడూ రెక్కవిప్పి ఎగరనే లేదు. కాలమిస్టుగా, సబ్ ఎడిటర్‌లా, అనువాదకుడిగా రకరకాల అవతారాలెత్తి, కొన్నాళ్ళు యాడ్ ఏజన్సీలో చేరాను. లక్స్ సబ్బులు, పాండ్స్ పౌడర్ల యాడ్‌లను తెలుగులోకి అనువాదం. 'అంత కవిత్వమా, జనానికి అర్థం కావద్దూ' అని విసుక్కునే మేనేజర్. చానాళ్లు, రియల్‌ఎస్టేట్ వాళ్ల బ్రోచర్లు తయారు చేసే పని. డాక్యుమెంటరీలు, చిన్న ఏనిమేషన్ల తరువాత; చిన్న చిన్న యాడ్ ఫిలింలతో మొదలు పెట్టి, బొంబాయి వాడితో కలిసి, యాడ్‌మేకర్‌గా పనిచేశాను. చివరకు ఇలా టీవీల్లో చేరి; గంట గంటకూ టీ, రెండు రోజులకొకసారి పారడైజ్ బిరియానీ, రిలాక్స్‌డ్‌గా పనిచేస్తున్నట్లు ఉంటాము గానీ, ఎవడో పై నుంచి దారాలేవో కట్టి, మా కదలికలన్నీ వాడే నడుపుతున్నట్లుగా– "సర్కస్ లో బఫూన్లం, ప్రొప్రయిటర్ గాడి వేశ్యలం" అంటాడు రమణ కుమార్, న్యూస్ ఎడిటర్.

రిసార్ట్స్ పైన తీసిన ఫీచర్‌కు; వచ్చిన అవార్డుతో హఠాత్తుగా నేనో విలువైన ఉద్యోగినయ్యాను. లంచ్ టైమ్‌లో, ఒక అమ్మాయి, టిపికల్ మెట్రో ఇంటలెక్చువల్ గెటప్‌లో ఆఫీసుకొచ్చింది. ఐలమ్మ హాల్లో తన పెయింటింగ్స్ ఎగ్జిబిషన్ రమ్మని ఆహ్వానించింది. లంచ్ టైమ్‌లో బయటకు వెళ్లడానికి ఇదోసాకు. పాత మారుతీ 800 కారులో బయటపడ్డాను. తోవలో ఒక దృశ్యం. మెంటల్లీ రిటార్డెడ్ పిల్లలు కొంతమంది టాంక్ బండ్ పై కనబడ్డారు. గుంపుగా; వాళ్ల వెనుక అనాసక్తంగా ఉన్న గైడ్. ఒక్కొక్క విగ్రహాన్ని ముట్టుకుని; దానికేమైనా ఫీలింగ్స్ ఉంటాయా అన్నట్లుగా; కూలిపోయిన ఒక విగ్రహం దగ్గర, వాళ్లలో ఒక నలుగురు ఆ విగ్రహాన్ని ఓదార్చుతున్నట్లుగా, విరిగిపోయిన విగ్రహపు తలను నిమురుతూ, చెక్కిళ్లను చేతులతో ముట్టుకుని. కారు ఆపి వాళ్ళ మధ్యన కూర్చుని, ఆ నలుగురు, విరిగిన విగ్రహం, నేను కలిసి ఒక 'సెల్ఫీ' ఫోటోను తీసుకుని; ఆ రోజు నేనా అమ్మాయి పెయింటింగ్ షోకి వెళ్లనే లేదు. ఆ విరిగిన విగ్రహాల మధ్యనే సాయంకాలం దాకా గడిపాను.

అదంతా ఒక మెటాఫర్‌లా, థీమ్‌లా, చిన్న చిన్న శకలాలుగా, అక్కడ ఇక్కడ పడి ఉన్న దృశ్యాలన్నీ ఒకచోట చేర్చి; ఇది నీ ముఖం... ఇది నా దు:ఖం.... ఇది నీ మరణం.... ఇదిగో ఇది ఇట్లా మొదలయింది అంటూ ఎనలైజ్ చేద్దామని, ఉదయాన్నే కూర్చుని, జెన్ బుద్ధిస్టుల మాస్క్ ఒకటి ముఖానికి తగిలించుకొని లలిత ఇచ్చిన కాఫీతో ఇరవై యేళ్లు వెనక్కివెళ్లిపోయి.....

హఠాత్తుగా ఫోన్ మోగింది. ఫోన్‌లోంచి ఒక మరణం పెడేల్మని నన్ను తాకింది; ఫోన్లో రచయిత, నా స్నేహితురాలు, రాగిణి, గొంతు పీలగా ఉంది. వెంకటేశ్వరరావు చనిపోయాడని వణుకుతున్న గొంతులో చెప్పింది. ఒక చాప్టర్ ముగిసిపోయింది.

".... కానీ శేఖరం, ఒట్టి చావైతే ఏడ్చేదాన్ని, మొత్తుకునేదాన్ని, పోయికూడా నన్ను సాధించడం మొదలుపెట్టాడు. ఆయన చనిపోయి గంటలు కాలేదు. ఆయన్ను నేనే చంపానంటూ ప్రచారం మొదలైంది". స్పీకర్ ఫోన్ అది. రాగిణి గొంతు వినబడుతుంది. లలిత నిర్లిప్తంగా వింటుంది. వాళ్లిద్దరి పెళ్లి మేమే చేసింది. పెళ్లి చేసుకోబోయే ఇద్దరూ విడోలే. ఆ పెళ్లి ఇద్దరికీ ఒక అవసరం. రాగిణికి పోషించే మనిషి కావాలి. వెంకటేశ్వరరావుకు ఇంట్లో పడి వుండే మనిషి కావాలి. రాగిణి సన్నటి ఎక్కిళ్ళ మధ్య నుంచి మాట్లాడుతూనే వుంది–

"జీవితమంతా దు:ఖమే. ఇరవైయేళ్ల క్రితం అదృశ్యమైన మనిషి దు:ఖం మిగిల్చాడు.

ఇదిగో, ఈ మనిషి అంతే. భార్యగా ఎప్పుడూ చూడలేదు. నర్సుగానే ఉచ్చలు తుడిసి, ముడ్డి కడిగి. కొడుకు కష్టాల్లో ఉన్నాడని అడిగితే, 'నిన్ను చేసుకున్నాను కాబట్టే నిన్ను పోషిస్తాను, నీ కొడుకు బాధ్యత నేనెందుకు మొయ్యాలి' అంటూ అరిచేవాడు. కడుపునిండా దు:ఖాన్ని పెట్టుకుని బ్రతికాను. ఇదిగో ఇప్పడీ నింద".

ఫోన్ నిండా ఆమె రోదన. క్లిక్ మంటూ ఫోన్ పెట్టేసిన చప్పుడు. లలితవైపు చూశాను. లలిత ముఖంలోని ఫీలింగ్స్ నేను పోలిక పెట్టలేక పోయాను. పశ్చత్తాపమో, విసుగో, మరింకే ఉద్వేగమో; నా ముఖం పైని జెన్‌మాస్క్‌ని విప్పేను. నా కళ్లముందు సరీసృపాలు, ఎలుగుగొడ్లు, అడవిదున్నలు; ఒక అరణ్యం ప్రత్యక్షమైనాయి. "నీ లాయర్ ఫ్రెండ్‌తో ఒక మాట చెప్పించి ఉంచు; పోలీసులతోనూ లాబీయింగ్ చెయ్యవలసి వస్తుందేమో" ఒక ప్రకటన చేసి లలిత బయటకు వెళ్లింది. బయట అవిరామంగా గంటలు మోగుతున్నాయి. రైలు కూత ఒకటి, చెవుల్లో కేకలు పెడుతూవెళుతుంది.

గ్రానైట్ కింగ్ వెంకటేశ్వరరావు ఒక నమూనా. వ్యాపారం తెలిసినవాడు. కోట్లు సంపాదించాడు; కానీ ఈ రోజున రాగిజావ, ఉడకబెట్టిన కూరగాయలు, బార్లీ నీళ్లు, నాలుగేళ్లుగా ఇదే అతని ఆహారం. రీనల్ ప్రాబ్లమ్, వారానికొకసారి డయాలిసిస్ చేయాలి; అదీ అతని పరిస్థితి.

వెంకటేశ్వరరావు ముఖం ఎప్పుడూ రిలాక్స్‌గా ఉండేది. జబ్బు గురించిన భయం లేదు. పుగాకు, పత్తి పొలాల మీదుగా గ్రానైట్ వ్యాపారంలోకి వచ్చాడు. మాజీ కమ్యూనిస్ట్‌గా చెప్పుకుంటాడు. మొదటి పెళ్లి పార్టీ చేసిన పెళ్లి; ఆవిడిప్పుడు లేదు. ఆమె గురించి ఎప్పుడూ మాట్లాడేవాడు కాదు. వెంకటేశ్వరరావుకు పాతికేళ్ల కూతురు, ఆయనతో పోట్లాడి ఇల్లు విడిచివెళ్లింది. బోతిక్ నడుపుతుంది. షార్ట్ ఫిల్మ్‌లు తీస్తుంది. (సహజ ఆమె పేరు). "పుస్తకాలంటే నాకు ప్రాణం" అంటాడు వెంకటేశ్వరరావు. చార్లెస్ డికెన్స్, మార్క్‌ట్వైన్ నా అభిమాన రచయితలంటాడు. రెండవ భార్య రాగిణి గురించి– సంస్కర్త హృదయంతోనే ఆమెను చేసుకున్నానని అంటాడు; రాగిణి, వెంకటేశ్వరరావు జీవిత చరిత్రను 'ఎగిసిన కెరటం' పేరుతో నవలగా రాసింది.

వెంకటేశ్వరరావు కూతురు సహజకి తండ్రంటే ద్వేషం. ఒక అపార్ట్‌మెంట్‌లో ఒక వైపు బోటిక్, ఇంకొక వైపు బ్యూటీ పార్లర్ నడుపుతుంది. ఆ అమ్మాయి చాలా ఫ్రీగా మాట్లాడుతుంది. తన కోరికల గురించి, ఇష్టాల గురించి మాట్లాడేది. తండ్రిని, అతని స్త్రీలను చూసినాక పెళ్లి అనే వ్యవస్థ మీద విరక్తి కలిగిందని చెప్పింది. మంచి జ్ఞాపకాలేమైనా ఉంటే అవి తల్లితోనేనని, ఆమె వెళ్ళిపోయాక అంతా దు:ఖమేనని చెప్పింది. ఒక లివ్–ఇన్–రిలేషన్ గురించి, ఆ రిలేషన్ నుంచి విడిపోయిన సంగతి, ఒక అబార్షన్ గురించి నిర్భయంగా చెప్పేది. చివరిసారి కలిసినప్పుడు ఆ అమ్మాయి చెప్పిన మాటలెందుకో నన్ను కలిచివేశాయి. "తండ్రిని ఒక రోల్ మోడల్ అనుకుంటాము కదా, కుటుంబ ప్రేమ, అందమైన జ్ఞాపకాలు కదా, నాన్న అంతమంది స్త్రీలను ప్రేమించానడం నాకు ఆశ్చర్యం. అమ్మ వెళ్లిపోయాక, ఇల్లంటే అసహ్యం వేసేది. ఇల్లంతా డబ్బు వాసన వేసేది లేదా పిన్ని కన్నీళ్ల వాసన వేసేది. విషపు సూదిమందేదయినా ఇచ్చి ఆ మనిషిని చంపేయకూడదా అనేదాన్ని పిన్నితో. ఆ మనిషి చనిపోయినాకే మళ్లా ఆ ఇంటికొస్తానని చెప్పాను," అనేది.

వెంకటేశ్వరరావు అంతిమ యాత్రనుంచి నేరుగా మరో జర్నలిస్టు మిత్రుడు కల్లూరి రాజ సంస్మరణ సభకు వెళ్ళాల్సి వచ్చింది. "ఒక రోజే ఇన్ని చావు మేళాలా, నేను రాను" అంటూ ఇంటికి వెళ్లిపోయింది లలిత. రాజు ప్రముఖ కవి, జర్నలిస్టు, సామాజిక



కార్యకర్త. తన కవితల్లో, పాటల్లో 'ఫోర్స్ ఆఫ్ రిథమ్' ఉంటుందని చెప్పేవాడు. రాజు నేపథ్యం నాకు సరిగ్గా తెలియదు. బహుశా పల్లెల నుంచి వచ్చి ఉంటాడు. దళిత, గిరిజన నేపథ్యం అతనిది. మొదటిసారి అతని కవితా సంకలనం ఆవిష్కరణ సభలో కలిశాను. భుజంపై చెయ్యివేసి, మనిషిని దగ్గరగా తీసుకున్నట్లుగా ఉంటాయి అతని కవితలు. లాంగ్ పోయిమ్స్‌లా ఉంటాయి అతని కవితలు. అద్భుతమైన పెయింటింగ్స్‌లా ఉంటాయి.

"శివసాగర్ నా స్ఫూర్తి. నా కవిత్వం సముద్రపు హోరు, అడవిలోపలి దావానలం," అనేవాడు చాలాసార్లు. "గురువుగారూ! అట్లా కాఫీ హోటల్ కు వెళ్లి వద్దామా" అంటూ బయటకు తీసుకువెళ్ళేవాడు. అతనితో మాట్లాడుతుంటే, పల్లెల వాసన వేసినట్లుండేది. 'నేనో పురాతనమైన మనిషిని' అనేవాడు. పల్లెల్లో పాడే పాటలు ఆశువుగా పాడేవాడు. 'ఈ సిటీ మృత్యుశాల, మనుషుల్ని బలికోరుతుంది' అనేవాడు. 'మాయమ్మ ఇక్కడే చనిపోయింది. పదేళ్లు మందులు వాడాను. అంతుపట్టని జబ్బు. నా తమ్ముడు ఉద్యోగం కోసం వచ్చి ఈ రోడ్డుపైనే యాక్సిడెంటయిపోయాడు. ఏదో ఒక రోజు నేనూ, నా కుటుంబం కూడా, మాన్–ఈటర్ సార్ ఈ సిటీ,' అనేవాడు. కనబడని దిగులు, భయం అతని మాటల్లో. అతని కవిత్వం మాత్రం ఉగ్రూతలూగించేది. శక్తివంతమైన ప్రతీకలు; పదేళ్లలో నాలుగు సంకలనాలు వేశాడు. ఏడెనిమిది దాకా అవార్డులు వచ్చాయి.

రాజు పరిచయమైన రోజుల్లో, నా సుప్త ప్రపంచంలో అలజడి రేగిన కాలం అది, నా రాత్రులన్నీ కలలు, కలలుగా మరణ వాసన వేసేవి. నిద్ర లేకుండా గడిపిన కాలం అది. సుదీర్ఘమైన కలలు– హింసాత్మకంగా, రంగురంగుల మరణంలా ఉండేవి. ఆ కలల నుంచి మేల్కొన్నాక శక్తులన్నీ ఎవరో పీల్చేసినట్లుగా ఉండేది. చాలా సార్లు నా కలల్లో రాజు వచ్చేవాడు. వందల మంది కత్తులతో అతన్ని వేటాడుతున్నట్లు, అతని శిరస్సు తెగి నా చేతుల్లో పడినట్లు. ఇంటికొకసారి తీసుకెళ్లాడు. 'నా భార్య, నన్ను ఆవహించిన మంత్ర మహిమ, నా దేవత,' అని పరిచయం చేశాడు. సింగిల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్. ఇల్లంతా మినియేచర్ అడవిలా ఉంది. దుప్పి కొమ్ములు, పల్చటి దరువు, మట్టి బొమ్మలు. 'నేను అడవి దేవతల్ని, మంత్ర విద్యల్ని ఆవాహన చేసేవాణ్ణి, ఆత్మలతో మాట్లాడటం తెలిసిన వాణ్ణి, కనికట్టు విద్యలు వచ్చు నాకు,' అనేవాడు. అతని భార్య అమాయకురాలు. పల్లెటూరి దేవతలా ఉండేది. గిరిజన కార్పొరేషన్‌లో చిన్న ఉద్యోగం. ఆమె ఎదురుగా ఉన్నప్పుడు రాజులోని కవి విశ్వరూపం చూపేవాడు. ఉరుములు, మెరుపులు, ఆకాశం చీలిపోవటం, ఎరువు రంగు కలలు, సమాధులు చీల్చుకుని, గతకాలం ముందుకు రావటం, డప్పులు, కొమ్ముబూరలతో ఒక యుద్ధనాదం అతని కవితల్లో కనబడేది.

సరిగ్గా ఏడు రోజుల క్రితం, రాజు, సిటీలో అత్యంత ఎత్తైన భవనం (బంజారాహిల్స్‌లో ఉంది) పైకి ఎక్కి, అక్కడనుంచి, రెండు చేతులు విశాలంగా శిలువపై క్రీస్తులా సాచి గాల్లోకి దూకేశాడు. భార్యకు రెండు వాక్యాల ఉత్తరం రాసి జేబులో పెట్టుకున్నాడు. "క్షమించు, సెలవు" అంటూ.

రాజు సంస్మరణ చాలా పెద్ద ఎత్తున జరిగింది. సిటీలోని ప్రముఖులు (రచయితలు, కవులు, కళాకారులు) వచ్చారు. ఒక్కొక్కరూ, రాజుతో వాళ్ల జ్ఞాపకాల్ని చెబుతున్నారు. అతని పుస్తకాలన్నీ మళ్లీ ప్రచురించాలని, భార్యకు పర్సు ప్రజెంట్ చెయ్యాలని; ఆ అమ్మాయి ఏడ్వడానికి శక్తి లేదన్నట్లు సొమ్మసిల్లిపోయి ఉంది. మీటింగ్ అయిపోయినాక, ఆ అమ్మాయి మా పక్కన కూర్చుని (రేణుకాదేవి ఆమె పేరు)...బలవంతం మీద టీ తాగుతూ– "చాలాసార్లు అనేవాడు చచ్చిపోవాలనుందని, బ్రతికడమంటే హింస అనేవారు. ఇంత పెద్ద సిటీలో మనం అనాథలం, ఎవరికీ అవసరం లేని వాళ్లం అనేవారు. ఎటువైపు నుంచి ఆశలేదు అనేవాడు. ఒకసారి ఒక

పాముపిల్లని గాజు సీసాలో పెట్టుకుని తెచ్చాడు. బయటకు తీసి, చపాతీ కర్రతో పొడిచి, పొడిచి చంపాడు. 'ఇది... వీడు మాబాస్, కులం పేరుతో నన్ను ఎగతాళి చేసిన వాళ్ళు, ఇది మనం బ్రతికే సిటీ; దీన్ని ఇంటి బయట పాతిపెడతాను. రాత్రికి ప్రశాంతంగా నిద్రపోదాము...' అనేవాడు. నాకు భయం వేసేది."

ఆమె చుట్టూ పదిమంది దాకా కూర్చున్నాము. అందరం, ఒక్కొక్క జ్ఞాపకాన్ని చెప్పుకుంటూ, రాజు జీవిత చరిత్రని వింటున్నట్లుగా; "భగవంతుడికి, మనుషుల్ని రక్షించే శక్తులు పోయాయి" అన్నారెవరో. నేను ఉలిక్కిపడ్డాను. "ఇదొక సంక్షుభిత కాలం బ్రతికుండటమే గొప్ప ఎచీవ్ మెంట్"– ఇదివరకెవరో అన్నారు. ఆ సాయంత్రం అందరం కలిసి రాజు ఇంటికి వెళ్ళాము. తలా పదివేలు వేసుకుని ఒక లక్ష రూపాయల కవర్ని టేబుల్ పై పెట్టాము. నేను రాజు ఇంటినుంచి మట్టిబొమ్మను అతని జ్ఞాపకంగా తెచ్చుకున్నాను. సాగిలపడి, ఆకాశం వైపు చేతులు సాచి ప్రార్థిస్తున్న అడవిమనిషి బొమ్మ అది.

❖ ❖ ❖

ఆదివారం సాయంత్రం, అవార్డు ఫంక్షన్ రవీంద్రభారతిలో. అవార్డు ప్రకటించినప్పుడున్న ఉత్సాహం, థ్రిల్ ఇప్పుడు లేవు. మధ్యాహ్నం రెండు గంటలకే ఇంటి నుంచి బయల్దేరా. ప్రత్యేకమైన డిజైనర్ డ్రస్సు, లాల్చీ, కుర్తా, భుజం చుట్టూ శాలువా. వీధులన్నీ చూసుకుంటూ, వాహనాల రొద, మనుషుల మాటలు, ఎత్తైన బిల్డింగ్‌ల నిశ్శబ్దం; కారును ఆపి, పేవ్‌మెంటు పైన నడుచుకుంటూ–

లేత ఎండ, శీతాకాలపు చల్లటిగాలి, నా కాళ్లకింద ఎండిన ఆకుల చప్పుడు, చిరపరిచితమైన ఈ రహదారులు నాతో సంభాషిస్తున్నట్లుగా; హఠాత్తుగా ఒక గాలితెర, నన్ను చుట్టుముట్టి; దృశ్యాలను తొక్కుకుంటూ ముందుకు వెళ్లుతుంటే, మనుషులందరూ వెనక్కు సెపియా రంగు గతంలోకి అదృశ్యం అవుతూ; బేల్ పూరీ, పానీపూరీ, అమ్మే బీహారీ, అక్కడే ఇరవై యేళ్లగా నిలబడి 'బేల్ బేల్' అని అరుస్తున్నట్లుగా;

ఈ వీధుల్లోనే నేను జీవించాను. ఉస్మానియాలో ఎమ్.ఏ, ఈనాడు జర్నలిజం స్కూల్ లో ఒక సంవత్సరం, ఒక పత్రిక నుంచి మరో పత్రికకు జంప్ చేస్తూ; స్ట్రెస్, జీవితం అంటే, మనుషుల మంచితనం అంటే అపనమ్మకం, ప్రతిదాన్నీ సందేహించటం; జీవితమనే భీకరమైన సింహం ముందు సాగిలపడిన రోజులు. ముప్ఫైయేళ్ల క్రితం, చిన్న చిన్న కవితలు జేబులో పెట్టుకుని, వార్తల్లో, వ్యాసాలో రాసిన వాటి పేపర్ కటింగ్స్ వెంటబెట్టుకుని, ఎవరైనా కాస్త మెచ్చుకుంటారేమోనని ఎదురుచూస్తూ–

రవీంద్రభారతి ముందు ఎవరూ నాకోసం ఎదురుచూడడం లేదు. లోపలా ఎవడూ ప్రత్యేకంగా పలకరించలేదు. మధ్యలో ఎప్పుడో, నా పేరు చదివారు. ప్రముఖ ఇంగ్లీషు పత్రిక సంపాదకుడెవరో బహుమతి ఇచ్చారు. రాసుకొచ్చిన రెండు పేజీలను చదివాను. ఆత్మకథలో పేజీలా ఉందది. వాళ్ళు విన్నారో లేదో తెలియదు. సభలోంచి కొన్ని గాఢమైన నిట్టూర్పులు మాత్రం వినబడ్డాయి. సభ ముగిసినట్లే ఉంది. నలుగురైదుగురు కుర్రవాళ్ళు చుట్టూ మూగారు. అభినందనలు, షేక్‌హాండ్‌లు. దూరంగా వాసుదేవరావు. నేను పనిచేసిన తొలి ఎడిటర్, సౌమ్యుడు, తండ్రిలాంటి వాడు. అతనిక్కడ ఉండటము బాగుంది. 'సార్ నమస్తే' అంటూ ఆయన దగ్గరకు వెళ్లాను. ఆయన నా వైపు అపరిచితంగా, గుర్తుపట్టినట్లుగా చూశాడు. నేను తొలిరోజులనాటి జ్ఞాపకాలు గుర్తుచేయబోయాను. ఆయన నావైపు కొత్తగా చూస్తూ 'నాన్నగారు చనిపోయి ఐదేళ్లవుతుంది. నేను వాళ్ళబ్బాయిని. సదాశివని,' అన్నాడు. నేను చనిపోయి ఐదేళ్లవుతుందని వాసుదేవరావుగారు అన్నట్లుగా అనిపించింది. అతని చెప్పేదానిని వినిపించుకోకుండా అక్కడనుంచి నడిచివచ్చాను.

షేవ్‌మెంటుపై బరువుగా నడుస్తున్నాను. మెమెంటో, శాలువా బరువుగా అనిపిస్తున్నాయి. ఆదివారం రాత్రి బ్రహ్మాండమైన వెలుగు, ఎటు చూసినా మానవ సమూహాలు. వాళ్లందరూ నన్ను రాసుకుంటూ, నానుంచే వెళుతున్నట్లుగా; రాత్రి పదకొండు దాటింది. నడుస్తూ ఉండే నా పాదాల కింద గత సంవత్సరాలన్నీ; నిర్జీవమైన శరీరాల్ని తొక్కుకుంటూ వెళ్ళుతున్నట్లు; దగ్గరలో ఉన్న బార్‌కు వెళ్ళాను.

చనిపోయిన నాన్న నా కెదురుగా టేబుల్‌పై కూర్చుని– 'అకాల మరణం నాకెందుకు, నలభై యేదేళ్లేమీ పెద్ద వయసేంకాదు కదా, మరెందుకుకిలా, హాస్పిటల్‌లో చేర్చి, డబ్బులు ఖర్చుపెట్టి ఉంటే నేను బ్రతికే వాణ్ణి కదా,' అని అడుగుతున్నాడు. ఆయన వెనకనే అమ్మ– "ఒట్టి వెధవ్వి, బ్రతకటం చేతకానివాడవి," అంటుంది కోపంగా; ఎప్పుడో లలిత కూడా వచ్చినట్లుంది; లలిత– "మూడు భ్రూణాలు, కడుపులోనే చనిపోయిన మూడు శవాల్ని నాకిచ్చావు" అంటుంది, కోపమో, దు:ఖమో తెలియనట్లుగా–

రెండు, మూడు పెగ్గుల తరువాత కానీ, నా ఎదురుగా కూర్చున్న మనుషులు అదృశ్యం కాలేదు. పన్నెండు దాటింది. బార్ కు ఒకవైపు షట్టర్స్ వేశారు. లోపల పదిమంది కూడా లేరు. ఒక మూలనుంచి, ఒక ఆడ మనిషి, పాటలాంటిదేదో హమ్ చేస్తుంది. ఉర్దూ పాట. ఘజల్ లాంటిది. చాలా దు:ఖంతో పాడుతుంది. అది తాగుబోతు ప్రేలాపనలా ఉందిగానీ, కమ్మటి పాటలాగా కూడా ఉంది. లేచి వెళ్లి, ఆమె టేబుల్ దగ్గర నిలబడి; ఆమె తలపైకెత్తి, ముఖం చుట్టూ ఉన్న ముంగురుల్ని వెనక్కుతోసి 'నాపేరు లలిత, లలితం'టూ షేక్‌హేండ్ కోసం చెయ్యి ముందుకు సాచింది. "లలితా, నువ్వా ఇక్కడా" అంటూ అంతా పరిచితంలా, అపరిచితంలా!

కారు స్టార్ట్ చేసి ఇంటికి బయలుదేరాను. సన్నటి మంచు దుప్పటి కప్పుకున్నాయి రోడ్లు. స్ట్రీట్‌లైటు బ్రహ్మాండమైన వెలుగులే కానీ, ఎవరో భీకరంగా ఏడుస్తున్నట్లుగా ఉంది. షేవ్‌మెంటుపై నడుస్తూ వెళు తూ ఒక ఆడమనిషి, కాదు, లలిత, కాదు ఒక భ్రమ.

ముప్ఫైయేళ్ల సాహచర్యం. యాభై యేళ్ళు దాటాయి లలితకు, లోపలి ఫైర్ ఆగిపోయింది. దేన్నీ పట్టించుకోదు. మూడు అబార్షన్ల తర్వాత ఒక ఆడపిల్ల. మెదడు సరిగా పెరగని పిల్ల. ఇంట్లో ఉన్నంత సేపూ దానితోనే గడుపుతుంది. అది నిద్రపోయాక, దాని పక్కన పడుకుని, నిద్రపోకుండా అట్లా కళ్ళు తెరుచుకుని చూస్తుంది. "నిద్ర పోవాలంటే భయం, నిద్రపోతే కలలు వస్తాయి. ఆ కలల్లో పిల్ల చచ్చిపోతుంది. నువ్వు చచ్చిపోతావు, అందుకే నిద్రపోకుండా ఇలా మేలుకున్నా" అంటుంది.


కారు వెళుతూనే ఉంది. నా వయసు ఇప్పుడు యాభై ఆరు. అవసరాన్ని మించి ఎక్కువ కాలం, జీవించాననిపిస్తుంది. వెనక్కి తిరిగి చూసుకునే ఆ కాసిన్ని జ్ఞాపకాలు తప్ప, ముందు ముందు మరింకే అద్భుతాలు జరగవనిపిస్తుంది. మెమరీలాస్ వచ్చింది. బహుశా ఆ కాసిని జ్ఞాపకాలూ అదృశ్యం అయిపోతాయేమో!

కారు ముందుకు వెళుతూనే ఉంది. తార్నాక రోడ్ నెం. 8 దాటాను. ఒక మనిషి రోడ్డు దాటుతున్నాడు. తాగి ఉన్నాడేమో, తూలుతూ నడుస్తున్నాడు. హఠాత్తుగా రోడ్డు మధ్యలో ఆగిపోయాడు. వేగంగా వస్తున్న కారును స్లో చేసి, అతని పక్కనుంచి వెళు తుండగా, అతను అటువైపు కదిలాడు. కారు బ్రేక్ వేశాను కానీ అతను తూలి కారు బోనెట్‌ను తగిలి, రోడ్‌పై పడ్డాడు. సన్నటి మూలుగు. దగ్గరకు వెళ్లి, పైకి లేపాను. నుదుటిపై రక్తం, ఇప్పుడే తగిలిన దెబ్బనుంచి; కర్చీపును ఆ రక్తానికి అడ్డుపెట్టి అతన్ని రోడ్డు పక్కకు, ఎదురుగా ఉన్న షెల్టరు దగ్గరకు తీసుకెళ్లి అతని వైపు దీక్షగా చూశాను, మాసిన గడ్డం, దువ్వని తల, చిరిగిన చొక్కా, అతని దగ్గర ఘాటైన నాటుసారా వాసన. బహుశా ఆ చుట్టుప్రక్కల కాలనీలోని మనిషయి ఉంటాడు. పర్సులోంచి కొంత డబ్బు తీసి, అతని చేతిలో పెట్టి ఏదైనా ఆస్పత్రిలో చూయించుకోమన్నాను. అతను, తన చేతిలోని డబ్బువైపు చాలాసేపు చూసి, ఆ తరువాత నావైపు చూసి, చాలాసేపు నావైపు చూసినాక, హఠాత్తుగా, 'హరామ్ జాదే' అంటూ నా గొంతు పట్టుకొని.... అతని చెయ్యి నా గొంతుపై నుంచి కిందకు జారి, నా చొక్కా పర్రున చిరిగి... అతను ఖాండ్రించి 'థూ' అంటూ నా ముఖంపై ఉమ్మి, అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

– డా. వి చంద్రశేఖరరావు

దిండి

కోనసీమ సిగపువ్వు



అల్లంత దూరాన వంగిన అనంతాకాశం .... సముద్ర సంగమానికి సమాయత్తమైన అఖండ గోదారి– వెన్నెలకి కూడా ఆకుపచ్చ కాంతులు అద్దే కోనసీమలో ఒక నీటిరంగుల చిత్రం వంటి ఊరు! తెరచాప ఎత్తిన పడవలా గోదారి దోసిలో తేలుతున్నట్టుండే ఊరు. అడివి చెట్లని జడలో తురుముకున్న ఊరు. ఏటవాలు నదీతీరం... గొడుగు పట్టిన కొబ్బరి తోటలు... లొడలొడ బాతుల సందడి సంగీతం– మొత్తం కలిపి నిసర్గ రమణీయ పకృతి నెలవైన ఊరు: దిండి. తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి నది సముద్రంలో సంగమించే ప్రాంతానికి అతి సమీపంలో ఉంది దిండి!

నర్సాపూర్‌లో ట్రయిన్ దిగి బస్సులో చించినాడ గ్రామం దగ్గర కట్టిన బ్రిడ్జి మీదకి రాగానే గోదారమ్మ దర్శనమై వయసులు మరిచిన కేరింతలం అవుతాం. సూర్యోదయ వేళ పసిడి రంగు కిరణాలు సోకి మిల మిల మెరిసే గోదారి మీద రంగుల కలువ పూలని దాటుకుంటూ కొత్త బంగారు లోకాలకి పడవ ప్రయాణం! ఈ అనిర్వచనీయమైన అనుభవమే ఏడాది పొడవునా దిండికి పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది.

కాకినాడ పట్టణానికి 73 కి.మీ., రాజమండ్రికి 80 కి.మీ. దూరంలో ప్రశాంతతకు మారుపేరుగా దిండి గ్రామం గుర్తింపు తెచ్చుకుంది. దిండిని సందర్శించే యాత్రికులు స్థానికులు అందించే ఆతిథ్యానికి ముగ్ధులవుతూ తరచూ ఇక్కడకు రావడానికి తహతహలాడుతారు.

నిర్మలమైన సముద్రపు బ్యాక్‌వాటర్‌తో విలసిల్లుతూ దిండి ప్రాంతం పర్యాటకులను ఆకర్షించడంలో ముందుంది. అరచేతి వేళ్ళులాగా స్వచ్ఛమైన నీటి కాలువలు, పిల్ల కాలువలు, కయ్యలతో, నడియాడే ఇళ్ళలాంటి పడవలలో విహరించడానికి ఆస్కారం ఏర్పడి సంతోషాలకు నెలవుగా మారింది. వేలాది కొబ్బరి చెట్ల మధ్య సహజసిద్ధమైన అందాలతో దిండి ప్రాంతం సందర్శన విస్మయ పరుస్తోంది.

దిండీ ప్రాంతంలో అడుగు పెట్టిన పర్యాటకుల చేతుల్లోని కెమెరాకు పని కల్పించి ఇక్కడ అనుభవించిన మధురానుభూతులను నిక్షిప్తం చేసుకోకమానరు. ప్రకృతి శోభకి తోడు ప్రశాంత వాతావరణం, స్వచ్ఛమైన గాలి కోరుకునే ప్రకృతి ప్రేమికులకు దిండి స్వర్గధామమనే చెప్పాలి.

వారాంతాల్లో విహారానికి దిండి కీలక పర్యాటక ప్రాంతంగా ఉంటుంది. విడిది చేయడానికి ఆధునిక సౌకర్యాలతో రిసార్ట్స్ అందుబాటులో ఉండటం వంటి అంశాలతో దిండి ప్రాంతంలో ఉన్నంతకాలం జీవితంలో మరపురాని రోజులుగా మిగిలిపోతాయి.

సదుపాయం

- గోదావరి నదీ తీరాన, అందమైన పరిసరాలు కనువిందు చేసే రీతిలో సౌకర్యవంతమైన విడిదికి ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన హరిత కోకోనట్ కౌంటి డీలక్స్ రిసార్ట్స్ పర్యాటకులకు అందుబాటులో ఉంది.
- పరిసరప్రాంతమంతా చూడచక్కని పచ్చటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజాకర్షణ కలిగిన లక్సరీ సౌకర్యాలతో ఈ రిసార్ట్స్ యాత్రికుల మనసు దోస్తున్నాయి. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ
- అతిధులు సేద తీరడానికి స్విమింగ్ పూల్స్ అందుబాటులో ఉంటాయి. యాత్రికుల అవసరార్థం ఇక్కడి రిసార్ట్స్‌లో నాన్–ఏసీ, ఏసీ గదులు ఉన్నాయి. ప్రతి వాటికి పరిసరాలను తిలకించే విధంగా బాల్కనీలున్నాయి.

ప్రత్యేక ఆకర్షణలు

దిండి, దాని పరిసర ప్రాంతంలో లెక్కలేనన్ని ఆకర్షణలున్నాయి. ముఖ్యంగా హౌస్ బోట్లలో విహారం చెప్పుకోదగింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నివాసయోగ్యంగా అమర్చిన గృహోపకరణాలు, పూర్తిగా కండీష న్‌లో అద్దెకు లభించే క్రూయిజ్ ల్లో విహారం మరిచిపోలేని అనుభూతి. దిండి విహారం అనేక ప్రకృతి సిద్ధమైన అద్భుత అందాల సమాహారంగా ముగుస్తుంది. పశ్చిమాన ప్రశాంత వాతావరణంలో సూర్యాస్తమయం చూపరులకు, ఇక్కడ ఉన్నంత కాలం చల్లని రాత్రుళ్ళు మధురానుభూతినిస్తుంది.

ఏపీటీడీసీ వారి హరిత కోకోనట్ కంట్రీ రిసార్ట్స్‌కు కొత్త పడవ దిండికి తాజా ఆకర్షణ. కేరళలోని సముద్ర షిప్పింగు యార్డు కంపెనీ ఆధ్వర్యంలో సుమారు రూ.కోటి వ్యయంతో అన్ని హంగులతో నిర్మించిన దీనిని ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా గత సెప్టెంబర్ 27న 'గౌతమి' పేరుతో ప్రారంభించారు. ఈ హౌసె బోటులో ఏసీ, కిచెన్, హాల్ తదితర అన్ని సౌకర్యాలు ఉన్నాయి. . దిండి రిసార్ట్స్ లో పర్యాటకుల కోసం సిద్ధంగా ఉండే ఈ పడవకు 24 గంటల ప్యాకేజీగా రూ. 19 వేలు నిర్ణయించారు.


దిండికి మార్గం ఇలా...

తూర్పు గోదావరి జిల్లాలోని మలికిపురం మండలంలో దిండి గ్రామం ఉంది. హైదరాబాద్ కు 371 కి.మీ., విజయవాడకు 160 కి.మీ. దూరంలో వయా భీమవరం, పాలకొల్లు, చించినాడ బ్రిడ్జ్ మీదుగా దిండికి చేరుకోవచ్చు.దిండికి సమీపంలో పాలకొల్లు, నర్సపూర్ రైల్వే స్టేషన్లు ఉన్నాయి. రాజమండ్రి రైల్వే స్టేషన్ దిండికి 90 కి.మీ. దూరంలో ఉంది. అనేక ప్రాంతాల నుంచి దిండికి ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ బస్సులను నడుపుతోంది.

ఆకాశఛత్రం!



మన మనసు పక్షి లాంటిదే కదా పిల్లలూ! రెక్కలు లేకుండానే ఎక్కడెక్కడికో ఎగిరిపోతుంది. మనసుతో పాటు శరీరాన్ని కూడా గాలిపటం చేసి ఎగరేయాలని, ఎత్తైన కొండల మీద నుంచి లోతైన లోయల్లోకి పక్షి ఈకలా నింపాదిగా దిగాలనీ కూడా కలలు కన్నాడు మనిషి. ఎగరాలన్న కోరిక ఫలితంగా విమానం వస్తే, దూకాలన్న ఆసక్తి లేదా సురక్షితంగా బైటబడాలన్న ఆకాంక్షకి ఫలితమే పారాచూట్. గొడుగులా ఉండే ఈ పారాచూట్ ద్వారా ఎత్తైన ప్రదేశాల నుంచి, విమానాల్నుంచి సురక్షితంగా నేలకు చేరుకోవచ్చు. 15వ శతాబ్దపు అద్భుతం- ఇటలీకి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, పెయింటర్, శిల్పి, రచయిత- లియోనార్డో డావిన్సీ ఈ పారాచూట్ సృష్టికర్త.   అయితే కొన్ని ఆధారాల ప్రకారం క్రీ.శ. 1100 లలో చైనా దేశంలో పారాచూట్ వినియోగం గురించి ఉందన్న వాదన ఉంది. మొదట్లో సిల్కుతో తయారు చేయబడిన గుడ్డను వాడినా, ప్రస్తుతం నైలాన్‌ను వాడుతున్నారు. నేలకు సమాంతరంగా వెళ్లే వాహనాలకు ఋణ త్వరణం కల్గించి వాటి వేగాన్ని తగ్గించడానికి, లేదా వాహనాలకు స్థిరత్వం అందించడానికి డ్రోగ్ పారాచూట్లు వాడుతున్నారు. స్పేస్ షటిల్ భూమిపైకి దిగినపుడు దాని వేగాన్ని క్రమంగా తగ్గించడానికి కూడా పారాచూట్లను వాడుతున్నారు.




దారి కనుక్కోండి

చిన్నారి 'చిత్రం'



ఐశ్వర్య
4వ తరగతి

చిన్నారుల పెయింటింగ్స్‌ను apchiefeditor@gmail.comకు ఈ మెయిల్ చేస్తే ప్రచురిస్తాం.



చుక్కలు కలపండి



రంగులు వేయండి



మానసిక అవసరాలు ఏవేవి?



అందంగా, హుందాగా కనిపించడానికి, వివిధ ప్రత్యేక సందర్భాలలో ధరించడానికి అనుగుణంగా, మహిళలు వివిధ రకాల దుస్తులు, చీరలు కొనుగోలు చేస్తుంటారు. సాధారణంగా ఇవి ఇరవై నుండి వంద వరకు వుండడాన్ని సహజంగా పరిగణించవచ్చు. ఇందుకు భిన్నంగా ఎవరైనా వందలాది లేదా వేలాది దుస్తులు, చీరలు కొనుగోలు చేస్తుంటే వారినెలా అర్థంచేసుకోవాలి? వాటన్నింటినీ ధరించే అవసరం, అవకాశం ఎవరికీ వుండదు. మరి ఇలా కొందరు వందల సంఖ్యలో ఎందుకు కొనుగోలు చేస్తారు? ఎందుకు భద్రపరచుకొంటారు? అలా కొనుగోలు చేసేవారి ఆలోచనా ధోరణిలో ఒక విపరీత పరిణామం చోటు చేసుకొన్నదని గుర్తించాలి. దుస్తులు మనం ధరించడానికి అవసరమైనవిగా, ఒక భౌతిక అవసరంగా అందరూ గుర్తించతారు. కాని కొద్ది మందికి అవి ఒక మానసిక అవసరంగా రూపొందుతాయి. తాము ధరించడానికి, ఆకర్షణీయంగా కనిపించడానికి కాక, తమ మానసిక తృప్తి కోసం, సంతోషం కోసం, ఒక భద్రతా భావం కోసం వారు తమ దుస్తుల్ని కొనుగోలు చేయడం ప్రారంభిస్తారు. ఆ క్షణం నుండి వారు దుస్తుల్ని ధరించేవిగా కాకుండా, తమకు మానసిక ప్రశాంతత, ఉల్లాసం, సంతృప్తి కలిగించే వాటిగా పరిగణించడం ప్రారంభిస్తారు. ఈ బలహీనతే తమలో బలంగా చోటు చేసుకున్నదన్న అంశాన్ని వారు గుర్తించరు. అంగీకరించరు. పైగా తమను తాము సమర్థించుకోవడానికి రకరకాల వాదనలు, తర్కాలు ముందు పెడుతుంటారు.

జీవితంలో ఎవరైనా తమ కనీస అవసరాలు తీర్చుకోవడానికి అవసరమైన సంపాదన తమకు వుండి తీరాలని కోరుకుంటారు. భవిష్యత్ అవసరాలకు సరిపడా పొదుపు చేసుకోవాలనుకొంటారు. ఎటువంటి అనవసరపు ఖర్చులకు, విలాసాలకు పోకుండా తమ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకొంటుంటారు. ఇదంత అత్యంత సహజం. డబ్బనేది తమ ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకోసమేనని, అలాగే తమ పిల్లలు జీవితంలో స్థిరపడే వరకూ ఉపకరించేదేనని గుర్తించిన వారి ఆలోచనా ధోరణి ఆరోగ్యవంతమైనదిగా గుర్తించాలి. ఇందుకు భిన్నంగా తమ సుఖసంతోషాలకు, తమ అవసరాలకు వినియోగించకుండా, కనీస స్థాయి జీవనాన్ని గడుపుతూ, నిరంతరం తాము కూడబెడుతున్న డబ్బును గురించి ఆలోచించుకొంటూ ప్రశాంతత, ఆత్మ సంతృప్తి పొందుతున్న వారి ఆలోచనలు విపరీతమైన రీతిలో సాగుతున్నయని గుర్తించవచ్చు. తమ జీవితాన్ని సుసంపన్నం చేసే సాధనంగా డబ్బును పరిగణించడానికి స్వస్తి చెప్పి, తమ ఆలోచనలను సంపన్నం చేసుకోవడానికి మాత్రమే డబ్బు పాత్రను పరిమితం చేస్తారు. ఇటువంటి వారు సమాజంలో అన్ని చోట్లా దర్శనమిస్తుంటారు. తమ భౌతిక అవసరాలను విస్తరించుకోవడానికి, జీవితంలో మరింతగా ఎదగడానికి తమ సంపదను వినియోగించుకోకుండా, తమకు ఆత్మసంతృప్తి కలిగించే ఒక సాధనంగా తమ సంపదను పరిగణిస్తూ జాగ్రత్తగా దాచిపెట్టడానికే దానిని పరిమితం చేసిన వారు, కోట్లాది రూపాయిల సంపద వున్నా పేదవారిగా మిగిలిపోతారు. సరైన రీతిలో ఆ సంపదను వినియోగంలోకి తేలేకపోవడం వలన తాము కష్టపడి కూడబెట్టిన డబ్బును శక్తిహీనం చేస్తుంటారు. తాము కూడబెట్టిన డబ్బును చూసి నిరంతరం సంతోషం, సంతృప్తి పొందేవారు అచిరకాలంలోనే మరో వైపరీత్యంలో చిక్కుకుంటారు. ఇంత వరకూ తమ కనీస అవసరాల కోసం తమ డబ్బును ఖర్చు చేసేవారు క్రమంగా తమ అవసరాలను తగ్గించుకోవడం ప్రారంభిస్తారు. ఫలితంగా పీనాసితనం వారి మెడకు చుట్టుకోవడం మొదలవుతుంది. కోట్లాది రూపాయిలు కూడబెట్టిన వారు చివరకు పీనాసులుగా మిగిలిన ఉదాహరణలు కోకొల్లలు.

డబ్బు కూడబెట్టే మార్గాలను, తమ మానసిక బలహీనతలు ప్రేరేపించే పనులను చాలా మంది కలగాపులగం చేసి గందరగోళంలో పడుతుంటారు. ఒకతను షేర్ల వ్యాపారం చేస్తుంటాడు. తాను చేసేది సంపదను కూడబెట్టే మార్గమని అతను నమ్ముతుంటాడు. తన అవసరాలు పోగా మిగిలిన అధిక సంపాదనను పరిశ్రమలలో, వాణిజ్యంలో పెట్టుబడిగా పెట్టి, దీర్ఘకాల ప్రయోజనాల కోసం వేచి చూడడం షేర్ల వ్యాపారంలో కీలక సూత్రం. ఈ ప్రధాన అంశాన్ని గమనించకుండా, దీన్నొక్క జూదంలా పరిగణించి దానిలో తీవ్రంగా నష్టపోయిన వారిని గమనిస్తే, అతి తక్కువ కాలంలో అధిక సంపాదన అన్నది వారి మానసిక అవసరంగా తయారయ్యిందని, ఈ వైపరీత్యమే వారి నష్టాలకు కారణమయ్యిందని గుర్తించవచ్చు.

రకరకాల వ్యాపారాలు చేసి తీవ్రంగా నష్టపోయిన వారు మనకు అన్ని చోట్లా కనిపిస్తుంటారు. అసలు వ్యాపారం చేసేదే లాభార్జన కోసం, అయినప్పుడు దీనిలో నష్టపోవడం ఎలా సాధ్యం అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. తాము వ్యాపారాన్ని చేపట్టినప్పుడు, ఆ వ్యాపార సూత్రాలను సవ్యంగా సక్రమంగా అవగతం చేసుకొని, ఎదుర్కొబోయే ఇబ్బందులను సరిగ్గా అంచనా వేసి, వాటిని ఎదుర్కొవడానికి ముందుగానే సన్నద్ధం అయిన వారికి నష్టాలు ఎదురుకావు. అందుకు భిన్నంగా వ్యాపారం చేయడం, అందులో లాభాలు ఆర్జించడం ఒక మానసిక అవసరంగా రూపొందిన తరువాత, ఇందుకు భిన్నంగా వుండే అంశాలను గుర్తించడానికి, ఆయా సమస్యలను అధిగమించడానికి చాలా మంది ప్రయత్నించరు. ఫలితంగా చిన్న సమస్యే పెనుభూతంగా పరిణమిస్తుంది.

భౌతిక అవసరాలను సవ్యంగా అవగతం చేసుకొని వాటిని తీర్చుకోవడానికి తమ శక్తి సామర్థ్యాలను వినియోగించుకొంటే ఎవరి జీవితమైనా ఉన్నతంగా భాసిల్లుతుంది. అందుకు భిన్నంగా తమ రకరకాల బలహీనతలు మానసిక అవసరాలుగా రూపాంతరం చెంది అవి మన ప్రవర్తనను శాసించుతుంటే ఫలితాలు ఎలా వుంటాయో టాల్ స్టాయ్ తన 'ఏడడుగుల నేల'అనే కథలో అద్భుతంగా చెప్పాడు. సాయింత్రంలోగా చుట్టివచ్చిన నేలంతా నీకు స్వంతమవుతుందని ఒక రాజు చెప్పగానే ఆశగా తన శక్తిని మించి, ఎక్కువ పొలాన్ని చుట్టిరావాలని ప్రయత్నించి, చివరకు గమ్యం చేరుకున్నా తీవ్ర అలసటతో చనిపోయిన ఒక సామాన్యుడిని చూసి ఆ రాజు "చివరకు ఇతనికి కావల్సింది ఏడడుగుల నేల" అని వ్యాఖ్యానించడంతో ఆ కథ ముగుస్తుంది. వందలాది, వేలాది ఎకరాలు ఆ రైతు భౌతిక అవసరం కాదు. కేవలం మానసిక అవసరం మాత్రమే!

– సి నరసింహారావు
మనోవైజ్ఞానిక విశ్లేషకులు

అటక



నానమ్మ ఒడ్డోలగం,
తరతరాల సంస్థానం,
అటక వంటింటి నిధానం.

కలసి ఉన్న కుటుంబాల కలివిడికి
దోహదం
అటక అందుబాటు
హడావుడికి ఆరంభం.

నాన్నమ్మ
ఆయాస ప్రయాసలతో
నిబ్బరమై
అటక కిందకు దిగేది.

ఇత్తడి చెంబులు
కంచు గ్లాసులు, ఇనుప మూకుళ్ళు,
దళసరి గిన్నెలు,
స్టీలు బిందెలు....
పెద్ద గుండిగలు
వేడి వేడి వడ్డింపులకిక
ఆవిరులు చిమ్మేవి
భోజనాల బంతుల
కడుపులు త్రేన్చేవి.

కళాయి ధగ ధగలు అక్షయ పాత్రలు,
పొరుగిళ్ళకు బదులు వెళ్ళి
ఇంటి ఇల్లాలి తిరుగులేని తనానికి
తాఖీదులిచ్చేవి.

కాలం మార్పుల ఆషాడం గాలి
మబ్బులో
నాన్నమ్మ మంచం
దక్షిణం తలుపు మూల గదికి
చేరింది.

ఉరుముల తోడి మెరుపుల దాడికి
ముక్కలుగా విడిన గగన మధ్యంలో
అటక మోయలేని బరువుతో
కుంగిపోయింది.

స్మృతి చిత్రమై మిగిలిన
నాన్నమ్మ నుదుట పాపిట చీలికలో
పాత సామాను చవుక బేరానికి
కుదిరిపోయింది.

సరి కొత్తగా అమరిన ఆన్ లైన్
ఆహార సదుపాయంతో
అపాత్ర దురితమై
పండుగ సంబరం తేలిపోయింది.

– డా. రాజేశ్వరీ దివాకర్ల

అరవిందం



మెరిసే రెండుకళ్ళ నవ్వు
నల్లపిల్ల ఆమె పొడవైన జడ
నేను నా కళ్ళ మధ్య
నువ్వు నీ తడి నవ్వు
తనువొక పరిమళం
గోరింట పూసిన
గాజుల చేతులు

జల నేత్రం
వానవర్ణం
లేత చినుకుల
నీటి రంగుల కాంతి
పూల వర్ణం తాకుతున్న ఆమె
చేతులు

– మోతుకూరు శ్రీనివాస్



మనసుని దైవంగా మార్చుకోవాలి

జీవుడి మనసు శక్తివంతమైన దేవత. దానిలో పుట్టే ప్రతి ఆలోచనా దేవతే. ఆలోచనలు అనంతం. కనుక దేవతలు, ఆలోచనా రూపంగా అసంఖ్యాకం. జీవుడు తన మనసును లొంగదీసుకోగలిగితే, దేవతలను జయించినట్లే. దేవతలను శాసించగలిగినవాడు, నిలువరించగలిగినవాడు, సిద్ధ, శుద్ధ మనస్వియై దివ్యమనస్కుడై ఉంటాడు. కనుక మనసు దైవమేనంటుంది. బృహదారణ్యకోపనిషత్.

ఈ పని సాధించుకోని మనసు దయ్యమే! అంటే దయలేనిదన్నమాట. ఆలోచనను యధాతథంగా అనుభవించటం వలన, పరిణామము, సంస్కారము ఎరుగని ఆలోచనలన్నీ విపరీత మనసుగా రూపొంది, దయారహితంగా ఆవిష్కృతమౌతుంది. అది చేసే, చేయించే పనులన్నీ అర్థరహితంగా, వ్యధాభరితంగా వుంటయ్.

ఏడుస్తూ అనుభవించేవాడు, నవ్వుతూ అనుభవించేవాడి దగ్గరకు సలహా కోసం వస్తాడు. అంటే అనుభవించటంలో తేడా వున్నదే కానీ, అనుభవించటం ఇద్దరికీ వుందని స్పష్టం చేస్తూ, ఇద్దరి మనఃస్థితులను తెరిచి చూపిస్తుంది. ఇద్దరికీ మనసుంది. కాకపోతే ఒకరు ఎరిగీ, మరొకరు ఎరుగకా అనుభవిస్తున్నారు. ఎరిగిన వాడు ఎదురొడ్డటం లేదు. ఎదిరించటం లేదు. ఆదమరచటం లేదు. అప్రమత్తంగా వున్నాడు. దైవీమయమైన మనసుతో అనుభవిస్తూనే, అనుభవాన్ని సాక్షిగా చూస్తున్నాడు. మనసుపరంగా దివ్యత్వాన్ని, అనుభవపరంగా నిరామయంగా, సాక్షీభూతంగా నిలవటంతో నిర్వికారంగా వుండగలుగుతున్నాడు. కనుక ఆ స్థితిలో ఆనందమూ లేదు, ఆవేదనా లేదు.

ఎరగని వాడు సమస్త అవస్థలకు లోనై, దేనినీ పూర్తిగా అనుభవించలేని స్థాయిలో సంచరిస్తాడు. వైపరీత్యం, ఉద్వేగం, బాధ, భయం, దుఃఖం, పట్టరాని ఆనందం, గట్టు తెలియని మమకారం, అణచుకోలేని అహంకారం, అంతమెరుగని అసూయ, అస్పష్టత, అనాచారం వంటి ప్రతికూల శక్తులకు లోనై, మనసు దయ్యమై నిరంతర చింతకు గురౌతాడు.

ఎరిగినవాణ్ణి ఎరగని వాడు కలుసుకున్నపుడు మొదటివాడు రెండోవాడికి ఉపశమనం కలిగిస్తాడు. దారి చూపిస్తాడు, క్షణకాలమైనా దుఃఖం నుండీ దూరం చేయగలుగుతాడు.

ఇంతకీ సంకల్పరాహిత్యమంటే ఏమిటి? అంటే "అంతా సంకల్పంలోంచే పుడుతున్నపుడు, సృష్టంతా ఆగకుండా జరుగుతున్నపుడు, సంకల్పము - సృష్టి ఎడతెగకుండా సాగుతున్నపుడు, సంకల్పరాహిత్యానికి అవకాశం లేదు. కనుక సృష్టిస్తున్న వాడికి వున్నదంతా సంకల్పసాహిత్యమే. ఎందుకంటే వాడు, వాడి మనసు దైవతం కాబట్టి. అందునా, వాడి సృష్టంతా నిస్వార్థం.

జీవుడి మనసు ఆ స్థాయిది కాదు కనుక, ఆలోచనలన్నీ స్వార్థపరం, స్వగతం కనుక, సాధనాక్రమంలో జీవుడు మనసును నిగ్రహించుకుని, నెమ్మదించుకుని, వేగ ఆవేగాలను తగ్గించుకుని, స్వార్థాన్ని త్రుంచుకుని, ఆలోచనలను పరగతం చేయగలిగితే, సంకల్పరాహిత్యం కలుగుతుంది. అది ఒక సిద్ధి. దానిని అన్ని వేళలా ఆ స్పృహతో నిలబెట్టుకోగలిగితే, సంకల్పరాహిత్యం స్థిరమౌతుంది. ఇదంతా అనుకునే వేదాంతం కాదు. మనసును దాటిన నిర్మల భావనా స్థితి.

పరిమిత మమకారమే మానవత్వం.

మితి ఎరుగని, అమిత మనసే భగవంతుడు.

అంతా తానే అయినపుడు తనకంటే భిన్న వస్తువు మరొకటి లేదన్నపుడు, మనసు దైవమౌతున్నది.

భిన్నత్వంలో చలించే మనసే మానవత్వం.

భిన్నత్వం నుండి ఏకత్వంలోకి జరిగే ప్రయాణమే సాధన.

ఆ ప్రయాణం సజావుగా సాగాలంటే మనసు, దైవీ సంపదను పొందాలి. ధైర్యం, అంతశ్శుద్ధి, తత్త్వజ్ఞానం, దాతృత్వం, నిగ్రహం, త్యాగం, స్వాధ్యాయం, తపస్సు, అహింస, అపరిగ్రహం, సత్యవాక్కు, ధర్మాచరణ, అక్రోధం, ప్రశాంతత, ప్రసన్నత, దయ, అనాసక్తి, మృదుత్వం, నిశ్చలమనసు, తేజస్సు, క్షమ, సహనం, సమభావం, సమన్వయం, కృతజ్ఞత.... వంటి దైవీగుణాలను నియమం చేసుకోవాలి. అపుడు దైవీమయ మనసు, రాహిత్యం వైపు తొంగిచూస్తుంది. ఎందుకంటే, ఎంత సాధన చేసినా, కదంబవనం వరకు వెళ్లగలిగిన స్థితి ఏర్పడ్డా, మనోమృగం తన కదలికలను ఆపదు.

అంతా చూడటంలోనే వున్నది. అనుకోవటంలోనే వున్నది. ఈ రెండూ మనసుతో ముడిపడే వున్నయ్. కాబట్టి మనసుని జాగ్రత్త పెట్టుకోవాలి. మనసు స్థితిని తెలుసుకోకుండా, మనసును దైవంగా మార్చుకోకుండా, దైవం కనబడటం లేదనుకోవటం సరైనదేనా? జరగవలసినదంతా లోపల జరగవలసి వుండీ, బయటే వెదకులాటను ఆపకుండా ఆడుతుంటే, జరిపిస్తున్నవాడు దొరికేనా? మూలంలో మనసును కలిపి వుంచగలిగితే, మూలం తెలిసి, లీల, లయం, మహిమ, అనుగ్రహం ఒక్కటిగా అనిపిస్తయ్ కదా!

- వి.యస్.ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

ఆకులూ అలములూ – 2

ఏ ఆకు అయినా అలమైనా– అది తింటే ప్రాణానికి హాని ఉండదు అన్న సత్యం తెలిస్తే ప్రాణికోటికి బ్రతికేయడం సులువైపోతుంది! అలాంటి మొక్కలు మన అడవుల్లో లెక్కకు మించి ఉన్నాయి. అడవుల్లో తిరిగేవారికీ, దేశ పర్యాటన చేసేవారికీ వీటిపై గట్టి పట్టు దొరుకుతుంది. దండకారణ్యాలలో ఎదురయ్యే అలాంటి మరిన్ని మొక్కలను ఇప్పుడు పరిచయం చేస్తాను.

కుంపన్ వెల్(ఐపోమియా ఎరియొకార్పా): లేత ఆకులు కూర వండుకుంటారు.

లవంగ చిక్కుడు (ఐపోమియా మ్యూరికేటా): లేత కాయల కాడలను కూర వండుకుంటారు.

అక్షింత పూల మొక్క (లాంటానా కామరా వరైటీ అక్యూలియేటా) : పండ్లు తింటారు.

ఊటి చెట్టు (మాబా బక్షిఫోలియా) : పండ్లు తింటారు.

పెను జిట్టు తీగ (మార్స్డెనియా టెనసిస్సిమా) : పూలు కూర వండుకుంటారు.

ఎలుక చెవి ఆకు (మెరిమియా గేంజెటికా) : లేత ఆకు కూర వండుకుంటారు.

చేతరాసి కూర (మొల్లుగో అపోజిటిఫోలియా) : ఆకు కూర వండుకుంటారు.

తొగరు చెట్టు (మోరిండా టొమంటోజా) : పండ్లు తింటారు.

పాపిడి చెట్టు (పావెట్టా ఇండికా): పండ్లు తింటారు.

కొంకిడి పీసు (పైసనియా అక్యూలియేటా): లేత ఆకు కూర వండుకుంటారు.

ఈన కూర/ఛాటీ బాజీ (పోలిగోనం ప్లెబైయం) మొక్కను కూర వండుకుంటారు.

పుల్ల గరుగుడు చెట్టు (ప్రోటియం సెర్రేటం) : పండ్లు తింటారు.

కేసూర్ గడ్డలు(సిర్పస్ కైసూర్): గడ్డలు ఉడకబెట్టి/కాల్చుకుని(తంపట పెట్టి) తింటారు.

నేదొండ(నేతి దొండ)/పలక దొండ తీగ (సొలెనా హెటరోఫిల్లా): లేత కాయలు తింటారు.

కొక్కిత తీగ(అర్జిరియా నెర్వోజా): లేత ఆకు కూర వండుకుంటారు.

సాప్ కంద్ (అరిసిమా టార్ట్యుయోజం): దుంప, లేత పువ్వు కాడ కూర వండుకుంటారు.

తెల్ల ఉప్పి (అజిమా టెట్రాకాంథా): పండ్లు తింటారు.

సంబరేని మొక్క(బకోపా మోనియెరి): ఆకులు కొమ్మలతోసహా కూర వండుకుంటారు.

పులి ఆరె(బహినియా మలబారికా): లేత ఆకు, మొగ్గలు కూర వండుకుంటారు.









కవ్వి (సిసూలియా అక్జిలారిస్): ఆకులు కాడతో సహా కూర వండుకుంటారు.

పేము తీగ/సాప్ తివ్వ (కలమస్ రొటాంగ్): లేత ఆకు కాడలను లేత కొమ్మలను ఊరగాయ పెట్టుకుంటారు.

దహియా (కేలికార్పా మేక్రోఫిల్లా): పండ్లు తింటారు.

కరిల్(కపరిస్ డిసిడ్యువా): లేత కాడలను, పూల మొగ్గలను కూర వండుకుంటారు. లేత కాయలను ఊరగాయ పెట్టుకుంటారు.

ఆరె దొండ(కపరిస్ జెలానికా): లేత కాయలను ఊరగాయ పెట్టుకుంటారు.

సనబాల మొక్క(కేసియా అబ్సస్); పచ్చి గింజలను తింటారు.

పుల్ల గుమ్ముడు తీగ/అంబట్ వెల్ (కెరెటియా ఆరిక్యులేటా): లేత ఆకులు, వాటి కాడలు కూర వండుకుంటారు.

గాంగ్రాంగి చెట్టు (ఫ్లెకర్టియా జంగమాస్): పండ్లు తింటారు.

బొరగకూర (సయనోటిస్ క్రిస్టేటా): లేత ఆకులు, కాడల్లాంటి కొమ్మలు కూర వండుకు తింటారు.

జారు మామిడి (అర్డిసియా సొలనేసియా): లేత ఆకు కూర వండుకుంటారు. పండ్లు తింటారు.

తీకుర్ కాందా(కర్కుమా అంగుస్టిఫోలియా): దుంపతో పాలపొడి తయారుచేసుకుని పాయసం కాచుకుని తింటారు.

కొండ గోగు చెట్టు (కక్లొస్పెర్మం రిలిజియోజం): లేత కాయలను కూర వండుకుంటారు.

ఉప్పు శనగ/ ఉప్పు దవనం/ దవన తులసి(క్రిసా క్రిటికా): లేత చిగుళ్ళను కూర వండుకుంటారు.

రెయ్యి కాళ్ళ గడ్డి/ మక్రాఘాస్(డాక్టిలొక్టినియం ఈజిప్టియం): గింజలు పిండి చేసుకుని రొట్టె కాల్చుకు తింటారు. ఉంగరాల పెడిమి (హ్యుగనియా మిస్టాక్స్) : పండ్లు తింటారు.

తూటి ఆకు (ఐపోమియా అక్వాటికా) : లేత ఆకు కూర వండుకుంటారు.

కాలాదానా బెల్ (ఐపోమియా నిల్) : లేత ఆకు కూర వండుకుంటారు.

అడవి సిరిమల్లి (జాస్మినం ఆరిక్యులేటం): లేత ఆకు కూర వండుకుంటారు

మైదా లక్డి(లిట్సియా గ్లూటినోజా): పండ్లు తింటారు.

నీటి లవంగం(లుడ్విగియా ఏడ్సెండెన్స్ ఢ లుడ్విగియా పెరెన్నిస్): లేత ఆకు కూర వండుకుంటారు.

– కొప్పుల హేమాద్రి

సరిలేరు నీకెవ్వరూ నట-దర్శక సార్వభౌమ ఎన్టీఆర్

ఎన్.టి. రామారావు పేరు వినగానే ఆయన ధరించిన రాముడు, కృష్ణుడు పాత్రలు గుర్తువస్తాయి. రాజకీయ పరంగా చూస్తే తెలుగుదేశం పార్టీ స్థాపన, ముఖ్యమంత్రిత్వం గుర్తువస్తాయి. ఆయన మంచి దర్శకుడు కూడా అనీ, సీతారామకళ్యాణం, వరకట్నం, కృష్ణపాండవీయం లాంటి సినిమాల దర్శకుడనీ చట్టున గుర్తురాదు -ఆయన గొప్ప నటుడిగా ముద్రవేసుకోవడం వల్ల.

ఒక 'పాతాళభైరవి', ఒక 'మల్లీశ్వరి' చిత్రాల షూటింగ్స్ లో వున్నపుడే, రామారావుగారికి దర్శకత్వం చేపట్టాలన్న ఆశ ఎక్కడో ఒక మూల పొంచి వుండేది. కె.వి రెడ్డిగారు, బి.ఎన్. రెడ్డిగారు, ఎల్.వి ప్రసాద్‌ల వంటి ఉద్దండుల దర్శకత్వంలో నటిస్తూ, వారి వారి దర్శకత్వ లక్షణాన్ని గమనిస్తూ వుండేవారాయన.

"నేను దర్శకత్వం చేపట్టడానికి ప్రేరణ బి.ఎన్. రెడ్డిగారు, కె.వి రెడ్డిగారు" అని చెప్పేవారు రామారావు.

"నటుడిగా ఎత్తుకి ఎదిగి, రాణిస్తున్నారు కదా, కష్ట సాధ్యమైన దర్శకత్వం వేపు ఎందుకు వెళ్ళారు?" అని అడిగితే – "నేను నా సొంత చిత్రాలే డైరక్టు చేశాను. నా భావాలు నాకుంటాయి. అవి ఇంకొకరికి చెప్పి, 'ఇలా చెయ్యండి' అని చెప్పడం కంటె, నేనే డైరక్ట్ చేస్తే సరిపోతుంది కదా" అని, తన భావం వ్యక్తీకరించారు. 1961లో వచ్చిన 'సీతారామకల్యాణం' స్క్రిప్టును ఎపుడో సిద్ధం చేసుకున్నారు. తానే సినిమా అంతా డైరక్టు చేసినా, దర్శకుడిగా తన పేరు వేసుకోలేదు. 'ఎన్ఏటి యూనిట్' అని వేశారు. సినిమా విశేషాదరణ పొంది, దర్శకుడిగా ఆయన ప్రతిభని అందరూ ప్రశంసించడంతో, తర్వాత సినిమాకి తన పేరే వేసుకున్నారు.

ఐతే రామారావుగారు మహామొండి. ఒకవేపు చిత్రాల్లో పాత్రలు ధరిస్తూ సొంత సంస్థ నిర్వహణ చూసుకుంటూ, దర్శకత్వం కూడా చెయ్యడం అనితరసాధ్యం. శ్రీకృష్ణపాండవీయం, వరకట్నం, దానవీరశూరకర్ణ వంటి చిత్రాల్లో ప్రముఖ పాత్రలు ధరిస్తూ దర్శకత్వం కూడా చేశారంటే 'ఆహా' అనిపిస్తుంది. 'దానవీరశూరకర్ణ'లో వివిధ పాత్రలూ ధరిస్తూ, తన నటనను తానే చూసుకుంటూ



నిర్వహించడం మాటలా! కాకపోయినా, 'గులేబకావళి', 'పాండురంగమహత్యం' చిత్రాలకు దర్శకుడిగా కమలాకర్ కామేశ్వరరావుగారి పేరు వేసినా, సెట్లో షాట్సు వగైరాలు రామారావే చూసుకున్నారు " 'పాండురంగ మహత్యం' కథ, స్క్రిప్టు వరకూ బాధ్యత వహించాను. నన్ను సంప్రదిస్తూ ఆయనే షాట్సు తీసుకునేవారు. మంచిచెడ్డలు చెప్పేవాడిని" అని కామేశ్వరరావు గారు చెప్పారు. దర్శకుడు ఎవరైనా, షూటింగ్‌లో నటులకు నటన చెప్పడం, దర్శకుడిని సంప్రదిస్తూ షాట్సు తియ్యడం చేసేవారు. 'చాణక్యచంద్రగుప్త' 'దానవీ-రశూరకర్ణ' చిత్రాలు రెండూ ఒకే కాలంలో షూటింగ్ జరుపుకున్నాయి. రామారావు గారి శక్తి సామర్థ్యాలు, దీక్షా అంచనాకి దొరకవు. ఈ చిత్రాలు ఒకటి, పగలు, ఒకటి రాత్రి – అలా జరిగిన రోజులు కూడా వున్నాయి. రెండు చిత్రాలకూ దర్శకుడు ఆయనే ! వాటిలో ప్రధాన పాత్రధారీ ఆయనే!

రామారావు గారు స్క్రిప్టు పూర్తయితే గాని షూటింగ్‌కి వెళ్లేవారు కాదు. కథ, దృశ్యాలు అమరిక మీద ఆయనకి పట్టువుండేది. ఏదో తానూ దర్శకుడు అనిపించుకోవాలన్న దృకృథంతో కాకుండా, దర్శకత్వం తెలుసుకొని, ఆయన ఆ బాధ్యత చేపట్టారు. ఐతే, తన చిత్రాల మాట అటుంచితే ఇతర దర్శకుల దగ్గర, ఇతరుల చిత్రాల్లో నటిస్తున్నప్పుడు-ఒక మాట మాట్లాడే వారు కాదు. తనేమిటో తన పాత్ర ఏమిటో – అంతే! దర్శకుడి 'టేకింగ్' విషయంలో ఏనాడూ వేలుపెట్టలేదు. (ఇవాళ దాదాపు హీరోలందరూ దర్శకులకి సలహాలు ఇచ్చి, షాట్స్ తీయిస్తున్నారు) క్రమశిక్షణతో షూటింగ్ వేళలో నిశ్శబ్దం పాటించేవారు. నటీనటులు నటిస్తున్నప్పుడు ఆంగికం కంటే భావం చూసేవారు. క్లోజప్ షాట్స్ లో ముఖంలో ఆయన అనుకున్న భావం వచ్చే వరకూ వదిలిపెట్టేవారు కాదు.

నేను – 'వరకట్నం' సినిమా నుంచి, ఆయన సొంత చిత్రాల్లో – ఎనిమిదింటిలో నటించాను. 'తల్లాపెళ్లమా', 'కోడలుదిద్దిన కాపురం', 'కులగౌరవం', 'వేములవాడ భీమకవి'-మొదలైనవి. 'వేములవాడ భీమకవి'లో నాది ముఖ్యమైన పాత్ర. ఒక దృశ్యంలో ఒక పేజీ డైలాగుంది. బ్రాహ్మణుల్ని ఉద్దేశిస్తూ ఎమోషనల్‌గా చెప్పే డైలాగ్. కంఠస్థం చేశాను. సెట్లోకి వెళుతూ " అన్నగారూ! డైలాగ్ ఇలా అనుకున్నాను ఒకసారి చెప్తాను వింటారా" అని అడిగితే, ఆయన సంతోషించి – "గూడ్ చెప్పండి" అన్నారు. చెప్పాను. "బాగుంది బ్రదర్. అలాగే చెప్పండి" అన్నారు. ముందుగానే ఆయన ముద్ర పొందడం వల్ల -ఎక్కువ టేకులు తినక్కర్లేదు కదా!


ఆయనకు గొప్పజ్ఞాపకశక్తి. దృశ్యం అంతా నోటికి వచ్చేసేది. అందరి డైలాగులూ, కాగితాలు చూపకుండా సరిదిద్దేవారు. నటుడిగా తాను నటించే పాత్రకి సంబంధించిన డైలాగ్స్‌ని రెండుమూడుసార్లు చదివితే, నోటికి వచ్చేసేది. నేను 'నర్తనశాల'కి పనిచేసినప్పుడు చూశానుకదా, ఏ డైలాగూ 'మార్చండి' అనిగాని, ఇలా మారిస్తే బాగుంటుందని గాని, ఒక్కనాడూ అనలేదు! 'గొప్ప గొప్ప రచయితలు రాసిన సంభాషణల్ని మార్చమని చెప్పడానికి మనం ఎవరం?' అన్న భావం వుండేది. (ఇవాళ పూర్తిగా తారుమారు. అదే, నేటి సినిమా దురదృష్టం!)

రామారావు గారు తపశ్శాలి. నటుడిగా ఎలాంటి తపస్సు చేసేవారో, దర్శకుడి గానూ అంతటి తపస్సు చేసేవారు. దర్శకుడిగా కూడా రామారావు గారిది ఉన్నతస్థానమే!

– రావి కొండలరావు

(క్రీ.శ. 5వ శతాబ్ది)

సింహవర్మ వేసంత ప్రాకృత రాగిరేకు శాసనం



శాసనం

జితమ్భగవతా శ్రీ విజయ కాఞ్చీపురాత్ పరమ బ్రహ్మాణ్యస్య విధి విహిత సర్వ్వమ
య్యాాదస్య క్షితతలావతీణ్ణ త్రిదశపతి తుల్యప్రభావస్య ప్రతాపోపనత
సర్వ్వ రాజమణ్డలస్య అభ్యుచ్ఛిత శక్తిసిద్ధి సమ్పన్నస్య మహార (రా)జ
స్యశ్రీ విజయ వీరవమ్మ్ణః పౌత్ర: అమృతవిష సమప్రసాద కోపస్య
లోకోపచయ ప్రవృత్త సర్వ్వా రమ్భస్య వసన్తమాస ఇవ సర్వ్వ జననయన

జితం భగవతా! విజయ కాఞ్చీపురమునుండి పరమ బ్రాహ్మణ్యుడును, శాస్త్రవిహితమగునట్లు ఆచరించు వాడును, క్షితితలముపై అవతరించిన దేవేంద్రుడాయను నట్టి ప్రభావముగల వాడును ప్రతాపము చేత లోబరచుకొన్న సమస్త సామన్త రాజమణ్డలము గలవాడును, అభ్యున్నతి గాంచిన శక్తి త్రయసిద్ధి సంపత్తి గలవాడును అగు మహారాజ శ్రీ విజయవర్మ యొక్క మనుమడును, అమృతమువంటి ప్రసాదమును, విషయమువంటి కోపమును కలవాడును లోకోద్ధరణము కొరకైన సర్వారంభములు గలవాడును వసంతమాసమువలె సర్వజనులకు నయనానందకరుడైనవాడును....అని విజయవర్మ గుణాలను గురించి ఈ శాసనం వివరిస్తుంది.

– డా ఈమని శివనాగిరెడ్డి – స్థపతి

వెండితెర వెనుక

'చిత్రం భళారే విచిత్రం'



చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్ చిత్రాలలో 'దానవీ-రశూరకర్ణ' ఒకటి. ఆయన ఈ చిత్రం రూపొందించడానికి వెనుక ఓ చిన్న కథ ఉంది. తమిళంలో బి.ఆర్. పంతులు గారు భారీ ఎత్తున 'కర్ణ' చిత్రాన్ని నిర్మించారు. అందులో శివాజీ గణేశన్ కర్ణుడిగా, ఎన్టీఆర్ శ్రీ కృష్ణుడిగా నటించారు. అప్పట్లోనే ఎన్టీఆర్‌కు కర్ణుడి జీవితాన్ని సమగ్రంగా పరిశీలించి సినిమాగా తీయాలనే ఆలోచన వచ్చింది. స్క్రిప్టు తయారైన తర్వాత, ఒక దశలో కర్ణ పాత్ర ధరించమని అక్కినేనిని కోరారు. అక్కినేని సున్నితంగా తన విముఖతను తెలియజేశారు. దాంతో కృష్ణ పాత్రనైనా ధరించమంటే, అందుకూ ఆయన అంగీకరించ లేదు. ఇక అప్పుడు ఎన్టీఆర్ –శ్రీకృష్ణ, కర్ణ, సుయోధన పాత్రలను పోషించి, ఆ చిత్రానికి తానే దర్శకత్వం వహించారు. విశేషం ఏమిటంటే – 10 పాటలు, 35 పద్యాలు గల ఆ 25 రీళ్ల చిత్రాన్ని 43 రోజుల్లో పూర్తి చేశారు. తుది మెరుగులు దిద్ది విడుదల చేశాక ఆ చిత్రాన్ని 4 గంటల 7 నిమిషల సేపు చూడవలసి వచ్చినా, టెక్నికల్‌గా అంత బాగోలేదని, ట్రిక్ ఫోటోగ్రఫీలో తాళ్లూ, దారాలు వంటివి కనిపించాయనే విమర్శలు వచ్చినా, అవతల హీరోకృష్ణ నిర్మాతగా, కథానాయకుడుగా కమలాకర్ కామేశ్వరరావు గారి దర్శకత్వంలో తయారైన, 'కురుక్షేత్రం' పోటీగా నిలిచినా– 'దానవీరశూరకర్ణ' చిత్రం అఖండ విజయం సాధించి, ఎన్టీఆర్ కీర్తికిరీటంలో మరో కలికితురాయిగా నిలిచింది.

"ప్రేమలోనే అదృష్టవంతుణ్ణి"

కమలహాసన్ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మరుదనాయకం' ను మళ్లీ 'రివైవ్' చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు.



'మరుదనాయకం' అంటే 18 వ శతాబ్దంలో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన ఓ మహావీరుని కథ. ఈ చిత్రం షూటింగ్‌ను ఆయన 1998లో క్వీన్ ఎలిజబెత్ చేత చెన్నైలో ప్రారంభింపజేయడం అందరినీ ది గ్భ్రాంతికి గురిచేసింది. ఆ తర్వాత రాజస్థాన్‌లో భారీ ఎత్తున యుద్ధ సన్నివేశాలను తీయడానికి కమల ఎన్నో లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. ఆ తర్వాత ఆర్థికవనరులు సమకూరకపోవడంతో ఆ చిత్ర నిర్మాణం ఆగిపోయింది! ఇప్పుడు మళ్లీ ఆ చిత్రాన్ని పట్టాలమీదికి ఎక్కించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏ సినిమా తీయాలన్నా, అది ఏ విధంగా ప్రయోగాత్మకంగా ఉండాలనేది కమల్ అభిమతం. ఆ ప్రయోగాలలో జయాపజయాలను చవిచూడడానికి ఆయన బాగా అలవాటు పడిపోయారు. ఇదిలా ఉంటే, వివాహాల విషయంలో కమల్ మొదటి నుంచీ అపజయాల్నే ఎదుర్కోవలసి వచ్చింది! మొదటి పెళ్లి నర్తకి వాణీగణపతితో 1978 లో జరిగి, అది ఏడేళ్లు కొనసాగింది. ఆ తర్వాత హిందీనటి సారిక అతని జీవితంలో రెండవ భార్యగా అడుగుపెట్టింది. ఇద్దరమ్మాయిలు (శ్రుతిహాసన్, అక్షర) పుట్టక ఆ పెళ్లి కూడా బెడిసికొట్టింది. ప్రస్తుతం కమల్, నాటి నటీమణి గౌతమి " మేము సహజీవనం చేస్తున్నాం " అంటున్నారు. ఈ విషయాలను ప్రస్తావిస్తే, "నేను ప్రేమలో అదృష్టవంతుణ్ణే కాని పెళ్లిలో కాదు" అంటారు కమల్!

ఆరుద్ర పాటలో 'బూతు'?



'ఆరుద్రగారు వ్యక్తిగా మార్క్సిస్టు, నాస్తిక భావాలు గలవారైనా, సినిమాల కోసం ఆయన భక్తి పాటలు రాశారు. శ్రీరాముడిపై చిత్రానుగుణంగా ఆయన రాసిన పాటలు – 'శ్రీరామనామాలు శతకోటి' (మీనా), 'రాయినైనా కాకపోతిని రామ పాదము సోకగా (గోరంత దీపం) వంటివి భక్త జనకోటికి అభిమానపాత్రమయ్యాయి. అలాగే ఆయన రాసిన కొంటె పాటలు 'ము...ము....ముద్దంటే చేదా (అదృష్టవంతులు), 'ఏస్కో నారాజా ఏస్కో..ఆకేస్కో వక్కేస్కో.. ఆ పైన చూస్కో' వంటివి సామాన్య ప్రేక్షకులను గిలిగింతలు పెట్టాయి. అలాంటి పాటలకు సెన్సారు సమస్యలేమీ ఎదురుకో కపోయినా, ఎవరూ ఊహించని విధంగా 'వీరాభిమన్యు' (1965) చిత్రంలోని ఓ ఆరుద్ర పాటలో కొన్ని చరణాలకు సెన్సారు వారు అభ్యంతరాన్ని లేవదీసి, సినిమా అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఆపాట ? 'రంభా ఊర్వశి తలదన్నే రమణీలలాను ఎవరీమె...' ప్రేక్షకులకు సుపరిచితం. ఆ పాటలో ఆరుద్రగారు ఒక చోట – "తనవి తీరా వనిత పరువం తాకజాలని కరమేలా... కలికి ఒడిలో పులకరించి కరిగిపోవని తనువేలా" అని రాసిన చరణాలు సెన్సారు వారికి బూతుగా అనిపించి, వాటికి అభ్యంతరం చెప్పారు. ఎంత చెప్పినా, వాళ్లు అంగీకరించకపోవడంతో ఆరుద్రగారు మళ్లీ ఆ చరణాలను మార్చి రాయవలసి వచ్చింది! మరి అదే సెన్సారు వారు "కసిగా ఉంది...కసికసిగా ఉంది (ఎదురులేని మనిషి), "లే...లే...నా రాజా....లేవనంటావా... నన్ను లేపమంటావా" (ప్రేమనగర్) లాంటి ఎన్నో పాటలకు ఆ పాటల్లో వచ్చిన ప్రత్యక్ష, పరోక్ష బూతు పదాలకు అభ్యంతరం చెప్పలేదు కదా..." అని ప్రేక్షకులు ప్రశ్నించినా, వాటికి సమాధానం చెప్పేవారెవరు?

బార్‌ట్లీ ప్రశంసాపత్రం!



ప్రసిద్ధ ఛాయాగ్రహణ దర్శకుడు మార్కస్ బార్‌ట్లీ అంటే ఈ తరం సినిమా అభిమానులు కొందరికి తెలియకపోవచ్చు. కాని 'స్వర్గసీమ' 'షావుకారు', 'పాతాళభైరవి', విజయావారి 'మాయాబజారు', 'మిస్సమ్మ', 'శ్రీకృష్ణ సత్య,' వంటి ప్రముఖ చిత్రాల 'సినిమాటోగ్రఫీ' విలువలు చూస్తే ఆయన ప్రతిభ ఏమిటో తెలుస్తుంది. ఆయన ఉత్తమ ఛాయాగ్రాహకుడిగా 'శాంతినిలయం' అనే తమిళ చిత్రానికి జాతీయ బహుమతి కూడా అందుకున్నారు. ఆయన ఆంగ్లో ఇండియన్ క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రచారానికి ఎప్పుడూ దూరంగా ఉండేవారు. వయసు పైబడిన తర్వాత సినిమాటోగ్రఫీని వదిలిపెట్టి, కెమేరాల సర్వీసింగ్‌పై దృష్టి మరల్చి, అందులో నైపుణ్యం సాధించారు.

ఒక సందర్భంలో – మరో ప్రముఖ ఛాయాగ్రాహకుడు అశోక్ కుమార్ తన కెమేరాను సర్వీసింగ్ కోసం బార్‌ట్లీ వద్దకు పంపించారు. మోహన్ – సుహాసిని నటించిన 'నెంజత్తై కిళ్లాదే' (తెలుగులో 'మౌనగీతం' గా అనువదించబడింది) చిత్రానికి ఉత్తమ ఛాయాగ్రహకుడిగా జాతీయ బహుమతి గెల్చుకున్నారు. బార్ ట్లే – కెమేరా సర్వీసింగ్ పూర్తయ్యాక కెమేరాను అశోక్ కుమార్‌కు పంపిస్తూ "నేను మీ 'నెంజత్తై కిళ్లాదే' సినిమా చూశాను. అందులో మీ పనితనం చాలా బావుంది" అని ఓ చీటీమీద తన కాంప్లిమెంట్ కూడా రాసి పంపించారు. అది చూసి అశోక్ కుమార్ ఎంతగా సంబరపడిపోయారంటే, బార్ ట్లీ ప్రశంస అన్ని అవార్డులకంటే మిన్నగా భావిస్తూ, ఆ నోట్‌ను పెద్దగా ఫ్రేమ్ చేసి హాల్లో పెట్టుకుని, తన ఇంటికి వచ్చిన వారందరికీ సగర్వంగా చూపేవారు. బార్ ట్లీ అంటే ఛాయాగ్రాహకులకు అంత గౌరవం.

– బి.కె. ఈశ్వర్

